thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు


సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 14 కరీంనగర్ మంగళవారం, 25 మార్చి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ

న్యూఢిల్లీ : "ఎన్నికల సంఘం ఓ విఫల సంస్థ" అని సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబ్బల్ ఆరోపించారు. రాజ్యాంగంలో పేర్కొన్నట్లు ఆ సంస్థ తన విధులను నిర్వర్తించడం లేదని, సమాజంలో అత్యధిక శాతం ప్రజలు దానిపై నమ్మకం కోల్పోయారని చెప్పారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమన్నారు. డీలిమిటేషన్ అంశం దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. దేశ న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతోందన్నారు. జడ్జిల నియామకంతోపాటు ప్రస్తుతం ఉన్న వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదని.. ఈ సమస్యను ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ గుర్తించినప్పుడే ఇందులో మార్పు వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.




హైదరాబాద్ : తెలంగాణలో హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం సోమవారం(మార్చి 24) విడుదల చేసింది. ఈ ఎన్నికలు ప్రస్తుత ఎమ్మెల్సీ ఎంఎస్.ప్రభాకర్ రావు పదవీ కాలం మే 1న ముగియనున్న నేపథ్యంలో ఎన్నిల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం క్రింది తేదీలు ఇలా ఉన్నాయి.

మార్చి 28, 2025: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం. ఏప్రిల్ 4, 2025: నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. ఏప్రిల్ 7, 2025: నామినేషన్ల పరిశీలన. ఏప్రిల్ 9, 2025: నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. ఏప్రిల్ 23, 2025: పోలింగ్ రోజు. ఏప్రిల్ 25, 2025: ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన. ఈ ఎన్నికల్లో హైదరాబాద్ జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధులు (కార్పొరేటర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వంటి వారు) ఓటర్లుగా పాల్గొంటారు. తెలంగాణ శాసనమండలి లోని ఈ స్థానం కోసం రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ షెడ్యూల్ ప్రకటనతో ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా అమలులోకి వచ్చింది.

**ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు వీరే..** స్థానిక సంస్థల ఓటర్లు అంటే హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, వీరు శాసనమండలిలో ఎమ్మెల్సీ స్థానాన్ని ఎన్నుకునే అర్హత కలిగి ఉంటారు. వీరిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, హైదరాబాద్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వంటి వారు ఉంటారు. ఈ ఓటర్లు స్థానిక సంస్థల ప్రాతినిధ్యం వహిస్తూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే హక్కును కలిగి ఉంటారు.

ప్రస్తుతం, మార్చి 24 నాటికి ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, ఈ ఎన్నిక హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల కోటా కింద జరుగుతుంది. ఓటర్ల సంఖ్య కచ్చితంగా జిల్లాలోని స్థానిక సంస్థల ప్రతినిధుల ఆధారంగా నిర్ణయించబడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లు కేవలం ఎన్నికైన ప్రతినిధులు మాత్రమే. GHMC లో 150 కార్పొరేటర్ వార్డులు ఉండగా, వీరితోపాటు ఇతర స్థానిక సంస్థల నుంచి సుమారు 200-250 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉంది. ఈ సంఖ్య ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన తర్వాత స్పష్టమవుతుంది.

**ఏప్రిల్3న పోలింగ్..** ఈ ఎన్నికల్లో ఓటింగ్ ఏప్రిల్ 23న జరుగుతుంది, మరియు ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 25, 2025న ఉంటుంది. ఓటర్ల జాబితా తయారీలో భాగంగా, స్థానిక సంస్థల ప్రతినిధుల వివరాలను సేకరించి, ఎన్నికల సంఘం వారి అర్హతను ధ్రువీకరిస్తుంది. ఈ ప్రక్రియలో ఎలాంటి గందరగోళం లేకుండా చూసేందుకు కఠినమైన నిబంధనలు అమలు చేస్తారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని, సొంత నియోజకవర్గానికి కూడా రావడం లేదని గజ్వేల్ కాంగ్రెస్ నేతలు విమర్శించారు. అసెంబ్లీకి హాజరుకాని కేసీఆర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో సిద్ధిపేట జిల్లా కలెక్టరేట్ నుంచి రాజ్ భవన్ వరకు గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర చేపట్టాయి. ఈ క్రమంలో వారు రేవంత్ రెడ్డిని కలిశారు. ఆయనకు వినతిపత్రం అందించారు. అదేవిధంగా రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ కు వినతిపత్రం అందించనున్నారు.




# ఈ ఉగాదికి మంత్రివర్గ విస్తరణ!

## ఆ ఆరు బెర్తులను దక్కించుకునే అదృష్టవంతులెవరు?

## ఎవరి బెర్తుకు ఎసరు?

హైదరాబాద్ : తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? చాలాకాలంగా పెండింగ్ పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందా? ఈ సారి క్యాబినెట్ విస్తరణ సమీకరణాలు మారిపోయాయా? అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ఈ సారి మంత్రివర్గ విస్తరణ సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న ఆరు బెర్తులను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిసైడ్ అయిందట.

సామాజిక సమీకరణాల ఆధారంగా ఎవరెవరికి ఛాన్స్ ఇవ్వాలనే దానిపై కన్‌క్లూజన్‌కు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఉగాది రోజున మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్ చేశారని టాక్ వినిపిస్తోంది. మార్చి 30న మంత్రివర్గ ప్రమాణస్వీకారం ఖాయమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. క్యాబినెట్ విస్తరణలో సామాజిక సమీ కరణాలతో పాటు పార్టీ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం అవకాశాలు ఇవ్వాలని చూస్తున్నారట. నల్గొండ నుండి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి క్యాబినెట్ బెర్త్ పక్కా అని పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భువనగిరి ఎంపీ ఎన్నికల బాధ్యతలు ఇచ్చినప్పుడు అధిష్టానం ఆయనకు హామీ ఇచ్చినట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి బెర్తుకు ఎసరు? :** మరి అదే జరిగితే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి బెర్తుకు ఎసరు వస్తుందా అన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. గతంలోనూ రాంరెడ్డి దామోధర్ రెడ్డి, రాంరెడ్డి వెంకట్రెడ్డిలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇలానే రొటేట్ చేస్తూ ఛాన్స్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఇక ముదిరాజ్ సామాజికవర్గం నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌కు దాదాపు బెర్తు ఖాయమై పోయిందనే టాక్ నడుస్తోంది. ఇక మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ అమీర్ ఆలీఖాన్‌కు కూడా మైనార్టీ కోటాలో అవకాశం ఉండనున్నట్లు చెబుతున్నారు. ఇక లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ ఛాన్స్ దక్కించుకున్న అద్దంకి దయాకర్, విజయశాంతిని కూడా మంత్రివర్గంలోకి తీసుకుంటారని టాక్ నడుస్తోంది. విజయశాంతికి బీసీ మహిళా కోటాలో ఇవ్వాలని ఏఐసీసీ ఆలోచన చేస్తుందట. రాములమ్మకు అవకాశం ఇవ్వాలనుకుంటే..ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న మహిళా మంత్రుల్లో ఒక్కరికి ఉద్వాసన పలుకుతారని అంటున్నారు. విజయశాంతి స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లా ఏటూరునాగారం కావడం..అదే జిల్లా నుంచి ఇద్దరు మహిళా మంత్రులు ఆల్ రెడీ కేబినెట్ తో ఉండటంతో వారిలో ఒకరికి ఉద్వాసన తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. . ఇక అద్దంకి దయాకర్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనగా ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అద్దంకి కి ఛాన్స్ దక్కితే..ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రిపదవిపై ఆశలు పెట్టుకున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌కు నిరాశ తప్పదు. అద్దంకి, వివేక్ లలో ఒకరికి పక్కాగా క్యాబినెట్ బెర్త్ దక్కే అవకాశం ఉందట.

**క్యాబినెట్ బెర్త్ కోసం ఎదురుచూపులు...** ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రిపదవిపై ఆశలు పెట్టుకున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు అవకాశం దక్కకపోతే.. అదే సామాజికవర్గానికి చెందిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు ఇస్తారని అంటున్నారు. మదన్‌మోహన్ కాకపోతే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మెదక్ కోటాలో మైనంపల్లి రోహిత్ పేర్లు కూడా ప్రచారంలో వినిపిస్తున్నాయి. ఇక బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా క్యాబినెట్ బెర్త్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ కేబినెట్ లో ఉంటే మాత్రం సుదర్శన్ రెడ్డికి ఛాన్స్ లేనట్లే. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సీనియర్‌నేత మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రిపదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా అమాత్య రేసులో ఉండటంతో..ఈ ఇద్దరిలో ఒకరికి ఛాన్స్ పక్కానే. గ్రేటర్ పరిధిలో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి కావడం... ఆయన కాంగ్రెస్ లో ఎప్పటినుండో ఉండటం కలిసిరావచ్చు. అన్నీ అనుకున్నట్లు కుదురితే..తెలుగు సంవత్సరం ఉగాది రోజున తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఖాయమే.

# కేసీఆర్ కొంగొత్త రాజకీయం!

## కొత్త సీసాలో పాత సిరా నింపి!

## చంద్రబాబుని బూచీగా చూపి... సెంటిమెంట్ రగిలిస్తుండు!!



హైదరాబాద్ / అమరావతి : తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ఎస్ పార్టీ మాత్రమే అవసరం. అది మాత్రమే తెలంగాణ రాష్ట్రం, ప్రజలు, రైతుల గురించి పనిచేస్తుంది. కాంగ్రెస్ దోచుకోవడం తప్ప మరేమీ చేయలేదని కేసీఆర్ నిర్ధారించి చెప్పేశారు. ఎన్డీఏ ముసుగులో చంద్రబాబు నాయుడు మళ్ళీ తెలంగాణపై పెత్తనం చేయడానికి రాబోతున్నారని, కనుక తెలంగాణ ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని కేసీఆర్ చెప్పేశారు. తెలంగాణ సంపదపై అందరి కళ్ళు పడ్డాయని దానిని దోచుకుపోవడానికే ప్రయత్నిస్తున్నారని కేసీఆర్ కనిపెట్టి చెప్పారు. కనుక బీజేపిని తద్వారా చంద్రబాబు నాయుడుని అడ్డుకోవడం చాలా చాలా అవసరమని కేసీఆర్ తేల్చి చెప్పేశారు. "ప్రజలు నన్ను ఓడించి ఇంట్లో కూర్చోబెట్టి, కాంగ్రెస్ చేతికి కత్తి ఇచ్చి ఇప్పుడు నన్ను యుద్ధం చేయమంటే ఎలా చేయగలను?" అని తెలంగాణ ప్రజలను కేసీఆర్ ప్రశ్నించారు. కానీ ఆయన "చేయాల్సిన అవసరం నాకేమిటి?" అని అడుగుతున్నట్లనిపిస్తుంది. కేసీఆర్ ఇటీవల తన ఫామ్‌హౌస్‌లో బిఆర్ఎస్ నేతలతో సమావేశమైనప్పుడు, పనిలోపనిగా తన ఈ అభిప్రాయాలని, మనసులో ఆలోచనలను మీడియా ద్వారా తెలంగాణ ప్రజలకు చేరవేశారు. కేవలం తనకు మాత్రమే తెలంగాణ రాష్ట్రం, ప్రజల పట్ల నిబద్దత ఉందని, కనుక తాను మాత్రమే కాపాడగలనని చెప్పుకుంటున్న కేసీఆర్, తనను, తన పార్టీని 'తెలంగాణ సెంటిమెంట్' మాత్రమే కాపాడగలదని భావిస్తుండటం విచిత్రంగా అనిపిస్తుంది. అందుకోసం చంద్రబాబు నాయుడుని 'బూచి'గా చూపించేందుకు కేసీఆర్ వెనకాడటం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని వద్దనడానికి ఓ కారణం, బీజేపిని వద్దనడానికి మరో కారణం చెపుతున్నారు. ఉద్యమనేతగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ తెలంగాణలో మరే రాజకీయ పార్టీ ఉండకూడదని కోరుకోవడం, అందుకు ఇటువంటి రకరకల సాకులు చెపుతుండటం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఆయనకు మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వాలని, కంటి చూపుతో రాష్ట్ర రాజకీయాలను శాశించాలని మనసులో కోరిక ఉంటే తప్పు కాదు. కానీ ఇతర రాష్ట్రాలలో పార్టీని విస్తరించడం తప్పు కాదనుకున్న కేసీఆర్, తెలంగాణ రాష్ట్రంలో మరే పార్టీ ఉండకూడదని కోరుకోవడం రాచరిక, దొర లక్షణాలే కదా? ఇటువంటి రాచరిక పోకడలు మన ప్రజాస్వామ్యంలో గడ్డిపోచలా కొట్టుకుపోతుందని కేసీఆర్ అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. అయినా తన ఈ అప్రజాస్వామిక ఆలోచనలను చాలా తెలివిగా సమర్ధించుకుంటున్నారని అర్దమవుతూనే ఉంది. అంటే ఎన్నికలలో ఓడిపోయినా కేసీఆర్ ధోరణి ఏ మాత్రం మారలేదనడానికి ఈ మాటలే నిదర్శనం. కనుక మళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తున్న కేసీఆర్ పట్లే తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేసీఆర్ మాట్లాడిన ఈ మాటలే ఆయన బుర్రలో ఎటువంటి ఆలోచనలున్నాయో వెల్లడిస్తున్నాయి.

కనుక ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు, కూటమి నేతలు కూడా అప్రమత్తంగా ఉండటం చాలా అవసరం.

చురకలు





# సీఎం రేవంత్ రెడ్డి జపాన్ టూర్ షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి త్వరలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ను ఖరారు చేశారు అధికారులు. దాదాపు ఎనిమిది రోజులు జపాన్ పర్యటనలో ఉంటారు సీఎం రేవంత్. జపాన్ లోని కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారితన అభివృద్ధితో పాటు తెలంగాణకు పెట్టుబడులను తీసుకొచ్చే లక్ష్యంతో ఆయన ఈ పర్యటనకు వెళ్ళ్తున్నారు. తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సందర్భంగా జపాన్ సాంకేతిక అభివృద్ధిని అధ్యయనం చేయడంతోపాటు స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిందిగా వారిని కోరే ఛాన్స్ ఉంది. సీఎం ఏప్రిల్ నెలలో జపాన్ పర్యటనకు వెళ్తారు. ఏప్రిల్ 15 నుంచి 23 వరకు జపాన్ పర్యటన కు వెల్లనున్నారు. ఏప్రిల్ 15 లోపు డీ లిమిటేషన్ పై హైదరాబాద్ లో రెండో మీటింగ్ నిర్వహించే యోచనలో ఉన్నారు.

ఈ సమావేశం ముగిసిన వెంటనే ఆయన ఢిల్లీ బయల్దేరి.. అక్కడి నుంచి జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు.



# బెట్టింగ్ యాప్‌ల కేసుల్లో కీలక పరిణామం

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల కేసుల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మియాపూర్‌లో నమోదైన కేసులో భాగంగా యాప్‌ల యజమానులను పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు.

ఈ లిస్టులో మొత్తం 19 యాప్‌ల యజమానులున్నారు. జిగిల్ రమ్మీ డాట్ కామ్, ఏ 23, యోలో 247, ఫెయిర్ ప్లే, జీత్‌విన్, విబుక్, తాజ్ 77, వివి బుక్, ధనిబుక్ 365, మామ247, తెలుగు 365, ఎస్365, జై365, జెట్‌ఎక్స్, పరిమ్యాచ్, తాజ్777బుక్, ఆంధ్రా365 యాప్‌ల యజమానులను నిందితుల జాబితాలో చేర్చారు. ఈ మేరకు పోలీసులు వారికి నోటీసులు ఇచ్చి విచారించనున్నారు.

ఈ కేసు విచారణలో భాగంగా ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా 25 మందిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

# ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ

హైదరాబాద్ : ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి నెలలోనే రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకుపైగా నమోదు అవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సాధారణ స్థాయితో పోలిస్తే 3.3 డిగ్రీలు ఎక్కువగా ఉన్నాయని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ వేదిక వరంగల్ నుంచి మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ కు మార్పు చేస్తున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రజితోత్సవ వేడుకల సందర్భంగా ఏప్రిల్ 27 వరంగల్‌లో భారీ బహిరంగసభను నిర్వహించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ బహిరంగ సభకు భారీ జనసమీకరణకు



ప్లాన్ చేసింది బీఆర్ఎస్. ఇప్పటికే కేటీఆర్ జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు కేటీఆర్.




# ముగిసిన శ్యామల విచారణ.. కీలక ప్రకటన!

బెట్టింగ్ యాప్ కేసులో శ్యామల విచారణ ముగిసింది. మూడు గంటల కు పైగా శ్యామలను పంజాగుట్ట పోలీసులు విచారించా రు. అయితే దీనిపై ఇప్పుడేమీ మాట్లాడలేనని, సమంజసం కాదని శ్యామల చెప్పింది. బెట్టింగ్ యాప్ లు, బెట్టింగ్లకు పాల్పడటం తప్పేనని ఒప్పుకుంది. పోలీసుల విచారణకు తాను పూర్తిస్థాయిలో సహకరిస్తున్నా. బెట్టింగ్ యాప్ ల ద్వారా చనిపోయిన వారిని ఎవరు భర్తీ చేయలేరని చెప్పింది.

**హైకోర్టులో పిటిషన్..** ఈ మేరకు ఒక సామాజిక కార్యకర్త ఫిర్యాదు మేరకు శ్యామలపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఆమెను విచారణకు రావాల్సిందిగా పోలీసులు నోటీసులు పంపించారు. ఆ నోటీసులకు ఆమె స్పందించకపోగా.. విచారణకు హాజరుకాకుండానే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

క్వాష్ పిటిషన్ కూడా దాఖలు చేయడంతో హైకోర్టు విచారించి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. యాంకర్ శ్యామలను అరెస్టు చేయవద్దని, నోటీసులు ఇచ్చి విచారించాలని పంజాగుట్ట పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సోమవారం పోలీసుల విచారణకు హాజరుకావాలని న్యాయస్థానం సూచించగా.. ఉదయమే విచారణకు హాజరైంది. ఆంధ్రా 365 అనే బెట్టింగ్ యాప్ను గత కొంతకాలంగా శ్యామల ప్రమోట్ చేసిన విషయం తెలిసిందే.

# ఎస్ఎల్ బీసీ రెస్క్యూ ఆపరేషన్ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

అచ్చంపేట : ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం విషయంలో సహాయక చర్యలను కొనసాగించాలని, నిరంతర పర్యవేక్షణకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎస్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇవాళ అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన రివ్యూ మీటింగ్‌కుమంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన సహాయక చర్యల పురోగతిపై అధికారులపై సీఎం ఆరా తీశారు. రెస్క్యూ ఆపరేషన్‌పై సీఎంకు ఆర్మీ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. కేంద్రం నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనలు తీసుకుంటూ రెస్క్యూ ఆపరేషన్‌లో ముందుకు వెళ్లాలని సూచించారు. కాగా, ఎస్ఎల్‌బీసీలో రెస్క్యూ ఆపరేషన్ 32వ రోజుకు చేరుకుంది. సొరంగంలో గత నెల 22న జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు గల్లంతయ్యారు. వారిలో గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహం మాత్రమే కొద్ది



రోజుల క్రితం లభ్యమైంది. మిగతా 7 మందిని గుర్తించేందుకు దేశంలోని అత్యుత్తమ ఏజెన్సీలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ పురోగతి కనిపించడం లేదు. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం దేశంలోనే అరుదైనదిగా నిపుణులు చెబుతున్నారు.



# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

భద్రాచలం : భద్రాచలంలో పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడిఉందని రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఏఎంసీ కాలనీలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 117 ఇండ్లను ఇటీవల పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందించిన ఇండ్లలో అన్ని వసతులు కల్పించామన్నారు. 2004 నుంచి 2014 వరకు 25లక్షల ఇందిరమ్మ ఇళ్లను కట్టించిన ఘనత కాంగ్రెస్? ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా ఇండ్లను వదిలేయడంతో వాటిని కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తున్నామని చెప్పారు. రూ. 1.40కోట్లతో మనుబోతుల చెరువు వద్ద నిర్మించిన డంపింగ్? యార్డును భద్రాచలం ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఐటీడీఏలోని ట్రైబల్? మ్యూజియాన్ని ఎంపీ బలరాంనాయక్?, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి సందర్శించారు. ప్రపంచానికి గిరిజన సంస్కృతిని పరిచయం చేసి కాపాడుకుందామని పిలుపునిచ్చారు. రంజాన్? పండుగ సందర్భంగా ముస్లింలకు బహుమతులు అందజేశారు. మంత్రి వెంట కలెక్టర్ జితేశ్ ?వి పాటిల్, ఐటీడీఏ పీవో బి.రాహుల్?, డీఆర్?డీఓ విద్యాచందన, డీడీ మణెమ్మ ఉన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసు.. సుప్రీంకోర్టులో శ్రవణ్‌కుమార్‌కు ఊరట

దిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రైవేటు ఛానెల్ ఎండీ శ్రవణ్ కుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. శ్రవణ్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసుల విచారణకు సహకరించాలని శ్రవణ్‌ను ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ఏప్రిల్ 28కి వాయిదా వేసింది. భారాస ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో శ్రవణ్ కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు... హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లు కూడా అక్రమంగా ట్యాపింగ్ చేసిన వ్యవహారంలో శ్రవణ్ కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. శ్రవణ్ కుమార్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించారు. ఆయనకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టును కోరారు. శ్రవణ్ కుమార్ అందుబాటులో ఉంటారని, విచారణకు సహకరిస్తారని శేషాద్రి నాయుడు పేర్కొన్నారు. ఇప్పటివరకు పోలీసులు సీఆర్‌పీసీ సెక్షన్ 41%ూ% కింద ఒక్క నోటీసు కూడా ఇవ్వలేదని వెల్లడించారు. అయితే, నిందితుడికి ఎలాంటి రక్షణ ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. శ్రవణ్ కుమార్ తప్పించుకుని అమెరికా వెళ్లిన నేపథ్యంలో ఆయనపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసినట్లు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది కాలంగా పరారీలోనే ఉన్నారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇవాళ శ్రవణ్ కుమార్‌ను అరెస్టు చేస్తున్నారా.. అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేయలేదని శేషాద్రి నాయుడు తెలిపారు. శ్రవణ్ కుమార్‌కి మధ్యంతర రక్షణ ఇవ్వకపోతే అతను భారతదేశానికి రాడని.. ముందు అతన్ని దేశానికి రానివ్వండి అని ధర్మాసనం పేర్కొంది. విచారణకు రావాలని నోటీసు అందితే భారత్‌కు వచ్చి విచారణకు సహకరించాలని శ్రవణ్ కుమార్‌ను ధర్మాసనం ఆదేశించింది. మధ్యంతర రక్షణ ఇస్తే 48 గంటల్లోగా శ్రవణ్ కుమార్ భారత్ వస్తారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# 'గ్రూప్-1' పేపర్లు రీవాల్యుయేషన్ జరిపించాలి.. తెలంగాణ హైకోర్టులో అభ్యర్థుల పిటిషన్

హైదరాబాద్: తెలంగాణలో నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గ్రూప్-1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "18 రకాల సబ్జెక్టులుంటే 12 సబ్జెక్టుల నిపుణులతోనే పేపర్లను దిద్దించారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో తెలుగు, ఇంగ్లీష్ మీడియం పేపర్లు మూల్యాంకనం చేయించారు. అలా చేయడం వల్ల మూల్యాంకనంలో నాణ్యత లోపించింది. తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగింది" అని పిటిషనర్లు పేర్కొన్నారు. పిటిషనర్ల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీజీపీఎస్సీ (%ుూాజ%)ని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# 11,298 ఎకరాల్లో పంట నష్టం.. ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక: తుమ్మల

హైదరాబాద్: ఈ ఏడాది మార్చి 21 నుంచి 23 వరకు వడగళ్ల వానలతో పంట నష్టం సంభవించింది. పంట నష్టంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక అందింది. దీనికి సంబంధించి తుది నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. 13 జిల్లాల్లోని 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశామని ఆయన తెలిపారు. 6,670 ఎకరాల్లో వరి, 4,100 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందన్నారు. 309 ఎకరాల్లో మామిడి, ఇతర పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి నివేదిక వచ్చాక పరిహారం చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు.



# ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి తెలంగాణ హైకోర్టులో ఊరట



హైదరాబాద్: ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. క్యాట్‌లో విచారణ తేలేవరకు తెలంగాణ నుంచి ఆయన్ను రిలీవ్ చేయవద్దని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇటీవల అభిషేక్ మహంతిని కేంద్ర హోంశాఖ ఏపీకి వెళ్లాలని ఆదేశించింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. క్యాట్‌లో విచారణ ముగిసేవరకు రిలీవ్ చేయవద్దని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈక్రమంలో ఆయన పిటిషన్‌ను త్వరగా తేల్చాలని క్యాట్‌ను హైకోర్టు ఆదేశించింది. అక్కడ విచారణ తేలేవరకు తెలంగాణ నుంచి రిలీవ్ చేయవద్దని తెలిపింది.

చురకలు



# దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త గోవారికర్

## మార్చి 25...వసంత్ గోవారికర్ జయంతి



భారత దేశం గర్వించదగిన శాస్త్రవేత్తలలో గోవారికర్ ప్రముఖులు. ఆయన అంతరిక్ష రంగంలో మరిచి పోలేని విశేష పరిశోధనలు చేసారు. భారత దేశంలో సైన్స్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా,1991%-%1993 మధ్యకాలంలో అప్పటి భారత ప్రధాని దివంగత పి.వి.నరసింహారావుకు శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించారు. భారత మాన్సూన్ నమూనా పితామహుడిగా పేరు గాంచిన ఆయన తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో వాతావరణ మార్పులను సూచించే వ్యవస్థను రూపొందించిన తొలి శాస్త్రవేత్త. ఆయన ఇస్రో కు ఛీఫ్ గా తన సేవలందించారు. వాతావరణం, జనాభా రంగాలలో కూడా తన సేవలనందించారు. 'పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డుల గ్రహీత. వసంత్ రాంచోండ్ గోవారికర్ (1933 మార్చి 25 - 2015 జనవరి 2) పూణేలో లో ఒక బ్రాహ్మణ కుటుంబంలో మార్చి 25, 1933 న జన్మించారు. తరువాత ఆయన మహారాష్ట్ర లోని కోల్హాపూర్ జిల్లాలో ప్రారంభ విద్య, గ్రాడ్యుయేషన్ చేసారు.1950ల ప్రారంభంలో పరిశోధనల నిమిత్తం ఇంగ్లాండు వెళ్లారు. ఆయన ఎం.ఎస్.సి, కెమికల్ ఇంజనీరింగ్ లో పి.హెచ్.డి లను డా.ఎఫ్.హెచ్.గార్నర్ అధ్వర్యంలో చేసారు. ఆయన పరిశోధనల ఫలితం "గార్నర్-గోవారికర్ సిద్ధాంతం". ఈ సిద్ధాంతం ఘన పదార్థాల నుండి ప్రవాహాలకు ఉష్ణము, ద్రవ్యరాశిల బదిలీ గూర్చి విశ్లేషణ చేయబడిన గ్రంథము. 1959 నుండి 1967 వరకు ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ఆయన మొదట హార్వెల్‌లోని (బ్రిటిష్) అటామిక్ ఎనర్జీ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో, తరువాత సమ్మర్ ఫీల్డ్‌లో పనిచేశారు. ఈ సంస్థ రాకెట్ మోటారుల ఉత్పత్తిలో పేరెన్నిక గన్నది. ఆయన ఆక్స్ఫర్డ్ తో పాటు కేంబ్రిడ్జ్ ఎగ్జామినేషన్ బోర్డ్ యొక్క ఎగ్జామినర్స్ బయటి ప్యానెల్ సభ్యుడిగా మరియు పెర్గామోన్ యొక్క బాహ్య సంపాదకీయ సిబ్బందిగా కూడా పని చేశారు. అక్కడ అనేక శాస్త్రీయ పుస్తకాలను సవరించడంలో సహాయం చేశారు. డాక్టర్ విక్రమ్ సారాభాయ్ సారథ్యంలో, డాక్టర్ గోవారికర్ 1967 లో తిరువనంత పురంలోని తుంబాలోని అంతరిక్ష కేంద్రంలో ప్రొపెల్లెంట్ ఇంజనీర్‌గా చేరారు. తరువాత ఈ కేంద్రం ఇతర అంతరిక్ష పరిశోధన సంస్థలతో కలిసి 1972 లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వి.ఎస్.ఎస్.సి) గొడుగు కిందకు వచ్చింది. డాక్టర్ గోవారికర్ 1973 లో కెమికల్స్ అండ్ మెటీరియల్స్ గ్రూప్ డైరెక్టర్ అయ్యారు, చివరకు 1979 లో సెంటర్ డైరెక్టర్ అయ్యారు. 1985 వరకు ఆ పదవిలో కొనసాగారు.1994 - 2000 మధ్య మరాఠీ విజ్ఞాన్ పరిషత్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. భారత దేశంలో మొట్ట మొదటి ప్రయోగ వాహనం ఎస్ఎల్వి 3, వి.ఎస్.ఎస్.సి డైరెక్టర్ గా ఉన్న కాలంలో విజయ వంతమైన విజయాన్ని సాధించింది. భారత దేశం యొక్క ప్రయోగ వాహనాల కోసం క్లిష్టమైన ఘన ఇంధన సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా స్వదేశీగా... అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చడంలో డాక్టర్ గోవారికర్ వృత్తి పరమైన నాయకత్వాన్ని అందించారు. ఇస్రో సంబంధిత 'సాలిడ్ ప్రొపెల్లెంట్ స్పేస్ బూస్టర్ ప్లాంట్' అయన నాయకత్వంలో 5,500 ఎకరాలకు పైగా భూమిని ఏర్పాటు చేశారు. ఆయన అంతరిక్ష పరిశోధన, వాతావరణ అంచనా, ఇతర అంశాల పై పరిశోధనలు చేశారు. గోవారికర్ యూకే అటామిక్ ఎనర్జీ అథారిటీలో కూడా పనిచేశారు. ఆయన శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా పనిచేశారు. ఆయన 1995 నుండి 1998 మధ్య పూణే విశ్వ విద్యాలయ ఉపకులపతిగా పనిచేశారు. ఆయన దేశంలోని మొట్టమొదటి రుతుపవనాల సూచన నమూనా వెనుక ఉన్న వ్యక్తి అయినందున 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ మాన్‌సూన్ మోడల్' గా ప్రసిద్ధి చెందారు. 1988 నుండి, ప్రభుత్వ వాతావరణ శాస్త్రవేత్తలు ఈ నమూనాను గోవారికర్ పేరు పెట్టారు. చాలా ఖచ్చితమైన రుతుపవనాల అంచనాలను ముందుగానే ఉపయోగిస్తున్నారు. పౌర సరఫరా, పంట పద్ధతులు, చమురు విత్తనాల దిగుమతి రంగాలలో తగిన సర్దుబాట్లు చేయడానికి ప్రణాళిక దారులకు ఈ నమూనా చాలా సహాయకారిగా నిరూపించ బడింది. దేశ ఉపగ్రహ పరిశోధన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రఖ్యాత శాస్త్రవేత్తల బృందంలో ఎపిజె కలాం, ఇ.వి. చిట్నిస్, ప్రమోద్ కాలే, యు.ఆర్. రావు వంటి వారి బృందంలో గోవారికర్ ఉన్నారు. ఆయనకు భారత దేశంలో ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ 1984 లో, పద్మభూషణ్ 2008 లో వచ్చాయి. ఆయన జనవరి 2 2015 శుక్రవారం నాడు పుణేలోని దీనానాథ్ మంగేష్కర్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ట్రంప్ కూతురుతో మామూలుగా ఉండదిక.. వైరల్ వీడియో



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ (43) మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి ఆమె రాజకీయాల ద్వారా కాకుండా తన అద్భుతమైన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రాచీన సంప్రదాయ మార్షల్ ఆర్ట్ అయిన జియూ-జిత్సు (జుజుత్సు)లో ఆమె సాధించిన ప్రావీణ్యం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల మియామీలోని ఓ వ్యాయామశాలలో ఇవాంక ట్రంప్ జుజుత్సు నైపుణ్యాలను ప్రదర్శించారు. బ్లూ బెల్ట్ ధరించిన ఆమె తన ప్రత్యర్థులను క్షణాల్లో మట్టి కరిపించారు.

ఆమె కనబరిచిన హస్త లాఘవం, వేగం అందరినీ ఇంప్రెస్ చేశాయి. ఇవాంక ట్రంప్ జుజుత్సులో ఎంతటి బలం, క్రమశిక్షణ కలిగి ఉన్నారో ఈ వీడియో స్పష్టం చేస్తోంది.

జుజుత్సులో బ్లూ బెల్ట్ సాధించడం అంత సులువైన విషయం కాదు. దీని కోసం ఎంతో సాధన, అంకితభావం ఉండాలి. ఇవాంక ట్రంప్ నిత్యం ఈ మార్షల్ ఆర్ట్‌ను సాధన చేస్తారని తెలుస్తోంది. ఆమె శిక్షణ పొందుతున్న వీడియోను చూసిన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇవాంక ట్రంప్ ఆయనకు సీనియర్ సలహాదారుగా సేవలందించిన విషయం తెలిసిందే.

అయితే ప్రస్తుతం ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటూ తన కుటుంబ బాధ్యతలకు, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తనకు లభించిన సమయాన్ని ఇలాంటి ఆసక్తికరమైన విషయాలపై వెచ్చిస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు. ఒకప్పుడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఇవాంక, ఇప్పుడు మార్షల్ ఆర్ట్స్ లోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు.


# కుప్పకూలిన 120 అడుగుల భారీ రథం.. షాకింగ్ వీడియో



బెంగళూరు సమీపంలోని అనేకల్ తాలూకా హస్కూరులో జరుగుతున్న ప్రసిద్ధ మద్దూరమ్మ జాతరలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన 120 అడుగుల భారీ రథం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. హస్కూరులో ప్రతి సంవత్సరం మద్దూరమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు చుట్టుపక్కల ఉన్న 10 గ్రామాల ప్రజలు తరలివస్తారు. జాతరలో భాగంగా భారీ రథాలను అలంకరించి ఊరేగించడం ఇక్కడి ఆచారం. ఈ సంవత్సరం కూడా జాతర కోసం గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఊరేగింపు కోసం నాలుగు రథాలను సిద్ధం చేశారు. ఈ రథాలను ట్రాక్టర్లు , ఎద్దుల సహాయంతో లాగడానికి సన్నాహాలు చేశారు. జాతరలో ప్రధాన ఆకర్షణగా నిలిచే 120 అడుగుల ఎత్తైన రథాన్ని తాళ్ల సహాయంతో పైకి లేపుతుండగా ప్రమాదం జరిగింది. రథాన్ని పైకి లేపుతున్న సమయంలో తాళ్లపై పట్టు కోల్పోవడంతో అది ఒకవైపు ఒరిగిపోయింది. క్షణాల్లోనే భారీ శబ్దంతో రథం నేలపై కుప్పకూలింది. ఈ హఠాత్ పరిణామానికి భక్తులు ఒక్కసారిగా పరుగులు తీశారు. ఈ ఘటనలో ఒకరు చనిపోయారు. మరికొంతమందికి గాయాలయ్యాయి. రథం కూలిన సమయంలో దాని సమీపంలో ఎక్కువ మంది భక్తులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే, రథం కూలిన దృశ్యం అక్కడున్నవారిని తీవ్రంగా కలచివేసింది.ఏదైనా అపశకునం జరిగిందా? అని పూజారులు శాంతిపూజలు చేశారు.

ఈ ఘటనపై స్థానిక అధికారులు స్పందించాల్సి ఉంది. రథం కూలడానికి గల కారణాలపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ, మద్దూరమ్మ జాతరలో చోటుచేసుకున్న ఈ ఘటన భక్తులను కలవరపాటుకు గురిచేసింది.

# గ్రోక్ అదుర్స్: ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో పాటు హిందీ రచ్చపై మస్క్ క్లారిటీ!




ట్విట్టర్‌లో సంచలనం సృష్టిస్తున్న ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' మరో అద్భుతమైన ఫీచర్‌తో యూజర్లను అలరించేందుకు సిద్ధమైంది. తాజాగా ఈ చాట్‌బాట్‌లో ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. యూజర్లు కేవలం టైప్ చేస్తే చాలు, గ్రోక్ ఆ ఫోటోను అద్భుతంగా ఎడిట్ చేసి చూపిస్తుంది. మార్ఫింగ్ చేసినా గుర్తుపట్టలేనంత సహజంగా ఈ ఎడిటింగ్ ఉంటుందని స్వయంగా ఎలాన్ మస్క్ ఒక వీడియోను షేర్ చేశారు. ఇదివరకే సూటిగా, సుత్తి లేకుండా సమాధానాలిస్తూ నెటిజన్ల దృష్టిని ఆకర్షించిన గ్రోక్, ఇప్పుడు ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో మరింత క్రేజ్ సంపాదించుకునేలా ఉంది. మరోవైపు, గ్రోక్ ఇటీవల భారత్‌లో హిందీ తిట్ల వివాదంతో వార్తల్లో నిలిచింది. కొంతమంది యూజర్లు అడిగిన ప్రశ్నలకు గ్రోక్ హిందీలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిందని ఆరోపించారు.

అయితే గ్రోక్ సినిమాలు, రాజకీయాలు, క్రీడలపై చాలా నిజాయితీగా సమాధానాలు ఇస్తోందని కొందరు నెటిజన్లు సమర్థిస్తున్నారు. ఈ వివాదంపై ఒక అంతర్జాతీయ మీడియా కథనం ప్రచురించగా ఎలాన్ మస్క్ నవ్వుతున్న ఎమోజీతో స్పందించారు. మస్క్ రిప్లై వైరల్ కావడంతో నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. ఒక నెటిజన్ మస్క్ పోస్ట్‌కు అర్థం ఏమిటని గ్రోక్‌ను ప్రశ్నించగా "భారత్‌లో నెలకొన్న ఈ రాజకీయ వివాదం నవ్వు తెప్పించేదిగా ఉందని ఆయన భావిస్తున్నట్లు" గ్రోక్ సమాధానమిచ్చింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్‌ఏఐ సంస్థ ఈ గ్రోక్ చాట్‌బాట్‌ను అభివృద్ధి చేసింది. ఇది భూమిపై అత్యంత తెలివైన ఏఐ సాధనమని మస్క్ అభివర్ణించారు. గ్రోక్ హిందీ భాషను కూడా ఉపయోగించగలదు. అయితే, కొన్ని అభ్యంతరకర పదాలు ఉండటం వివాదానికి దారితీసింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రోక్ వివాదంపై ఎక్స్ ప్రతినిధులతో కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి పేరును గ్రోక్ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు సృష్టించే వ్యక్తుల జాబితాలో చేర్చింది. దీనిపై దర్శకుడు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గ్రోక్ ఆయనకు క్షమాపణలు చెప్పింది.

ఇకపై ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని, వాస్తవాల ఆధారంగానే సమాధానాలు అందిస్తామని హామీ ఇచ్చింది. మొత్తానికి గ్రోక్ తన కొత్త ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో యూజర్లను ఆకట్టుకుంటుండగా, హిందీ తిట్ల వివాదం మాత్రం ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. ఈ వివాదంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో, రానున్న రోజుల్లో గ్రోక్ ఎలాంటి మార్పులు చేసుకుంటుందో చూడాలి.

# తాలిబాన్ నాయకుడికి స్వేచ్ఛ... ట్రంప్ సంచలన నిర్ణయం ఎందుకంటే..?


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకొన్న సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని ప్రపంచ దేశాలకు షాకిస్తే.. కొన్ని అమెరికా పౌరులకూ షాకిచ్చాయని చెబుతారు. ఈ సమయంలో తాలిబాన్ కీలక నాయకుడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అవును... అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు తీసుకున్న అనంతరం డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఆ జాబితాలో మరో నిర్ణయం చేరింది. ఇందులో భాగంగా... తాలిబాన్ కీలక నాయకుడికి ట్రంప్ స్వేచ్ఛను ప్రసాదించారు. గతంలో అతడిపై ప్రకటించిన క్యాష్ రివార్డును ఎత్తివేశారు. వివారాల్లోకి వెళ్తే... తాలిబాన్ కీలక నాయకుడు సిరాజుద్దీన్ హక్కానీపై గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని అమెరికా



ప్రకటించింది. ఎవరైనా సరే అతడిని పట్టిచ్చినా.. లేదా, అతడు ఎక్కడున్నాడనే సమాచారాన్ని తెలియజేసినా ఈ రివార్డు దక్కించుకోవచ్చని తెలిపింది. అయితే... తాజాగా ఆ రివార్డును ట్రంప్ సర్కార్ ఎత్తేసింది. ఈ సందర్భంగా.. తమ చెరలో ఉన్న దేశస్తుడిని విడుదల చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్తాన్ హోం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ మతీన్ ఖనీ తెలిపారు. వాస్తవానికి 2008లో ఆఫ్ఘన్ రాజధాని కాబుల్ లోని సెరెనా హోటల్ లో అమెరికా పౌరుడు డేవిడ్ హెస్లాతో పాటు ఆరుమంది మృతికి హక్కానీ ప్రధాన సూత్రధారి. ఆ తర్వాత అతన్ని హిట్ లిస్ట్ లో చేర్చింది అమెరికా. ఈ నేపథ్యంలో.. రెండేళ్లుగా అమెరికా చెరలో మగుతున్న అమెరికా పౌరుడు జార్జ్ గ్లెజ్మాన్ ను రిలీజ్ చేసినట్లు ఆఫ్గన్ ప్రభుత్వం తెలిపింది. గత వారమే అతనికి విముక్తి కల్పించినట్లు పేర్కొంది. దీని తర్వాత సిరాజుద్దీన్ పై విధించిన నగదు బహుమతిని అమెరికా ఎత్తేసింది. ఈ చర్చలకు ఖతర్ మధ్యవర్తిత్వం వహించగా.. జార్జ్ ని విడిపించడానికి రంగంలోకి దిగిన ట్రంప్.. హక్కానీ విషయంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

# 'రోజంతా నైటీ వేసుకోమంటున్నాడు'. భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు!

గుజరాత్ లోని అహ్మదాబాద్ లోగల జుహాపురాకు చెందిన 21 ఏళ్ల ఓ మహిళ.. తన భర్త, అత్తమామలు వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఉన్నప్పుడు రోజంతా నైటీ ధరించాలని భర్త బలవంతం చేస్తున్నాడని.. తాను ఎప్పుడు పడుకోవాలో, ఎప్పుడు నిద్రలేవాలో ఆయనే డిసైడ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది! అవును... 2023 మే నెలలో సౌదీ అరేబియాలో ఆ మహిళకు, ఓ డాక్టర్ కు వివాహం అయ్యింది. వివాహం తర్వాత ఆ మహిళ బాపునగర్ కు వెళ్లింది. అక్కడ భర్త, అత్తమామలతో నివసిస్తుంది! ఈ క్రమంలో తన భర్త డాక్టర్ అని, తాగుడుకు బాగా బానిసైపోయాడని, మాటలతో దూషించాడని ఆమె ఆరోపించింది. ఈ సమయంలో అత్తమామలకు అతని ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తే... వారు కూడా



అతనికే మద్దతు ఇచ్చి, మరింత దుర్భాషలాడటం ప్రారంభించారని ఆమె ఆరోపించారు. తాను ఎప్పుడు నిద్రపోవాలి, ఎప్పుడు లేవాలి అన్నీ ఆయనే నియంత్రిస్తున్నాడని.. ఆయన పడుకునే ముందు అతని కాళ్లకు మసాజ్ చేయాల్సి వస్తోందని కూడా ఆమె పేర్కొంది. ఈ క్రమంలో... గత ఏడాది మే నెలలో ఫ్యామిలీ అంతా కాశ్మీర్ కు వెళ్లి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని.. ఆ ట్రిప్ తర్వాత తాను తన పుట్టింటికి తిరిగి వచ్చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో మధ్యవర్తిత్వం కోసం ప్రయత్నించినప్పటికీ ఆమె భర్త రాజీకి ప్రయత్నించలేదని ఆమె ఆరోపించారు. దీంతో... తాజాగా ఆమె వెజల్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె చేసిన ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే... ఆమె భర్త నుంచి కానీ, ఆ ఫ్యామిలీ మెంబర్స్ నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు!

చురకలు

## సంపాదకీయం


# స్టాలిన్ ఉచ్చులో కమలం విలవిల !

రాజకీయాలు అంటే అట్లాగే ఉంటాయి. ఉన్నది లేనట్లుగా లేనిది ఉన్నట్లుగా చేయడమే రాజకీయం. ఈ విద్యలో ఆరి తేరిన వారే అందలాలు అందుకుంటారు. ఇదిలా ఉంటే తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బీజేపీ మీద మోడీ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారు అని ఇదంతా రాజకీయంగా మామూలే అని అనుకుంటున్నారు కానీ ఆయన ఏకంగా సౌత్ స్టేట్స్ లీడర్స్ ని ఒక చోట చేర్చి మోడీతో ఢీ కొడతారని అసలు ఊహించలేదు. ఏకంగా నలుగురు సీఎంలు స్టాలిన్ మీటింగ్ కి వచ్చారు. అదే విధంగా ఒక ఉప ముఖ్యమంత్రి. ఒక ప్రధాన రాష్ట్రంలో ప్రతిపక్ష నేతతో పాటు కీలక నేతలు అంతా హాజరయ్యారు. అలా వారిని అందరినీ చేర్చి దక్షిణాదికి బీజేపీ అన్యాయం చేస్తోంది అని ఎలుగెత్తిచాటారు స్టాలిన్. అంతటితో ఆయన ఊరుకోలేదు. హైదరాబాద్ లో రెండో విడత మీటింగ్ అన్నారు. ప్రజలలోకి ఈ ఇష్యూని తీసుకుని పోవడానికి బహిరంగ సభను కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. దాంతో దక్షిణాదిన బలపడడానికి కమలం పార్టీ గత కొన్నాళ్ళుగా చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతుంది అన్న ఆందోళన అయితే బీజేపీలో మొదలైంది. ఏపీలో ఎన్డీయేను స్థాపించిన బీజేపీ క్రమంగా తెలంగాణా మీదుగా తమిళనాడులోనూ పట్టు సాధించాలని చూస్తోంది. అయితే స్టాలిన్ అండ్ కో ఇపుడు చాటి చెబుతున్నట్లుగా సీట్లూ నిధులు అధికారాలు అన్ని విషయాలలో దక్షిణాదికి తీరని అన్యాయం కేంద్రంలోని బీజేపీ చేస్తోంది అంటే అది జనంలోకి వెళ్తే ఇబ్బందే అని భావిస్తోంది. మరీ ముఖ్యంగా ఇవన్నీ సున్నితమైన అంశాలు. దాంతో బీజేపీ ఆలస్యంగా అయినా మేలుకుంది. స్టాలిన్ మీద గట్టిగా తగులుకుంటోంది. ఆయనది అవినీతి కుటుంబ పాలన అంటోంది. లిక్కర్ స్కాం అని అంటోంది. ఎన్నికల స్టంట్ అంటోంది లేని దానిని తెచ్చి ఇష్యూ చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. దక్షిణాదికి కేంద్రం అన్యాయం చేయదని కూడా ఆయన స్పష్టం చేశారు. స్టాలిన్ లిక్కర్ స్కాం తమ రాష్ట్రంలో జరిగింది అన్న దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇతర కీలక నేతలు అంతా కూడా స్టాలిన్ మీద మండిపడుతున్నారు. స్టాలిన్ తన రాజకీయం కోసం బీజేపీని బదనాం చేస్తున్నారు అని కూడా ఫైర్ అవుతున్నారు. అయితే ఇండియా కూటమిలో ఇపుడు స్టాలిన్ ధీటైన నేతగా కనిపిస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఆయన దక్షిణాదిన కూటమిని కదుతున్నారు. దాంతో ఉత్తరాదిన తన ప్రాబల్యాన్ని నూరు శాతం విస్తరించుకున్న బీజేపీకి ఇక మిగిలింది దక్షిణాది మాత్రమే. అక్కడే ఆ పార్టీ ఆశలు మెండుగా ఉన్నాయి. పవన్ చరిష్మాతో చంద్రబాబు వంటి ఉద్ధండ నేత సహకారంతో బీజేపీని ఇంకా బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ చూస్తోంది. ఇపుడు బీజేపీ ఆశలకు విఘాతం కలిగేలా స్టాలిన్ మార్క్ పాలిటిక్స్ ఉండడంతో కమలనాధులకు మింగుడు పడడం లేదని అంటున్నారు. దక్షిణాదికి అన్యాయం చేయమని పదే పదే బీజేపీ పెద్దలు చెప్పుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే డీలిమిటేషన్ ఏ విధంగా చేస్తారు అన్నది బీజేపీ ఇప్పటికే స్పష్టంగా చెప్పడం లేదని దక్షిణాది పార్టీల నేతలు అంటున్నారు. అదే సమయంలో జీఎస్టీ పన్నుల విషయలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందా లేదా అని అంటున్నారు. ఈ రకమైన చర్చ కనుక మరింతగా ముదిరితే అసలుకే ఎసరు వస్తుంది అన్నది కమలానికి తెలుసు అంటున్నారు.

అయితే బీజేపీ స్టాలిన్ మీద కానీ ఆ మీటింగుకు వెళ్ళి వచ్చిన వారి మీద కానీ విమర్శలు చేస్తే ఉపయోగం లేదని అంటున్నారు. బీజేపీ చేయాల్సింది ఏమైనా ఉంది అంటే సౌత్ కి అన్యాయం జరగకుండా తన చర్యల ద్వారానే ప్రజల విశ్వాసం పొందాలని అంటున్నారు.

# పాపాలను తొలగించే ఏకాదశి పాప విమోచన ఏకాదశి - పాపవిమోచన ఏకాదశి సందర్భంగా...

ఉగాదికి ముందు ఫాల్గుణ మాసంలో కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశినే పాపవిమోచని ఏకాదశి అంటారు. దీనినే పాప నాశని ఏకాదశి అని కూడా అంటారు. అంటే పాపాలను తొలగించే ఏకాదశి అని అర్థం. పాపమోచని ఏకాదశి ప్రాముఖ్యతను శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునికి వివరించిన నేపథ్యం భవిష్యోత్తర పురాణంలో ఉంది. మంజు ఘోష అనే అప్సరస మేధావిని వైవాహిక జీవితంలోకి రప్పించిందని పురాణాలు చెబుతున్నాయి. పూర్వం మేధావి అనే మహర్షి తపస్సు చేసుకుంటుంటే ఇంద్రుడి ఆదేశానుసారం మంజుఘోష అనే అప్సరస తన నాట్యంతో ఆయన తపస్సు కు విఘ్నం కలిగించిందంట. ఆమె నాట్యానికి చలించిన మేధావి తన తపస్సుకి విఘ్నం కలిగించిందన్న ఆగ్రహంతో ఆ మంజుఘోషను శపించారట. ఈ ప్రత్యేకమైన ఏకాదశి వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఆమెకు శాపవిముక్తి కలుగుతుందని మహర్షి ఆమెకు చెప్పాడు. ఆయన సూచన మేరకు మంజుఘోష ఏకాదశి వ్రతం ఆచరించి శాప విముక్తి పొందింది. ఋషి తాను కూడా అప్సరస వలలో పడి పాపాలు చేసానని భావించి పాపమోచని ఏకాదశిని ఆచరించాలని నిర్ణయించుకున్నాడు. పాప



అంటే 'పాపం', 'మోచిని' అంటే తప్పించుకోవడం. ఈ విధంగా ఈ ఏకాదశి ప్రత్యేకంగా పాపాలను నాశనం చేయడంలో మరియు చేసిన పాపాలకు సంబంధించిన అపరాధాన్ని నాశనం చేయడంలో సహాయ పడుతుంది. చేసిన పాపాలను తొలగించినందున ఈ ఏకాదశిని పాపవిమోచని ఏకాదశి అని అన్నారు. ఈ రోజున ఏకాదశి వ్రతం పాటిస్తే తప్పక ఫలితం లభిస్తుందని పురాణాలు సైతం చెబుతున్నాయి. ఈరోజునే శ్రీకృష్ణునిని ఆందోళికోత్సవము జరుపుతారు. ఉయ్యాలలోని కృష్ణుని దర్శించినంత మాత్రమున కలికాలపు దోషాలు పోతాయని,. కృష్ణ ప్రతిమగల ఉయ్యాలను ఊచితే, వేయి అపరాధాలైనా క్షమింపబడతాయనీ, కోటి జన్మల పాపాలు తొలగడమే కాక విష్ణు సాయుజ్యము లభించగలదని పండితులు చెపుతారు. పాప మోచని ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే నిద్ర లేచి స్నానం చేయాలి. ఈ పవిత్రమైన రోజున శ్రీమహా విష్ణువు ఆలయానికి వెళ్లి ఆరాధించాలి. స్వామి వారికి ఈరోజు పసుపు రంగు దుస్తులను అర్పించాలి. దీని తర్వాత 11 పసుపు పువ్వులు, 11 రకాల తీపి పదార్థాలను స్వామికి అర్పించాలి. అనంతరం విష్ణువు నామాలను, మంత్రాలను జపించాలి. అదే విధంగా ఈ రోజంతా ఉపవాసం ఉండాలి. ఈ రోజున ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని ఆరాధిస్తే పాపాలు తొలగిపోతాయని శ్రీకృష్ణుడు స్వయంగా అర్జునుడికి చెప్పినట్టు పురాణ వచనం. అంతేకాకుండా ఈ వ్రతం ఆచరించిన వారికి మోక్షం కూడా లభిస్తుందట. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చరిత్ర మరిచిన చరితార్థుడైన జర్నలిస్టు గణేశ శంకర్ - మార్చి 25... గణేశ శంకర్ విద్యార్థి వర్ధంతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అందులో కొందరు గుర్తింపు లేకుండా పోయారు. ఆలాంటి వారిని సందర్భం వచ్చినప్పుడల్లా గుర్తు చేసుకోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసిన రెండు రోజుల తరువాత, మరొక అమర వీరుడు భారత దేశం కోసం తన ప్రాణాలను అర్పించాడు. 40ఏళ్ల వయసులో ఒక లక్ష్యం కోసం ప్రాణాలను పోగొట్టుకున్న అసలు సిసలైన దేశ భక్తుడు. అయితే దురదృష్ట వశాత్తూ చాలామంది ఆయనను, ఆయన త్యాగాన్ని మరచి పోయారు. ఆయన భగత్ సింగ్ లాంటి విప్లవ వీరులతో కలిసి పోరాడిన స్వాతంత్ర్య పోరాట యోధుడు, పాత్రికేయుడు, భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడు, జాతీయోద్యమ కారుడు. అను వాదకుడు, ముఖ్యంగా హిందీ వార్తాపత్రిక "ప్రతాప్" వ్యవస్థాపక సంపాదకుడిగా సుపరిచితుడు. ఒక వార్తా పత్రిక వేదికగా,18 సంవత్సరాల పాటు బ్రిటిష్ వలస పాలనపై రాజీ లేని పోరు సల్పి పోరాడిన దమ్మున్న ఎడిటర్. విద్యార్థి ఆయనే గణేశ్ శంకర్ విద్యార్థి. అరుదైన వ్యక్తిత్వం కలిగిన గణేష్ శంకర్ తనకు తానే తన పేరు చివర "విద్యార్థి" (జ్ఞానాన్ని కోరేవాడు) అనే పదాన్ని చేర్చుకున్నాడు. గణేశ్ శంకర్ విద్యార్థి (26 అక్టోబర్ 1890 %–% 25 మార్చి 1931) ఫతేపూర్ జిల్లా హాథ్‌గావ్ అనే గ్రామంలో ఒక క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. మంగోలి అనే గ్రామంలో ఒక మాధ్యమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే తండ్రి జయ నారాయణ్ శిక్షణలో ప్రాథమిక విద్యను అభ్యసించి తర్వాత మంగోలి, విదిశలలో హైస్కూలు విద్య చదివాడు. పేదరికం కారణంగా చదువు కొనసాగించ లేక గుమాస్తాగా, అధ్యాపకునిగా కాన్పూరులో పనిచేశాడు. ప్రజా జీవితం పట్ల, జర్నలిజం పట్ల ఆసక్తి కలిగివుండి జాతీయోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. విప్లవ భావాలను ప్రచారం చేస్తున్న కర్మయోగి, స్వరాజ్య అనే హిందీ ఉర్దూ పత్రికలకు ఆయన పంపిణీ దారుగా పనిచేస్తూ క్రమేపీ ఆ పత్రికలలో రచనలు చేయడం ప్రారంభించాడు. ఆ క్రమంలో "విద్యార్థి" అనే కలం పేరును పెట్టుకున్నాడు. ఆయన ప్రతిభ చూసి పండిట్ మహావీర్ ప్రసాద్ ద్వివేది 1911లో తన హిందీ సాహిత్య మాసపత్రిక "సరస్వతి"లో ఉప సంపాదకునిగా ఉద్యోగం ఇచ్చాడు. అయితే సాహిత్యం కంటే వర్తమాన విషయాలు, రాజకీయాలలో ఉన్న ఆసక్తితో హిందీ రాజకీయ వారపత్రిక "అభ్యుదయ"లో ఉప సంపాదకునిగా ఆయన చేరాడు. 1913లో కాన్పూరుకు తిరిగి వచ్చి పాత్రికేయుడిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా తన జీవితాన్ని మలుచు కున్నాడు. "ప్రతాప్" అనే విప్లవాత్మక వారపత్రికను స్థాపించి తను మరణించే వరకు 18 సంవత్సరాలపాటు నడిపాడు. ఆ పత్రిక అనతి కాలంలోనే అన్నిరకాల అణచివేతలు వ్యతిరేకంగా పోరాడే పత్రికగా గుర్తింపు పొందింది. ఆ పత్రిక ద్వారా గణేష్ శంకర్ రాయబరేలీ రైతుల పక్షాన, కాన్పూరు మిల్లు కార్మికుల పక్షాన నిలిచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు. ఫలితంగా పలుమార్లు న్యాయస్థానాలలో అభియోగాలను ఎదుర్కొని భారీ జరిమానాలను చెల్లించాడు. ఐదు సార్లు జైలుకు వెళ్ళి వచ్చాడు. 1916లో లక్నోలో మహాత్మా గాంధీని ఆయన తొలిసారి కలిసి జాతీయోద్యమంలో చేరాడు. 1917–18లలో హోమ్ రూల్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. కాన్పూర్ జౌళీ కార్మికుల మొదటి సమ్మెను ముందుకు నడిపించాడు. 1920లో ప్రతాప్ దినపత్రిక ఎడిషన్‌ను ఆరభించాడు. అదే ఏడాది రాయ్‌బరేలీ రైతాంగ పోరాటంలో అరెస్ట్ అయ్యి రెండేళ్ళు కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. 1922లో విడుదలైన వెంటనే ఫతేగఢ్‌లో ఒక సభలో రాజ్య ద్రోహాన్ని ప్రేరేపించే విధంగా ప్రసంగించాడనే కారణంతో తిరిగి వెంటనే అరెస్టు చేశారు. ఫతేగఢ్‌లో జరిగిన ప్రావిన్షియల్ పొలిటికల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడిగా శంకర్‌కు దేశద్రోహ ప్రసంగానికి జైలు శిక్ష విధించ బడింది. 1924లో భగత్‌సింగ్ కు సన్నిహితుడై ఆయన భగత్‌సింగ్‌తో కలిసి పోరాడాడు. తరువాత చంద్రశేఖర్ అజాద్‌కు కూడా సన్నిహితుడయ్యాడు. 1925లో స్వరాజ్ పార్టీ తరఫున ప్రావెన్షియల్ శాసన సభలకు



జరిగిన ఎన్నికలలో కాన్పూర్ నుండి శాసన సభ్యుడిగా ఎన్నికై 1929 వరకు కొనసాగాడు. 1929లో కాంగ్రెస్ పార్టీలో చేరాక తన సభ్యత్వానికి రాజీనామా చేశాడు. 1928లో మజ్దూర్ సభను స్థాపించి మరణించే వరకూ నాయకత్వం వహించాడు. 1929లో యునైటెడ్ ప్రావిన్స్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు. ఆ ప్రాంతంలో సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 1930లో గోరఖ్ పూర్, న్యూ ఢిల్లీలలో జరిగిన హిందీ సాహిత్య సమ్మేళనాలకు హాజరయ్యాడు. అదే సంవత్సరం తిరిగి అరెస్టయి జైలుకు వెళ్ళాడు. గాంధీ – ఇర్విన్ సంధి ప్రకారం 1931 మార్చి 9న విడుదలయ్యాడు. కరాచీలో జరిగే కాంగ్రెస్ సమావేశాలకు హాజరు కావాలని తయార వుతుండగా అదే సమయంలో కాన్పూరులో మత ఘర్షణలు చెలరేగాయి. గణేశ్ శంకర్ విద్యార్థి అల్లరి మూకల మధ్య నిలబడి వారిని వారించి వేలాది మంది అమాయకుల ప్రాణాలను కాపాడాడు. వారిలో హిందువులు, ముస్లిములు కూడా ఉన్నారు. ఈ ప్రయత్నంలో ఆయనను ఒక అల్లరి మూక దారుణంగా పొడిచి చంపింది. అలా మత పరమైన ఘర్షణలు అడ్డుకునే క్రమంలో 1931 మార్చి 25న అమరుడు అయినాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాల మిస్ట్...9440595494**

# సాటిలేని మేటి సంపాదకులు చలపతిరావు - మార్చి 25...మానికొండ చలపతిరావు వర్ధంతి





మానికొండ చలపతిరావు (1908 –1983) పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త, మానవతా వాది. నిర్భయమైన, నిష్పాక్షికమైన శక్తి వంతమైన, పాఠకులను ఎంతగానో ఆకట్టుకునే రచనలకు చలపతి రావు, భారత దేశం లోనే ఇంగ్లీష్ జర్నలిజంలో గొప్ప సంపాదకులుగా మిగిలి పోయారు. భారతదేశ ప్రభుత్వం ప్రెస్ కమిషన్ (%ుౌతీవం జశీఎఎఱం- ంఱశీఅ%) ఏర్పాటు చేయడానికి ఆయనే ప్రధాన కారకులు. మానికొండ చలపతి రావు1908 సంవత్సరంలో విశాఖపట్నంలో జన్మించారు. బాల్యం నుండి ఆయన జర్నలిస్టు కావాలని అనుకోలేదు. అయితే వార్తా పత్రిక లను మొదటి నుండి చివరి వరకు ఆసాంతం ఇష్టంగా చదివే అలవాటు చేసుకున్నారు. ఎం.ఏ., బి.ఎల్. పట్టాలను పొంది కొంతకాలం న్యాయవాదిగా పని చేశారు. ఆయన విశాఖ పట్నంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన "ఎథేనియం" అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను నెలకొల్పి తాను కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత "పీపుల్స్ వాయిస్", "వీక్ ఎండ్", "హిందూస్థాన్ టైమ్స్" పత్రికలలో వేర్వేరు కాలాలలో సహాయ సంపాదకులుగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 1938 లో స్థాపించారు. జవహార్ లాల్ నెహ్రూ 1938 లో లక్నో నుండి ప్రారంభించిన "నేషనల్ హెరాల్డ్" దినపత్రికకు చలపతి రావు ను సహాయ సంపాదకునిగా నియమించారు. అయన చిత్తశుద్ధితో, అంకిత భావంతో, రాజీ లేని, ఒత్తిళ్ళకు లొంగని శక్తివంతమైన సంపాదకీయాలు, వ్యాసాలు రాశారు. దేశంలో కొద్దిమంది జర్నలిస్టులు అటువంటి శక్తితో వ్రాయ గలిగారు, అతి తక్కువ మంది ఆయన అనుసరించిన పదబంధాలను, భాషపై పట్టును కలిగి ఉండేవారు. నేషనల్ హెరాల్డ్ మూసి వేయడం ద్వారా ది హిందూస్తాన్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేయడానికి ముందు స్వాతంత్ర్య పోరాటంలో ప్రెస్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1946 లో అప్పటి ప్రభుత్వం మూసివేసిన తరువాత తిరిగి తెరిచినప్పుడు ఆయన నేషనల్ హెరాల్డ్ ఆఫ్ లక్నోకు సంపాదకులు అయ్యాడు. అదే పత్రికకు సంపాదకులుగా 1946 నుండి 1978 వరకు కొనసాగి నెహ్రూకు సన్నిహిత మిత్రుడై భారత దేశం లోని ప్రముఖ పత్రికా సంపాదకులుగా పేరుపొందారు. శక్తివంతమైన సంపాదకీయాలు మరియు వ్యాసాలు రాశారు. దేశంలో కొద్దిమంది జర్నలిస్టులు మాత్రమే అటువంటి శక్తితో వ్రాయ గలిగారు, తక్కువ మంది ఆ పదబంధాన్ని కలిగి ఉండేవారు. యునెస్కో ప్రెస్ నిపుణుల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. ఆయన 1955 లో యుఎస్ ఎస్ఆర్, పోలాండ్ మరియు యుగోస్లేవియాలో పర్యటించిన జవహర్ లాల్ నెహ్రూతో కలిసి వచ్చిన ఇండియన్ ప్రెస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. 1958 లో, ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు. చలపతి రావు ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ ఇనిషియేటింగ్ కమిటీ సభ్యులు కూడా. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (%×అఙఖఅ ఖీవఙతీఅశీఅ శీట ఔశీతీఎఱఅస్త్ర జీశీబతీ- ఖశ్రీఱర్ం%) అనే సంస్థను వ్యవస్థీకరించి దానికి మొదటి అధ్యక్షులై, ఆ సంస్థను 1950 నుండి 1955 వరకు ట్రేడ్ యూనియన్ పద్ధతిలో నడిపి దేశంలోని పత్రికా రచయితలకు మేలైన స్థితిగతులను కల్పించ డానికి ఎంతగానో పాటు పడ్డారు. 1952 లో చైనాకు భారత ప్రభుత్వ గుడ్విల్ మిషన్ సభ్యులు. ఆయన జవహర్ లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంత్ ల జీవిత్ర చరిత్రలను ఆంగ్లంలో రచించారు. ది ప్రెస్ ఇన్ ఇండియా (The Press in India) అనేది ఆయన ప్రసిద్ధిచెందిన గ్రంథం.

ఆయన1983 మార్చి 25 తేదీన పరమ పదించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఆది శంకరుల అవతారులు నృసింహ భారతి - మార్చి 25... శృంగేరీ 33వ జగద్గురు జయంతి సందర్భంగా

అద్వైత మత స్థాపనాచార్యులైన ఆది శంకరులు తూర్పున జగన్నాథంలో "గోవర్ధన మఠం", పశ్చిమాన ద్వారకలో "శారదామఠం", ఉత్తరాన కేదారంలో "జ్యోతిర్మఠం", దక్షిణాన శృంగేరి యందు "శృంగగిరి మఠం" స్థాపించి మత కార్యనిర్వహణార్థం దేశం నలు చెరుగులా సంచరించి, అద్వైత తత్వాన్ని వివరించి, దిగ్విజయ యాత్ర కొనసాగించారు. దుష్టాచారాలను నశింప చేసేందుకై కైలాస నాథుడే ఆది శంకరుని రూపంలో అవతరించారని "శివన్యాసం" స్పష్టపరుస్తున్నది. "కరిష్యత్యవతారం స్వం శంకరో నీలలోహిత:, శ్రౌత స్మార్త ప్రతిష్ఠార్థం భక్తానాం హిత కామ్యయా". శ్రౌత, స్మార్త క్రియలను సుప్రతిష్ఠం చేసి, వైదిక మార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి త్రినేత్రుడే స్వయంగా శంకరుల రూపంలో అవతరించారని "కూర్మపురాణం" విశదీకరిస్తున్నది. ఆదిశంకరులు స్థాపించిన శృంగగిరి మఠానికి 1989నుండి తంగిరాల సీతారామ ఆంజనేయులు 36వ పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి కాగా, ఆయన ఉత్తరాధికారిగా కుప్పా వేంకటేశ్వర ప్రసాద శర్మ "విధుశేఖర భారతీ తీర్థ స్వామి"గా 23వ జనవరి 2015న నియమింప బడి జైత్ర యాత్రలు కొనసాగిస్తున్నారు. కాగా శృంగేరీ మహా సంస్థానానికి 33వ పీఠాధిపతిగా ఉన్న శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ మహాస్వామి శంకరుని అవతారంగా విశ్వవ్యాపిత ప్రశంసాపాత్రులైనారు. 32వ పీఠాధిపతయైన శ్రీనరసింహ భారతి స్వామి (1817నుండి 1879) తమ 60వ ఏట ధ్యానముద్రలో ఉన్న సమయాన, తమ ఉత్తరాధికారి నియామకం చేయాల్సిన సందర్భాన్ని అశరీర వాణి ద్వారా విని, అందుకు తగిన భవిష్యత్ ఆచార్యత్వానికై, ఎన్నో జాతకాలు తెప్పించుకుని, పరిశీలించారు. ఇందుకు 8ఏళ్ళ సమయం తీసుకున్నారు. తగిన వ్యక్తి జాతకాన్ని పొందారు. మైసూరుకు చెంది, శివస్వామి పేరు గలిగిన ఏడు ఏళ్ళ బాలుడిని పిలిపించుకుని, తమ పక్కనే ఆసీనుని గావించుకుని, ఆ బాలుడు ఏమి కావాలని అనుకుంటున్నాడని ప్రశ్నించారు. అప్పుడా బాలుడు సదరు సందర్భోచితంగా, ఉపనిషత్ సూత్రాలకు అనుసరణీయమైన, గురువు మానవ రూపంలోనున్న దైవమని సంస్కృత శివ స్తోత్రం పఠించారు. అలా శివస్వామి సమాధానం జగద్గురువుల ఆనందానికి పాత్రమైంది. 1886లో నృసింహ భారతి స్వామి, శివస్వామిని, "శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి"గా యోగపట్టానొసంగి, దీక్షాదక్షుల చేశారు. ఎనిమిదేళ్ళ యువ సన్యాసి సుదీర్ఘ సాంప్రదాయ కర్మల సమన్వయ కారణంగా రోజంతా శ్రమించిన అనంతరం, అలసట చెంది, విశ్రాంతి తీసుకొన్నారు. అయితే తమ నిద్రాణ స్థితిలో సర్వోహం సర్వోహం అంటూ నినదించారు. తద్వారా ఆ బాలకుని అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తి వ్యక్తీకరణకు జగద్గురువులే ఆశ్చర్య చకితులైనారు. అలా జగద్గురు ఆశీస్సులతో సకల విద్యా పారంగులైనారు. 12ఏళ్ళు గురువుతో పర్యటనలకు వెళ్ళి, శృంగేరికి తిరిగి వచ్చి, 1879లో పరమాచార్యులకు దేహ విముక్తి కాగా,1858లో ఫాల్గుణ బహుళ ఏకాదశి నాడు గురువారము, శ్రవణ నక్షత్రమున మకర రాశి యందు రాత్రి తొమ్మిది గంటలకు మగ పిల్లవాడు జన్మించి, 'శివస్వామి' అని నామకరణం చేయబడిన శ్రీసచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామి శృంగేరీ పీఠాధీశ్వరులైనారు. 1912 మార్చి 20న పరమాచార్య విదేహ ముక్తినొందగా, నరసింహ వనంలో ఖననం చేయబడగా, ఆయన సమాధిపై లింగ ప్రతిష్ఠ జరిగింది. ఏప్రిల్ 7న చంద్రశేఖర భారతీ స్వామి పీఠాధీశులైనారు. ఆది శంకరభగవత్పాదులకు, శివాభినవ నృసింహ భారతి స్వామికి అనేక పోలికలున్నాయి. ఈయన కూడా ఆది శంకరులకు వలెనే బాల్యంలో పితృవియోగులైనారు. శివస్వామి తమ సోదరుని ద్వారా ఉపనయన సంస్కారం చేయించబడి, వేదం సంస్కృతాధ్యయనానికి ఉద్యుక్తులైనారు. దేశమంతా తిరిగి జనబాహుళ్యానికి సనాతన ధర్మాన్ని బోధించారు. శృంగేరిలో సద్విద్య సంజీవని పేరున పాఠశాలను స్థాపించి, వేదాలు, సంస్కృతాధ్యయనాలకు ఏర్పాట్లు గావించారు. బెంగళూరులో కళ్యాణ నగరిలో భారతీయ ప్రౌఢ విద్యాభివర్ధిని శాస్త్ర పాఠశాలను నెలకొల్పి, పూర్వ ఉత్తర మీమాంస శాస్త్రాల సాంప్రదాయ అధ్యయన ఏర్పాట్లు చేశారు. ఆది శంకర జన్మస్థలమైన కాలడి పునరుజ్జీవనం గురించి యోచించారు. ఎందరో సన్యాసులు పరమాచార్య వద్ద శిక్షణ పొందారు. విద్యాభ్యాసం చేశారు. ముఖ్యులలో శ్రీవేంకటరమణ సరస్వతి, శ్రీ భారతీ కృష్ణ తీర్థగా మారి గోవర్ధన పీఠాధిపతిగా మారారు. కే.రామచంద్ర అయ్యర్, సిద్ధ శ్రీరామానంద సరస్వతిగా మారారు. సిద్ధ విల్లిమలై శ్రీసచ్చిదానంద జగద్గురువుల వద్ద దీక్ష మొదట స్వీకరించి, అర్ధనారిగా మారి వైర్యాగ్యాన్ని పొంది



వానప్రస్తాశ్రమాన్ని స్వీకరించారు. వివిధ దేవాలయాల సందర్శనా సందర్భాలలో జగద్గురు నోట జాలువారిన శ్లోకాలు భక్తి సుధా తరంగిణి సంపుటిగా ప్రచురితాలైనాయి. హిందువులే కాక, ముస్లింలు, క్రైస్తవులు, ఆయనలో పవిత్రత, స్వచ్ఛత, దైవత్వాలను చూశారు. ఆచార్యునితో సంభాషణ జీవితంలోని కలవరం, సంక్షోభాలను దూరం చేశాయని ట్యూటర్ ఫ్రాజర్ ఒప్పుకున్నారు. జగద్గురువులు ఉత్తమ గుణ సంపన్నులని, ఆకర్షిత వ్యక్తిత్వమని, వేదాంత శాస్త్ర చిక్కుముడులను విప్పడంలో పరిపూర్ణ సాధికారికత కలవారని, ఎందరికో సమస్యల పరిష్కర్తగా వ్యవహరించారని, మతం పేరుతో అనైతిక అనుసరణలను ఖండించి, వైదిక ధర్మాన్ని బోధించిన మహనీయులని ఛార్లెస్ జాన్సన్ పేర్కొన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అనుసంధానిస్తేనే చివరి ఆయకట్టుకు నీరు!

ధర్మపురి: ధర్మపురి మండలం పెద్దనక్కలపేట పెచ్చెరువులో నీటిమట్టం పడిపోతోంది. దీంతో ఈ చెరువుపై ఆధారపడిన ధర్మపురి మండలం దమ్మన్నపేట, రాజారం, పెద్దనక్కలపేట గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పొలాలకు సాగు నీరందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల రైతులకు ఎస్సారెస్పీ కాలువల నీరు అందే పరిస్థితి లేకపోవడంతో పెచ్చెరువుపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. చెరువు కట్ట చాలా చోట్ల దెబ్బతింది. పూడిక పేరుకుపోయింది. దీనివల్ల చెరువులో నీటిమట్టం గతంలో ఎన్నడూ లేని విధంగా పూర్తిగా పడిపోయిందని రైతులు వాపోతున్నారు.



**గతంలోనే ప్రతిపాదనలు..**

పెచ్చెరువులో నీరు అడుగంటడంతో ఎస్సారెస్పీ కాలువను అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. దీంతో చెరువులో పుష్కలంగా నీరు ఉండి.. తాగు, సాగునీటి సమస్యలు ఉండవని వారు అంటున్నారు. చెరువుకు 500 మీటర్ల దూరం నుంచే ఎస్సారెస్పీ కాలువ వెళ్తోంది. దీనికి చెరువును అనుసంధానం చేసినట్లయితే నీటిని పుష్కలంగా నింపుకొనే వీలుంటుందని రైతులు భావిస్తున్నారు. రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించే వీలుంటుందని అంటున్నారు. వేసవిలోనూ పుష్కలంగా నీరు ఉండటంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీరుతాయి. గతంలో ఎస్సారెస్పీ అధికారులు రూ.10 లక్షల వ్యయంతో అనుసంధానం కాలువ ఏర్పాటు కోసం సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. చివరికి నిధుల కొరతతో కార్యరూపం దాల్చలేదు.

# పొదుపు సంఘాలకు సౌర యూనిట్లు

సంగారెడ్డి : గ్రామాల్లో సాగు యోగ్యంకాని భూములు వందలాది ఎకరాలు ఉంటాయి. అలాంటి భూముల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే అక్కడ కూడా యూనిట్లు నెలకొల్పాలని చూస్తున్నారు. ముందుకు వచ్చే మహిళా సంఘాల సభ్యులకు పీఎం కుసుం పథకం కింద యూనిట్ నెలకొల్పేందుకు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీ సదుపాయం ఉంటుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఎంపిక చేసిన మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేయించనున్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామైక్య సంఘం, మండల, జిల్లా సమాఖ్యల్లో నిధులు ఉంటే వాటి నుంచి కూడా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పిస్తారు. ఒక మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు రూ.4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఇందులో 10శాతం వాటాధనం పొదుపు



సంఘం సభ్యులు చెల్లించాలి.

**విద్యుత్తు విక్రయంతో ఆదాయం**

సౌర విద్యుత్తు ప్లాంటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును సమీపంలోని విద్యుత్తు ఉప కేంద్రానికి అనుసంధానం చేస్తారు. ఉత్పత్తి అయిన విద్యుత్తు ఆధారంగా పొదుపు సంఘాలకు ఆదాయం సమకూరుతుంది. మెగావాట్ విద్యుత్తు యూనిట్ ఏర్పాటుతో నెలకు రూ.2.16లక్షల ఆదాయం సంపాదించేందుకు వీలుంటుంది. 25 సంవత్సరాల వరకు ఇది ఆదాయ వనరుగా మారనుంది.

**అతివలకు సదవకాశం**

మహిళా సంఘాల సభ్యులకు సౌర విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో యూనిట్లు నెలకొల్పేందుకు ప్రాధాన్యం ఉంటుంది. పొదుపు సంఘాల సభ్యుల్లో సొంత భూమి ఉన్న వారు ఆసక్తి చూపితే వారి పేర్లను కూడా ప్రతిపాదిస్తాం. ఆదర్శంగా ఉన్న గ్రామైక్య సంఘాలకు సెర్ప్ ద్వారా రుణ సదుపాయం కల్పించే అవకాశాలు ఉన్నాయి.

జంగారెడ్డి, అదనపు డీఆర్డీవో

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

సభ్యులు :1.90లక్షలు

మెగావాట్ యూనిట్ ఏర్పాటుకు అవసరమయ్యే భూమి: 4 ఎకరాలు

పెట్టుబడి వ్యయం: రూ.3కోట్ల నుంచి రూ.4కోట్లు

ఒక యూనిట్ ద్వారా నిత్యం విద్యుత్తు ఉత్పత్తి: 4వేల యూనిట్లు

నెలకు వచ్చే ఆదాయం: రూ.2.16లక్షలు

# పేదలకు గూడు.. తీరనున్న గోడు

హుస్నాబాద్ అసంపూర్తిగా నిలిచిన రెండు పడక గదుల ఇళ్లకు మోక్షం లభించనుంది. వాటిని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. గత ప్రభుత్వం పుర పరిధిలో పేదలకు 560 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేసింది. మొదటి దఫాలో 160, రెండోసారి 400 ఇళ్లు మంజూరయ్యాయి. నాగారం రోడ్డులో నిర్మాణాలు ప్రారంభించారు. మొదటి దశలోని వాటిని పూర్తి చేశారు. తరవాత మంజూరైన 400 ఇళ్లలో వంద వరకు పూర్తయినా కొన్ని పనులు చేయాల్సి ఉంది. మిగిలినవి మధ్యలోనే నిలిచాయి. వీటిపై పుర పరిధిలోని పేదలు ఆశలు పెట్టుకున్నారు.

**342 మంది అర్హులు..**

మొదటి దఫాలోని 160 ఇళ్లు పూర్తయ్యాక రెండేళ్ల తరవాత లబ్ధిదారులకు కేటాయించారు. 2023 ఫిబ్రవరిలో దరఖాస్తులు తీసుకొని 342 మందిని అర్హులుగా గుర్తించారు. రెండు దఫాలు కలిపి 264 ఇళ్లకు 342 మందిని లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. అర్హత ఉన్న మరో 78 మందికి ఇళ్లు లభించలేదు. ఎంపికైన లబ్ధిదారులకు అధికారులు ఇళ్లు అప్పగించారు. వీటిలోనూ పలు ఇళ్లలో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో అందులో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొంది. నివాసితులు విషయాన్ని పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్ల పూర్తికి ప్రభుత్వం ఎట్టకేలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమవుతోంది.

# ఉపాధి భళా.. పారిశ్రామిక కళ!



కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ సామాజిక ఆర్థిక నివేదిక (2025)లో ఉమ్మడి జిల్లా సాధిస్తున్న పురోగతి.. వెనుకబడిన అంశాలు వెల్లడయ్యాయి. కరీంనగర్ జిల్లా పల్లెల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతుండగా.. తలసరి ఆదాయంలో పెద్దపల్లి.. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఎక్కువున్న జిల్లాగా జగిత్యాల.. వ్యవసాయ కమతాల సగటు పరంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముందు వరుసలో నిలిచాయి.. ఇలా ఉమ్మడి జిల్లా ఆయా రంగాల్లో భిన్నమైన ప్రగతిని అందుకుంటోంది.

**ప్రత్యేకతలిలా..**

తలసరి ఆదాయంలో పెద్దపల్లి 8వ స్థానం (రూ.2,84,661), కరీంనగర్ 13వ స్థానం (రూ.2,50,243), సిరిసిల్ల 28వ స్థానం (రూ.2,13,725) జగిత్యాల జిల్లా 31వ స్థానం (రూ.2,05,273)లో నిలిచాయి.

జిల్లాలలో సాగు చేసే చిన్న కమతాల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. రాష్ట్రంలో కమతాల సగటు విస్తీర్ణం 0.89 హెక్టార్లుగా ఉంది. ఉమ్మడి జిల్లాను పరిశీలిస్తే సిరిసిల్ల (0.83), జగిత్యాల (0.77), పెద్దపల్లి (0.76), కరీంనగర్ (0.75) హెక్టార్లుగా ఉంది.

గృహ విద్యుత్తు విషయంలో నాలుగు జిల్లాల్లో అన్ని కేటగిరీల కనెక్షన్లు పెరుగుతున్నాయి. రాష్ట్ర సగటు 71.9 శాతం కాగా.. పెద్దపల్లి 11వ స్థానం (69.4శాతం), కరీంనగర్ 13వ స్థానం (68.8శాతం), సిరిసిల్ల 17వ స్థానం (65.6శాతం), జగిత్యాల 23వ స్థానం (63.5శాతం)లో నిలిచాయి.

వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను గమనిస్తే రాష్ట్ర సగటు 15.3 శాతం ఉండగా అంతకుమించి ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల్లో ఈ సంఖ్య పెరిగింది. జగిత్యాల 25.8 శాతంతో 10వ స్థానంలో ఉంది. సిరిసిల్ల 16వ స్థానం (24.6శాతం), కరీంనగర్ 20వ స్థానం (17.7శాతం), పెద్దపల్లి 19వ స్థానం (17.7శాతం)లో ఉన్నాయి.

రోడ్ల విస్తరణ, కొత్తగా నిర్మాణంలో పురోగతి ఉంది. ప్రతి వంద చదరపు కి.మీ.లకు జిల్లాలో ఏర్పాటైన రోడ్ల సాంద్రత కి.మీ.ల పరంగా గమనిస్తే కరీంనగర్ జిల్లాలో 138.7 కి.మీ.లు, సిరిసిల్ల 112.3 కి.మీ.లు, జగిత్యాల 107.7 కి.మీ.లు, పెద్దపల్లి 97.2 కి.మీ.లు విస్తరించి ఉండటంతో రవాణా పరంగా ప్రయాణికులకు మేలు కలుగుతోంది.

రక్తహీనత ప్రగతి సూచిలో నాలుగు జిల్లాలు వెనుకబడి ఉన్నాయి. 90 శాతం మించాల్సి ఉండగా జగిత్యాల 49.2 శాతం, సిరిసిల్ల 63, పెద్దపల్లి 70.7, కరీంనగర్ 82.7 శాతం మాత్రమే ఉన్నాయి.

అటవీ విస్తీర్ణం పరంగా 33 శాతం మించిన పురోగతి నాలుగు జిల్లాల్లోనూ లేదు. 25.14 శాతం అటవీ విస్తీర్ణంతో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో 10వ స్థానంలో నిలవగా కరీంనగర్ (2.29శాతం) చివరన 33వ స్థానంలో నిలిచింది. సిరిసిల్ల (18.09శాతం) 14వ స్థానం, పెద్దపల్లి (17.55శాతం) 16 స్థానంలో నిలిచాయి.

# ఉగాదికి పేదలకు ఊరట



భగత్‌నగర్: నిత్యావసర సరకుల ధరలతో కుదేలవుతున్న సామాన్యుడికి ఉగాది పర్వదినం ఊరటనివ్వబోతోంది. ఏప్రిల్ ఒకటి నుంచి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనున్నారు. దీంతో జిల్లా అధికారులు బియ్యం నిల్వలను సిద్ధం చేశారు. సుమారు 7 నెలల వరకు ఏ ఆటంకం లేకుండా పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. బియ్యం నాణ్యతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటివరకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యం దొడ్డు రకాలు కావడంతో తినలేక.. వాటిని వ్యాపారులకు కిలోకు రూ.10 నుంచి రూ.12 వరకు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో సన్న బియ్యం పాతవి కిలో రూ.44, కొత్త రకం రూ.50 ఉంది. దీంతో అంత ధర చెల్లించి కొనుగోలు చేయలేక సామాన్య ప్రజలు చితికిపోతున్నారు.

**గత హయాంలో నాణ్యత లేకుండా..**

గత ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసిన సమయంలో నాణ్యత కొరవడింది. మూడు నెలలపాటు అందజేయగా.. అందులో నూక, తౌడు ఎక్కువ శాతం ఉండేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తిరిగి చిరువ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఎదురైంది. ప్రస్తుత ప్రభుత్వమైనా సన్న బియ్యం నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. అలాగే సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

**కొత్త రేషన్ కార్డులకు లేనట్టేనా?**

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ చేపట్టిన విషయం తెలిసిందే. నమూనా ప్రాజెక్టు కింద మండలానికో గ్రామం చొప్పున లబ్ధిదారుల ఎంపికను చేపట్టారు. ఇలా జిల్లాలో 15 గ్రామాల్లో 809 మందికి 485 రేషన్ కార్డులను అధికారులు జారీచేశారు. వీరికి 48 క్వింటాళ్ల బియ్యం అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. అయితే పంపిణీ ప్రారంభించే నాటికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో కొత్త రేషన్ కార్డుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం వారికి బియ్యం పంపిణీ చేయాలా వద్దా? అనే విషయంపై అధికారుల్లో సందిగ్ధత నెలకొంది.

**8 లక్షల మందికి పైగా లబ్ధి**

జిల్లాలో 2,76,895 రేషన్ కార్డులుంటే వారికి ప్రతినెలా 4492 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 566 రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సన్న బియ్యంతో జిల్లాలో 8,044,98 మంది లబ్ధి పొందనున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇవ్వనున్నారు.

# తవ్వేకొద్దీ అక్రమాలు



జగిత్యాల : పై రెండు ఉదంతాలతోపాటు వెలుగులోకి రాని మరెన్నో అక్రమాలు జగిత్యాల బల్దియాలో ఇంటిదొంగల పనితీరును వెల్లడిస్తున్నాయి. ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ కాపీ(ఆస్తి పన్ను యాజమాన్య హక్కు పత్రం) అనేది బ్యాంకు రుణాలు తీసుకునే సమయంలో.. పాత ఇంటిని కూల్చి కొత్త ఇంటి నిర్మాణం చేపట్టినప్పుడు అనుమతులపరంగా అవసరమయ్యే పత్రం. వాస్తవంగా ఈ పత్రాల జారీని సీడీఎంఏ గతంలో నిలిపివేసింది. 2023 నుంచి జగిత్యాల పాలకవర్గం తీర్మానం మేరకు ఈ పత్రాలను జారీ చేస్తున్నారు. 1-300 గజాలకు రూ.3 వేలు, 300-500 గజాలకు రూ.5 వేలు, 500 పైన గజాలకు రూ.10 వేల చొప్పున డీడీ చెల్లించినవారికి ఈ పత్రాలు బల్దియా ఇవ్వాల్సి ఉంటుంది.

**అసెస్‌మెంట్ కాపీల దందా..**

1983-84 నుంచి ఇంటిపన్ను చెల్లిస్తున్నవారికి ఎల్ఆర్ఎస్ వర్తించదు. 1983కు పూర్వం ఉన్నటువంటి పాత ఇళ్లతోపాటు ఆస్తిపన్ను చెల్లించనివారికి ఎల్ఆర్ఎస్ విధిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకొని కార్యాలయంలోని కొందరు సిబ్బంది అక్రమాలకు తెరలేపారు. బల్దియాకు డీడీలు చెల్లించకపోయినా కొంత నగదు ముట్టజెబితే జిరాక్స్ ప్రతుల్ని దరఖాస్తుదారులకు చేరవేస్తున్నారు. ఈ పత్రాలను నమ్మి టౌన్‌ప్లానింగ్‌లో భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడం గమనార్హం. ఇందులో మరో విశేషమేంటంటే ఒక్కోసారి ఇవి తప్పుడు పత్రాలని భవన యజమానుల్ని బెదిరించి ఇందులోని ఒకరిద్దరు సిబ్బంది కూడా ఒక్కో అనుమతికి రూ.లక్షలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈకోవలోనే ధర్మపురిరోడ్డులోని అక్రమ అనుమతి వ్యవహారం బయటపడింది.

**బల్దియాకు నష్టం..**

అసెస్‌మెంట్ కాపీల జారీ, ఎల్ఆర్ఎస్ తప్పించుకునే క్రమంలో జరుగుతున్న అక్రమాలతో బల్దియా ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వాస్తవమో కాదో పరిశీలించకుండా అనుమతులు జారీ చేయడంలో పట్టణ ప్రణాళిక విభాగం అలసత్వం బయటపడుతోంది. కార్యాలయంలోని శాశ్వత, ప్రైవేటుకు సంబంధించిన ముగ్గురు వ్యక్తుల ప్రమేయంతోనే ఈ దందా కొనసాగుతోందని సమాచారం.

ధర్మపురిరోడ్డులో ఓ పాత ఇంటికి కొత్తగా భవన నిర్మాణ అనుమతులను బల్దియా జారీ చేసింది. రూ.4.50 లక్షల ఎల్ఆర్ఎస్ ఫీజును తప్పించుకునేందుకు ఆ ఇంటి యజమాని నకిలీ అసెస్‌మెంట్ పత్రాలతో అక్రమ పద్ధతిలో ఇంటి అనుమతి పొందాడు. స్థానికులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయంపై విచారణ జరుగుతోంది. గతేడాది జరిగిన మరో ఉదంతంలో తప్పుడు అసెస్‌మెంట్ పత్రాలతో ఓ ఆస్తి వివాదం తలెత్తింది. ప్రత్యర్థుల ఫిర్యాదుతో అసెస్‌మెంట్ పత్రాలతో ఆస్తి చేతులు మారిందని తెలిసింది. ఇందుకు కారణమైన కమిషనర్‌తోపాటు ఆర్వో ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది.

# పేదలకు సన్న బువ్వ

గజ్వేల్: పేదలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సన్నబియ్యం పంపిణీకి ఏప్రిల్ 1 నుంచి శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఇప్పటికే వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యాన్నే వినియోగిస్తున్నారు. ఇకపై పేదలకూ అందించనున్నారు. దొడ్డు బియ్యంలాగే ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నాల పంపిణీకి చర్యలు తీసుకొంటున్నారు. దీనికిగాను తొలి విడతగా జిల్లాలకు దాదాపు 16,082 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కేటాయించారు. ఇందులో 3,611 టన్నులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి వినియోగించనున్నారు. 12,471 మెట్రిక్ టన్నులు పేదలకు అందించనున్నారు.

**888 కొత్త కార్డులు**

కొత్త కార్డులకు పెరిగిన కోటాతోసహా పేద కుటుంబాలన్నింటికీ సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు. జిల్లాలో కొత్తగా 888 కుంటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. కొన్ని కార్డుల్లో కొత్త పేర్లు నమోదు చేశారు. ఈ మేరకు లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించనున్నారు. ఇందుకుగాను అదనంగా దాదాపు 12 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కానున్నాయి. కొత్తగా కార్డులు రావడమే



కాకుండా ఇక సన్నబియ్యం ఇవ్వనున్నారన్న సమాచారంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తోంది. దీంతో సన్నబియ్యం పంపిణీ పూర్తిగా పారదర్శకంగా సాగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**నల్ల దందాకు అడ్డుకట్ట** ప్రస్తుతం కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తోంది. దొడ్డు బియ్యం ఇస్తుండడంతో పేదల్లో కొందరు తినేందుకు ఇష్టపడడం లేదు. కిలోకు రూ.10 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. వారు మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మార్చి కిలోకు రూ.35 వరకు గుట్టుగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో ఏటా వేలాది టన్నుల బియ్యం పట్టుపడుతుండటం ఈ దందా తీవ్రతకు అద్దం పడుతోంది. ఇకపై ప్రభుత్వం పేదలకు నేరుగా సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో నల్ల దందాకు చెక్ పడనుందని పలువురు అంటున్నారు.

# ఉపాధి అద్వితీయం

సంగారెడ్డి : వలసలు నివారించి.. పల్లెల్లో ప్రజలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. ప్రస్తుత యాసంగిలో వరితోపాటు ఇతరత్రా పంటల్లో కలుపు తీతలు ముగిశాయి. కూలీలు ఉపాధి హామీ పథకం వైపు మళ్లారు. ఇందుకు అనుగుణంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దశల వారీగా లక్ష మందికి పని కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ దిశగా కూలీల సంఖ్యను పెంచేలా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఉపాధి పనుల కల్పనలో ఇప్పటి వరకు జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది.

**వట్‌పల్లిలో అత్యధికం**

జిల్లాలో ఉపాధి హామీ పథకం 25 మండలాల పరిధిలోని 619 గ్రామ పంచాయతీల్లో అమలవుతోంది. మట్టి దారులు, నీటి కట్టలు, నర్సరీల్లో మొక్కల పెంపకం, చెరువుల్లో పూడిక తీత, మొక్కలు నాటి సంరక్షించడం తదితర పనులు చేపడుతున్నారు. ఉపాధి పనుల కల్పనలో జిల్లాలో వట్‌పల్లి మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ 1,711 మంది కూలీలు నిత్యం పనులకు వెళుతున్నారు.

**15 రోజుల వ్యవధిలో..:** మార్చి 4న 22,662 మంది కూలీల హాజరుతో ఉపాధి పనుల కల్పనలో రాష్ట్రంలో జిల్లా ఆరో స్థానంలో ఉంది. ఈ నెల 19న 35,093 మంది కూలీలు పనులకు వచ్చారు. ఈ లెక్కన 15 రోజుల వ్యవధిలో జిల్లాలో 12,431 మంది కూలీలు



పెరగడమే కాకుండా.. రాష్ట్ర స్థాయి ర్యాంకు ద్వితీయ స్థానానికి చేరింది.

**దోహదపడిన అంశాలు**

ప్రతి పంచాయతీ పరిధిలో కచ్చితంగా 50 మంది కూలీలు హాజరయ్యేలా జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ లక్ష్యాన్ని క్రమంగా 100కు చేర్చాలని సూచించారు. ఈ దిశగా సంబంధిత అధికారులు ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్నారు.

ఉపాధి హామీ ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రోజు విడిచి రోజు ఉపాధి హామీ పనులపై సమీక్షలు నిర్వహిస్తూ.. దిశానిర్దేశం చేస్తున్నారు.

సమన్వయ సహకారం: జ్యోతి, డీఆర్‌డీవో

ఉపాధి హామీ పథకం పనుల అమలులో రాష్ట్రంలో జిల్లాకు ద్వితీయ స్థానం దక్కింది. ఉన్నతాధికారుల దిశానిర్దేశం, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయ కృషితోనే ఇది సాధ్యమైంది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. రాష్ట్రంలో ప్రథమ స్థానమే లక్ష్యంగా కృషి చేస్తాం.

# అన్నదాతకు 'కనీస మద్దతు' ఏదీ

ఖమ్మం : ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతలకు 'కనీస మద్దతు ధర'(ఎంఎస్పీ) లభించకపోవటంతో నష్టపోతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రధానంగా వరి, పత్తి, మిరప, మొక్కజొన్న, పెసర, కందులు తదితర పంటలను పండిస్తున్నారు. ప్రతి సంవత్సరం పంటలకు పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా ధరలు పెరగటం లేదు. దీని వల్ల రానురాను సేద్యం చేసే వారి సంఖ్య తగ్గిపోతోంది.

**లభించని ఊరట..** మిరప ధరలు దారుణంగా పడిపోతున్నాయి. గురువారం ఖమ్మం విపణిలో క్వింటా గరిష్ఠ ధర రూ.13,850 అయినప్పటికీ కొంత సరకుకే ఆ ధర లభించింది. మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం తరఫున వారికి ఊరట కలిగించే ఎలాంటి నిర్ణయం రాలేదు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే లక్ష ఎకరాలకు పైగా ప్రస్తుతం మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పతనమవుతుండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

**ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే..** కనీస మద్దతు ధర రానప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుంది. ప్రభుత్వరంగ సంస్థలైన నాఫెడ్ ద్వారా పెసలు, కందులు, మిరప, ఈ బాధ్యతను పూర్తి స్థాయిలో తీసుకోవటం లేదు.

# అత్యంత నాణ్యత.. అత్యున్నత ప్రమాణాలు

హైదరాబాద్: మురుగు జలాల శుద్ధి సవాల్‌గా మారుతున్న నేపథ్యంలో జీరో బ్యాక్టీరియా మురుగు శుద్ధి విధానం పరిష్కారంగా మారనుంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఐఐఎస్‌సీ) అభివృద్ధి చేసిన విధానంతో మురుగు నీటిని అత్యున్నత ప్రమాణాలతో అత్యంత నాణ్యతతో శుద్ధి చేసి సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

**జీరో బ్యాక్టీరియా..**

ఈ విధానంలో ఉపయోగించే సిల్వర్ నానోపార్టికల్ పూతలతో బ్యాక్టీరియా కణత్వచాలకు అంతరాయం కలిగించి వాటి మరణానికి కారణమవుతాయి. రేడియేషన్ బ్యాక్టీరియా వృద్ధికి అవకాశం లేకుండా చేస్తుంది. ఎలెక్ట్రోస్టాటిక్ ఫిల్టరేషన్ విధానంలో ఉపయోగించే ఫిల్టర్లు బ్యాక్టీరియాను ఆకర్షించేలా చేస్తాయి. ప్రత్యేక వడపోత వ్యవస్థల్లో యాంటీ మైక్రోబయల్‌తో నింపి ఉండే సూక్ష్మరంధ్రాల ఫిల్టర్‌ల



వినియోగం బ్యాక్టీరియాను తొలగిస్తుంది. పునర్వినియోగానికి ఇది దోహదపడనుంది.

**నగరంలో అధ్యయనం**

జలమండలి పరిధిలో ప్రస్తుతం 1950 ఎంఎల్‌డీల మురుగునీరు ఏర్పడుతోంది. పాత ఎస్టీపీల్లో 772 ఎంఎల్‌డీల మురుగునీరు శుద్ధి అవుతుండగా మరో 653 ఎంఎల్‌డీల మురుగునీటి శుద్ధి ప్లాంట్లు కొత్తగా ఏర్పాటు చేశారు. ఐఐఎస్‌సీ అభివృద్ధి చేసిన జీరో బ్యాక్టీరియా విధానం మెరుగైన ఫలితాలను ఇస్తుందని జలమండలి భావిస్తోంది. ఈ మురుగునీటి శుద్ధి విధానాన్ని పరిశీలించి అవసరమైతే ఇక్కడ కూడా వినియోగించుకుంటామని జలమండలి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

**బెంగళూరులో వినియోగంపై కార్యాచరణ**బెంగళూరు జలమండలి పరిధిలోని ఎస్టీపీలు, అపార్ట్‌మెంట్‌లు, గేటెట్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీటి నాణ్యతను ఐఐఎస్‌సీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన జీరో బ్యాక్టీరియా సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసేందుకు బెంగళూరు జలమండలి కార్యాచరణ రూపొంది స్తోంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న సంప్రదాయ ద్వితీయ ట్రీట్‌మె ంట్ విధానంతో పోలిస్తే కొత్త విధానం నాణ్యమైన నీటిని ఉత్పత్తి చేస్తుంది.

# కర్షకులకు.. కడగండ్లు

పెద్దేముల్ : కోట్‌పల్లి ప్రాజెక్టు జిల్లాకే మణిహారం. దశబ్దాలుగా పెద్దేముల్, ధారూర్ మండలాల్లోని వేలాది ఎకరాలను సాగుచేసే 18 గ్రామాల రైతులకు పెద్ద దిక్కుగా ఉండేది. రబీ సీజన్‌లో ఈ ప్రాంతం అంతా పచ్చని పంట పొలాలతో కళకళలాడేది. ఏళ్లుగా కాలువలకు మరమ్మతులు లేకపోవడంతో పలుచోట్ల గండ్లు పడ్డాయి. కుడి, ఎడమ కాలువలు పూడిక నిండి పిచ్చిమొక్కలు పెరిగి నీరందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో జలాశయం కింద వరిసాగు చేసిన ఆయకట్టు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

**నీరంతా వాగుపాలు**

ప్రాజెక్టు నుంచి 15 కిలో మీటర్ల దూరంలో గల బండపల్లి, జనగాం, మంబాపూరు రైతులు రాత్రీ పగలు పొలాల వద్దే ఉంటూ నీటి తడులు పెట్టుకుంటున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి కాల్వ 24 కిలో మీటర్ల పొడవు ఉంటుంది. చాలా చోట్ల గండ్లు పడి నీరు రావడం లేదు. గొలుసుకట్ట విధానంలో ప్రాజెక్టు ప్రధాన కాల్వల మధ్య చెరువులు కట్టారు. గండ్ల కారణంగా చెరువుల్లోకి నీరు చేరడం లేదు.

ఈ రైతు పేరు బాల్‌రాజ్, జనగాం గ్రామం. కోట్‌పల్లి ప్రాజెక్టు కింద ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ప్రాజెక్టు నీరు వచ్చే పరిస్థితి లేదు. పంటను కాపాడుకునేందుకు రూ.1.5 లక్షలు ఖర్చు చేసి రెండు బోర్లు వేయించాడు. తక్కువ నీరు పడింది. భార్యాభర్తలు రాత్రీ పగలు పొలం వద్దే ఉంటూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

ఈ మహిళ రైతు పేరు భీమని నర్సమ్మ. జనగాం గ్రామం. కోటిపల్లి ప్రాజెక్టు ఆయకట్టు కింద నాలుగు ఎకరాల భూమి ఉంది. ఎకరంలో వరి సాగు చేస్తున్నారు. కాల్వల నుంచి నీరు రాకపోవడంతో రూ.2



లక్షలు పెట్టి బోరు వేస్తే 400 మీటర్ల లోతులో అంగుళం నీరు పడింది. ఆ నీటితో కోడలు, కూతురుతో కలిసి పంటను రక్షించుకుంటున్నారు.

**ప్రాజెక్టు వివరాలు**

జలాశయం పేరు: కోట్‌పల్లి

ఆయకట్టు: 9,200 ఎకరాలు

నీరందే ఆయకట్టు: 4 వేల ఎకరాలు

ప్రస్తుతం వరిసాగు: 3,000 ఎకరాలు

కాల్వల పరిస్థితి: అస్తవ్యస్తం, అధ్వాన్నం

నీటి నిల్వ సామర్థ్యం: 1.5 టీఎంసీలు (24 అడుగులు)

లబ్ధి పొందే గ్రామాలు: పెద్దేముల్, ధారూరు మండలాల్లోని 18 గ్రామాలు

కుడి కాలువ పొడవు: 24.14 కి.మీ.

ఎడమ : 11.6 కి.మీ.

బేబి కాలువ : 2.6 కి.మీ.

# అది ఆట కాదు.. కన్నీటి గాథ



హైదరాబాద్ : బెట్టింగ్ యాప్‌లు యువత ఉసురు తీస్తున్నాయి. ఎన్నో కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. సినీ, టీవీ తారలు, సామాజిక సేవకుల ముసుగులో ఇన్‌ఫ్లూయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేస్తున్నారు. ఇంట్లో కూర్చొని రూ.లక్షలు సంపాదించామని నోట్ల కట్టలను చూపుతూ వీడియోలు రూపొందించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. వీటికి ఆకర్షితులై ఎంతోమంది అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆడుతున్నారు. కొందరు రుణ యాప్‌లను ఆశ్రయించి ఆ ఉచ్చులో చిక్కుతున్నారు. చివరికి అసలు, వడ్డీ చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గ్రేటర్ పరిధిలో రెండేళ్లలో సుమారు 10 మంది బెట్టింగ్ ఉచ్చులో పడి బలవన్మరణం చెందినట్లు అంచనా. ఆయా కుటుంబాలు బిడ్డల జ్ఞాపకాలతో కాలం వెళ్లదీస్తున్నాయి. ఎవరిని కదిలించినా కన్నీళ్లు ఉబికివస్తున్నాయి.

**కడుపుకోత మిగిల్చాడు**

బాలానగర్ వినాయకనగర్‌కు చెందిన డి.తరుణ్‌రెడ్డి(21) బీటెక్ పూర్తి చేశాడు. ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. ప్రముఖ వర్సిటీలో సీటు సంపాదించాడు. ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తుండగా రూ.6 లక్షల ప్యాకేజీతో కొలువు లభించింది. తల్లిదండ్రులు పొంగిపోయారు. ఇంజినీరింగ్ చదివేటప్పుడు సరదాగా మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్‌లు అలవాటుగా మారాయి. రెండేళ్లుగా పందేలు కాసేందుకు క్రెడిట్ కార్డుతో రూ.3 లక్షలు.. వ్యక్తిగత రుణం రూ.4 లక్షలు తీసుకొని నష్టపోయాడు. అప్పులన్నీ తీర్చిన తండ్రి కొడుకుని సున్నితంగా మందలించాడు. గతేడాది డిసెంబర్‌లో అప్పులు తీరగానే.. ఈ ఏడాది జనవరి 13న బెట్టింగ్‌లతో క్రెడిట్ కార్డుతో రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు తెలిసేలోగా.. జనవరి 22న ఉరేసుకున్నాడు.

**చితికిపోయి.. కొడుకుని కోల్పోయి**

గుడిమల్కాపూర్‌కు చెందిన బాలకృష్ణ కుమారుడు శీలం మనోజ్ గతేడాది దుండిగల్‌లోని కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నప్పుడు ఆన్‌లైన్ బెట్టింగులకు దగ్గరయ్యాడు. సులువుగా డబ్బు సంపాదించవచ్చంటూ మనోజ్‌ను రొంపిలోకి లాగారు. రుణయాప్‌లు, ఇతర మార్గాల్లో అప్పులు చేశాడు. సొమ్మంతా నష్టపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. నెల వాయిదాలు చెల్లించట్లేదంటూ ఒత్తిడి చేయడం.. అప్పుల విషయం బయటకు తెలిస్తే బంధువుల్లో పరువు పోతుందని భావించాడు. మనస్తాపంతో గతేడాది ఫిబ్రవరి 26న ఉరేసుకొని చనిపోయాడు. మనోజ్ చేసిన రూ.5 లక్షల అప్పును తండ్రే తీర్చాడు. ఆర్థికంగా చితికిపోయి.. కొడుకును కోల్పోయి తల్లిదండ్రులు కన్నీటి మధ్య జీవనం సాగిస్తున్నారు. ఎదిగిన బిడ్డలు చేసిన తప్పులు కన్నవారిని మనోవేదనకు గురిచేస్తాయని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

**బిడ్డకు దూరమై కోలుకోలేని తల్లి**

తల్లితో సాయికిరణ్ చివరి పుట్టిన రోజు

ఎదిరే కొమరయ్య, లక్ష్మి దంపతులు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోచమ్మబస్తీలో ఉంటారు. సాయికిరణ్(21) ఏకైక సంతానం. తల్లి కూలీకెళుతూ.. తండ్రి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. కుమారుడిని నారాయణగూడలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీలో చేర్చారు. రూ.1.50 లక్షల బైక్ కొనిచ్చారు. ఏడాది క్రితం స్నేహితుల ప్రభావంతో బెట్టింగ్ యాప్‌లకు దగ్గరయ్యాడు. రూ.2 లక్షలు అప్పు చేశాడు. బైక్ వాయిదాలు సక్రమంగా చెల్లించలేదు. తప్పటడుగు వేశాడని గ్రహించిన తల్లిదండ్రులు రూ.రెండు లక్షల అప్పు తీర్చారు. బుద్ధిగా చదుకోమని చెప్పారు. బెట్టింగ్ వ్యసనంతో మరోసారి రూ.4.5 లక్షలు అప్పు చేశాడు. బైక్ తాకట్టు పెట్టాడు. చేసిన అప్పులు.. కన్నవారి మనోవేదన చూసి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుంగిపోయిన తల్లి మూడు నెలలుగా మంచానికే పరిమితమైంది. భార్య ఆలనాపాలనా చూస్తున్నాడు. అప్పులన్నీ తీరుస్తాం బిడ్డా.. నువ్వు ఆగం కావొద్దని చెప్పినా ఇట్టా చేసుకున్నాడని సాయికిరణ్ అమ్మమ్మ బాలమణి కన్నీరుమున్నీరయ్యారు.

# పెరగాలి జోన్లు.. కావాలి సిబ్బంది

హైదరాబాద్ : హెచ్ఎండీఏ ఒకేసారి 3 వేలపైనే చదరపు కిలోమీటర్ల వరకు పెరగడంతో సంస్థ కార్యకలాపాలను విస్తరించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పరిధి పెంపుతోనే సరిపెట్టకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే అందుకు అనువుగా అదనపు జోన్లు, భారీగా సిబ్బంది నియామకం తప్పనిసరి. ప్రస్తుతం శంషాబాద్, మేడ్చల్-1, మేడ్చల్-2, శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, ఘట్‌కేసర్ జోన్లు ఉన్నాయి. ఆర్‌ఆర్‌ఆర్‌కు 2 కి.మీ.ల వరకు బఫర్ జోన్.. అటు ఇటు కిలోమీటరు మేర గ్రోత్‌కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. 2050 అవసరాల కోసం హెచ్ఎండీఏ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఇవన్నీ సమన్వయం చేయాలంటే కొత్త జోన్లు, అదనపు సిబ్బంది సేవలు కావాల్సిందే. ప్రస్తుతం ఉన్న ఆరు జోన్లను 10 నుంచి 12 వరకు పెంచాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది. ఏటా కొత్త లేఅవుట్లు, భారీ అంతస్తుల నిర్మాణాల కోసం దరఖాస్తులు వస్తున్నాయి. ముమ్ముందు వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతి జోన్‌లో వివిధ రంగాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌లో భూ కేటాయింపులు ఉంటాయి. వాటికి అనుగుణంగా అనుమతులు జారీ చేస్తుంటారు.

**అనుమతుల్లో వేగం అవసరం**

స్థిరాస్తి రంగం పరుగులు పెట్టాలంటే అనుమతులు వేగవంతం కావాలి. సిబ్బంది కొరతతో తీవ్ర జాప్యం జరుగుతోంది. కీలకమైన జేపీవోలు, ఏపీవోలు సరిపడా లేరు. పరిధి పెంపు తర్వాత మరో 100-150 వరకు క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం. ప్రస్తుతం ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన సైతం నత్తనడకన సాగుతోంది. ఆరు జోన్ల పరిధిలో 20-25 మంది వరకు పీవోలు, ఏపీవోలు ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

**హెచ్ఎండీఏ కొత్త స్వరూపం**

ప్రస్తుత పరిధి 7,257 చ.కి.లు

పెరగనున్న విస్తీర్ణం 10,472.723 చ.కి.లు

జిల్లాల సంఖ్య 11 (హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్)

మండలాలు 104

గ్రామాల సంఖ్య 1355

# వికారాబాద్‌కు మహర్దశ..



వికారాబాద్: మహానగరం హైదరాబాద్‌ను సువిశాలం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తూ నూతనంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (హెచ్ఎంఆర్)కు రూపకల్పన చేసింది. వికారాబాద్ జిల్లాలోని 54 రెవెన్యూ గ్రామాలను హెచ్ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పరిణామంతో ఇప్పటి వరకు హెచ్ఎండీఏ వరకే కేంద్రీకృతమైన అభివృద్ధి ఇతర ప్రాంతాలకు విస్తరించనుంది. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వరకు పట్టణీకరణను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**స్థిరాస్తి వ్యాపారానికి ఊతం**

గత రెండేళ్లుగా స్థిరాస్తి వ్యాపారం మందగించి భూముల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఐదు మండలాలు, 54 రెవెన్యూ గ్రామాలను హెచ్ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వ తాజా నిర్ణయంతో మళ్లీ స్థిరాస్తి వ్యాపారం ఊపందుకుంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

**ఆర్‌ఆర్‌ఆర్‌కు ఇరువైపులా..**

బాహ్య వలయ రహదారికి ఇరు వైపులా పట్టణీకరణ ఎలాగైతే పెరిగిందో, అదే మాదిరిగా రీజినల్ రింగ్ రోడ్డు పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్‌ఆర్‌ఆర్‌కు బయటి వైపు ఐదు కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేసే బాధ్యతను మహా హైదరాబాద్ అప్పగించారు. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి జిల్లా పరిధిలోకి వచ్చే గ్రామాలను మహా హైదరాబాద్ పరిధిలోకి చేర్చి, ఈ పరిసర ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుందని పలువురు భావిస్తున్నారు.

**ఆ గ్రామాలు ఇవే..**

పూడూరు మండలంలోని 23, వికారాబాద్‌లో 13, నవాబుపేట 11, పరిగి 4, మోమిన్‌పేట మండల పరిధిలో 3 గ్రామాలు ఉన్నాయి. గెజిట్ విడుదల కాగానే మహా నగరం హైదరాబాద్ పరిధిలోకి వెళ్తాయి. అయితే పాలనాపరంగా వికారాబాద్ జిల్లాలోనే కొనసాగుతాయి.

పూడూరు: అంగడిచిట్టెంపల్లి, చెన్‌గొముల్, చీలాపూర్, చింతలపల్లి, కండ్లపల్లి, కెరవెళ్లి, కడ్మూర్, కొత్తపల్లి, మంచన్‌పల్లి, ఎన్కెపల్లి, మన్నెగూడ, పూడూరు, సోమన్‌గుర్తి, మేడిపల్లికలాన్, మీర్జాపూర్, మిట్టకంకల్, నిజాంపేట్ మేడిపల్లి, పెద్దఉమ్మెంతాల్, కుత్బుల్లాపూర్, రేగడి మామిడిపల్లి, తిరుమలాపూర్, తుర్కఎన్కెపల్లి.

వికారాబాద్: బూర్గుపల్లి, సిద్దులూరు, సిద్దులూరు చించలం, సిద్దులూరు మునుగాల్, పాతూర్, పీరంపల్లి, పులుసుమామిడి, ధన్నారం, గిరిగిట్‌పల్లి, కొంపల్లి, గుడుపల్లి, మద్గుల్‌చిట్టెంపల్లి, వికారాబాద్.

నవాబుపేట: అక్నాపూర్, చించల్‌పేట, గంగ్యాడ, గుబ్బడిఫత్తేపూర్, లింగంపల్లి, మాదిరెడ్డిపల్లి, ముబారక్‌పూర్, నవాబుపేట, పూలపల్లి, పులుమామిడి, ఎల్లకొండ.

మోమిన్‌పేట: చక్రంపల్లి, చీమల్‌దరి, దేవరంపల్లి.

పరిగి: చిట్యాల్, మాదారం, రాపోల్, తొండపల్లి.

# కబ్జాకు కంచె

హైదరాబాద్: రాజధానిలో ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడేందుకు రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఆక్రమార్కులు ఖాళీ స్థలాల్లో టెంట్లు వేయడం, తప్పుడు పత్రాలు సృష్టించి రాత్రికి రాత్రే రేకుల షెడ్లు వేసి వాటి ఆధారంగా కోర్టులను ఆశ్రయించడం, వాటి తీర్పులు వచ్చేలోపు నిర్మాణాలు చేపట్టి ఇతరులకు విక్రయిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వినూత్న పంథాలో వెళ్లనున్నారు. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న అనిశా ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 102/పీలో రూ.2 వేల కోట్ల విలువైన 12 ఎకరాల భూమి చుట్టూ రూ.35 లక్షలతో కంచె నిర్మించనున్నారు. చుట్టూ సీసీ కెమెరాలు, కొన్నిచోట్ల కంట్రోల్ ప్యానళ్లను ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు



ఉండటంతో కొందరు రియల్ వెంచర్ల ప్రతినిధులు, ప్రైవేటు వ్యక్తులు, రౌడీషీటర్లు, వారి అనుచరులు వాటిని ఆక్రమించేందుకు తరచూ ప్రయత్నాలు చేస్తున్నారు. నిజాం కాలం నాటి పత్రాలు సృష్టించి చుట్టూ కంచె వేసి ఈ భూమి ఫలానా వ్యక్తిది.. ఇక్కడ ఎవరైనా నిర్మాణాలు చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని వారే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

**గజం భూమీ వదలం... కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

రెవెన్యూ రికార్డుల్లో ఉన్న స్వల్ప లోపాల కారణంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు డిజిటల్ సాక్ష్యాలు, ఫోటోలు తీయించనున్నాం. రికార్డులు పక్కాగా కంప్యూటరీకరిస్తాం. యాప్‌లో నమోదు చేసి.. గజం భూమిని కూడా వదులుకోం. టౌన్, సర్వే రికార్డులను నవీకరించి వాటి సరిహద్దులను ఎలక్ట్రానిక్ ఫెన్సింగ్ ద్వారా ఏర్పాటు చేయనున్నాం.

# విలీనం.. వీడని సందిగ్ధం

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో విలీనమైన 12 పంచాయతీలపై సర్వే చేసిన నివేదిక దస్త్రాన్ని పురపాలకశాఖ అధికారులు ఇటీవల ప్రభుత్వానికి పంపారు. దీనిలో వేములవాడ పురపాలికలో 467 జనాభాతో విలీనమైన అయ్యోరుపల్లికి మాత్రమే తిరిగి పంచాయతీగా ఏర్పాటుకు ప్రభుత్వ వర్గాలు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా 11 పంచాయతీలపై స్పష్టత రాలేదు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 83,500 జనాభా ఉంది. 2018లో విలీనమైన పెద్దూరు, సర్దాపూర్, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి, చంద్రంపేట, రగుడు పంచాయతీలు కలుపుకుని మొత్తం లక్ష జనాభాకు చేరింది. దీంతో సిరిసిల్లను ద్వితీయశ్రేణి పురపాలికగా గుర్తించారు. అటు వేములవాడ పురపాలికలో విలీనమైన తిప్పాపూర్, శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, నాంపల్లి, కోనాయిపల్లి పంచాయతీల కలుపుకుని 45 వేలకు చేరుకుంది. అయినా తృతీయశ్రేణి పురపాలికగానే కొనసాగుతోంది.



**అభివృద్ధి విస్తరిస్తుందని..**

పంచాయతీలు పురపాలికలో విలీనం చేయడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విరివిగా నిధులు సమకూరడంతో అభివృద్ధి విస్తరిస్తుందని అందరూ భావించారు. దీనిని కొన్ని గ్రామాల్లోని ప్రజలు వ్యతిరేకించారు. అప్పటికే పురపాలిక ఎన్నికలు రావడంతో యంత్రాంగం వార్డుల విభజన చేయగా ఎన్నికలు పూర్తయ్యాయి. తర్వాత పంచాయతీల్లోని రికార్డులను రెండు పురపాలికలు స్వాధీనం చేసుకున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విలీన పంచాయతీల విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. వేములవాడలో అయ్యోరుపల్లిని తిరిగి పంచాయతీగా ఏర్పాటు చేస్తానని విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దీనిపై సిరిసిల్ల, వేములవాడలో విలీన పంచాయతీలపై ప్రత్యేక బృందం అధ్యయనం చేసింది. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, జరుగుతున్న పనులపై నివేదికను ప్రభుత్వానికి అందించారు.

సిరిసిల్ల పురపాలికలో విలీనమైన పంచాయతీల్లోని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఎలా విలీనం చేస్తారని న్యాయస్థానం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దానికి అప్పటి ప్రభుత్వం నుంచి విలీన పల్లెల్లో పదేళ్ల వరకు అస్తిపన్నులు పెంచమని, విలీన పల్లెల్లో అభివృద్ధి విస్తరిస్తామని వివరించారు. ప్రభుత్వ హామీతో అప్పుడు ఈ విషయం సద్దుమణిగింది. ఇటీవల పురపాలికల పదవీ కాలం ముగియడం.. ఎన్నికల హామీలను గుర్తుచేయడంతో మరోసారి తెరపైకి వచ్చింది.

సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల పరిధిలో 2050 బృహత్‌ప్రణాళిక అమలుకు ఇటీవల సర్వే జరిగింది. పట్టణ విస్తీర్ణం.. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అభివృద్ధిపై పూర్తి నివేదికను సిద్ధం చేస్తున్నారు. విలీన పంచాయతీలపై డీటీసీపీ అన్సారీని సంప్రదించగా.. పంచాయతీలకు సంబంధించి పూర్తి వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.

చురకలు


# మార్చి నెలలో చర్లపల్లి నుంచి మరిన్ని రైళ్ల పరుగులు

హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ నుంచి చెన్నై, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడానికి పచ్చజెండా ఊపిన దక్షిణమధ్య రైల్వే మార్చిలో మరో ఎనిమిది రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గిస్తూ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. రైలు ప్రయాణాలకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సమయం 60 రోజులు ఉండటంతో.. గడువు ముగుస్తున్న కొద్దీ రైళ్ల రాకపోకలను చర్లపల్లి మీదుగా సాగించాలని నిర్ణయించింది.

**50వేల మంది రాకపోకలు సాగించేలా..**

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రోజూ సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరకు రవాణా పార్సిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారు 40శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులోగా మొత్తం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం నిర్దేశించుకుంది.



రోజూ 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు, నిర్మాణ పనులు చేపట్టడంలో సమతూకం పాటించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పది ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. రెండు ప్లాట్‌ఫామ్‌ల చొప్పున దఫదఫాలుగా పనులు పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో తెలిపారు. ఈ మేరకే చర్లపల్లి నుంచి రైళ్లను నడపడం, హాల్టింగ్ తదితర అంశాలను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు.

**వచ్చి పోయే రైళ్లు ఇవే..**

చెన్నై ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్), శబరి ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం), శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ- మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (రాత్రి).

# జేబీఎస్ చెంత మెట్రో రైల్ హబ్

మేడ్చల్ : మెట్రోరైలు రెండోదశలో భాగంగా జేబీఎస్ వద్ద మెట్రోరైల్ హబ్ ఏర్పాటు చేయబోతున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) వెల్లడించింది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభ స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేసి.. ప్రపంచస్థాయి ఇంటిగ్రేటెడ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత మార్గంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ అవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన మేడ్చల్, శామీర్‌పేట మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును అధికారులు ప్రారంభించారు. ప్యారడైజ్–మేడ్చల్(23 కి.మీ.), జేబీఎస్–శామీర్‌పేట(22 కి.మీ.) ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్ రూపొందించడంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదార్లతో కలిసి హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.



**భూగర్భ మార్గాన్ని నివారించేలా..**

క్లిష్టమైన మలుపులు, బేగంపేట విమానాశ్రయం రన్‌వే తర్వాత భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకుకెళ్లే ఆవశ్యకతను నివారించేలా, ప్రైవేటు ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ అధికారులకు సూచించారు.సొరంగం ద్వారా కాకుండా బోయిన్‌పల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని తెలిపారు. అక్కడి నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను నిర్మించవచ్చని అన్నారు. దీంతో మేడ్చల్ –జేబీస్–ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట–శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటవుతుందని తెలిపారు.

జేబీఎస్–శామీర్‌పేట మెట్రో మార్గం సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ప్రస్తుతమున్న మొదటి మెట్రో స్తంభం నుంచి డబుల్ ఎలివేటెడ్‌గా కరీంనగర్ రహదారిపై హెచ్ఎండీఏ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌గా నేరుగా పొడిగించవచ్చని ఎన్వీఎస్‌రెడ్డి వివరించారు.

స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆదేశించారు.

# మట్టి, రాళ్లు తరలించి.. భూమిని ఆక్రమించి



జగిత్యాల : వరదకాలువకు ఇరువైపులా గుట్టలుగా ఉన్న మట్టిని తరలించి నేలను చదునుచేసి భూమిని ఆక్రమించిన ఈ చిత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోనిది. కేవలం మల్యాల మండలంలోనే కాదు ఉమ్మడి జిల్లాలో దాదాపు 137 కి.మీ విస్తరించి ఉన్న వరదకాలువ వెంబడి ఇలాంటి దృశ్యాలు సాధారణంగా మారి కాలువ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వరదాయనియైన శ్రీరామసాగర్ ప్రాజెక్టు మిగులు జలాలను ఆయకట్టేతర మెట్ట ప్రాంతాలకు తరలించే ఉద్దేశంతో నిర్మించిన వరద కాలువ నేడు బహుల రీతుల వినియోగ కాలువగా మారింది. పంపుహౌస్‌ల ద్వారా ఎల్లంపల్లి జలాలను వరదకాలువ గుండా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయటం.. వరదకాలువ నుంచి ప్రధాన చెరువుల్లోకి, కాకతీయ కాలువలోకి నీటిని తరలించటం.. ఎస్సారెస్పీ నుంచి మిగులు జలాలను మధ్యమానేరు, దిగువమానేరుకు తరలించటం.. కాలువలోని నీటిని వేలాది మోటార్ల ద్వారా పంటలకు పారించటం, చేపలపెంపకం తదితరాలతో వరదకాలువ ప్రధాన నీటి వనరుగా నిలుస్తోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన వరదకాలువకు ఇరువైపులా కట్టల మట్టి, బండరాళ్లను తరలించటం, భూమి ఆక్రమణ తదితరాలతో కాలువ ఆనవాళ్లు కోల్పేయే పరిస్థితి తలెత్తుతోంది.

వరదకాలువ 28వ కి.మీ వద్ద జగిత్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. మెట్పల్లి, కోరుట్ల, కథలాపూర్, బీమారం, మల్యాల, గంగాధర, రామడుగు, బోయినపల్లి తదితర మండలాల ద్వారా మధ్యమానేరులోకి రోజుకు 2 టీఎంసీల నీటి తరలింపు సామర్థ్యం కలిగి ఉంది. మధ్యమానేరు నుంచి దిగువకు కూడా కాలువను నిర్మించారు. ప్రతిరోజూ 22 వేల క్యూసెక్కుల నీటి తరలింపునకు కాలువను చాలాచోట్ల 30 మీటర్ల వరకు లోతుగా తవ్వటంతో కాలువకు ఇరువైపులా పోసిన మట్టి, రాళ్లు గుట్టలుగా మారాయి. కట్టలపై భారీ చెట్లు పెరిగాయి. ఇటీవల కట్టల మట్టిని జేసీబీలు, ట్రాక్టర్లద్వారా పెద్దఎత్తున తరలించి చదునుచేసిన భూములను ఆక్రమిస్తున్నారు. చాలాచోట్ల పక్కన పొలాలున్నవారు వరదకాలువ భూమిని తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారు. కొన్నిచోట్ల వరదకాలువ భూముల్లో నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. కట్టలపై పెరిగిన చెట్లను నరికివేసి తరలిస్తున్నారు. కట్టపై రాళ్లను కంకరగా మార్చే క్రషర్లను కూడా నిర్వహించటం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. దీంతో కరకట్టలు లేక మల్యాల తదితర మండలాల్లో వర్షపునీరు నేరుగా కాలువలోకి ప్రవహించి కాలువ పూడుకుపోతుండగా దిగువకు వర్షపునీటి ప్రవాహం పెరుగుతోంది. పూడికమట్టితో కాలువలో నీటి తరలింపు సామర్థ్యం తగ్గి పంపుహౌస్‌లు పనిచేయలేని స్థితి వస్తుంది. రైతుల పంపుసెట్లకు కూడా నీరందని దుస్థితి నెలకొంటుంది. ఇదే పరిస్థితి కొన్నేళ్లు కొనసాగితే కట్టల మట్టి తగ్గి కాలువ మొత్తం వరదనీటి పూడికతో నిండిపోయి ఎగువకు, దిగువకు నీటితరలింపు కష్టసాధ్యంగా మారి ఉమ్మడి జిల్లాలో తీవ్ర నీటిసమస్యకు దారితీయనుంది. కాలువ కరకట్టల మట్టి, రాళ్లు, చెట్లను పరిరక్షించి ఆక్రమిత భూముల స్వాధీనానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

దీనిపై వరద కాలువ అధికారి సుధాకిరణ్ మాట్లాడుతూ ఇటీవల అయిదుగురు ఈఈలు, సిబ్బందిని కాలువ పరిరక్షణ, నిర్వహణకు ప్రభుత్వం నియమించిందన్నారు. ఇకపై ఎలాంటి అక్రమాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.కథలాపూర్ మండలంలోని పెగ్గెర్ల, కథలాపూర్, దుంపెట, దూలూరు, తక్కళ్లపెల్లి గ్రామాల మీదుగా సుమారు 14 కి.మీ పొడవునా వరద కాలువ విస్తరించి ఉంది. కాలువకు ఇరువైపులా ఉన్న మట్టిని అక్రమంగా తవ్వి కోరుట్ల పట్టణానికి, చుట్టు పక్కల గ్రామాలకు తరలిస్తున్నారు. వరద కాలువ స్థలం చదును చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

# ఆపరేటర్ల తప్పిదం.. అర్హులకు అన్యాయం




సంగారెడ్డి : ప్రభుత్వం గృహజ్యోతి పేరుతో ఉచిత గృహ విద్యుత్తు పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకానికి అర్హులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. కొంతమందికి అర్హత ఉన్నప్పటికీ.. బిల్లుల చెల్లించాల్సి వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజాపాలన రశీదు, సంబంధిత పత్రాలతో మండల పరిషత్తు, మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ లేదన్న సమాధానంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**హడావుడిగా నమోదుతో..**

ప్రజాపాలన దరఖాస్తుకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను హడావుడిగా నిర్వహించారు. ఇందుకోసం ఎక్కువగా ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. దరఖాస్తు ఫాంలో అన్ని పథకాలకు ఐచ్ఛికాలు ఇచ్చినప్పటికీ.. ఆపరేటర్లు చాలామంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఆపరేటర్ల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలకు దరఖాస్తు చేసినప్పటికీ.. ఇప్పుడు ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తే దరఖాస్తు చేయనట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సంబంధిత పత్రాలతో కార్యాలయాలకు వెళితే తాము ఏమీ చేయలేమని, ఐచ్ఛికం ఇచ్చినప్పుడు నమోదు చేస్తామని పత్రాలు తీసుకొని పంపుతున్నారు.

జిల్లాలో ఆహార భద్రత కార్డులు: 3.78 లక్షలు
గృహ విద్యుత్తు వినియోగదారులు: 6.14 లక్షలు
జీరో బిల్లుల జారీ: 2.16 లక్షలు
జీరో బిల్లులకు ఫిబ్రవరి రాయితీ: రూ.6.19 కోట్లు

ఇంటింటి సర్వేలో వివరాలు సేకరించినా..

విద్యుత్తు సిబ్బంది ఇంటింటికీ తిరిగి వినియోగదారుల వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాలనీల్లో శిబిరాలు సైతం ఏర్పాటు చేసి సమాచారం సేకరించారు. జిల్లాలో నెలకు 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్న వారే ఎక్కువ. మొత్తం రేషన్ కార్డులు 3.78 లక్షలు ఉండగా జీరో బిల్లులు 2.16 లక్షల కనెక్షన్లకు మాత్రమే జారీ అవుతుండటంతో మిగతా వినియోగదారులు నిరాశ చెందుతున్నారు.

**ప్రజాపాలన కేంద్రాల్లో సంప్రదించాలి**

శ్రీనాథ్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

గృహజ్యోతి పథకం కింద అర్హులందరికీ జీరో బిల్లులు జారీ చేస్తున్నాం. అర్హత ఉండీ బిల్లులు వస్తున్న వారికి ప్రజాపాలన కేంద్రాల్లో సంప్రదించాలని సూచిస్తున్నాం. ఎడిట్ ఆప్షన్ వచ్చినప్పుడు వివరాల నమోదుకు అవకాశం ఉంటుంది.

# పనుల హడావుడి. పర్యవేక్షణ కొరవడి!

సంగారెడ్డి : ప్రజా రవాణా సాఫీగా సాగాలనే లక్ష్యంతో చేపట్టిన జాతీయ రహదారి(ఎక్స్‌ప్రెస్ హైవే) విస్తరణ పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. గుత్తేదారు నిర్లక్ష్యం.. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని చోట్ల నాణ్యతలోపం తేలతెల్లమవుతోంది. పనుల వద్ద ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో.. ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులకూ ఇక్కట్లు తప్పడం లేదు. తరచూ రోడ్డు ప్రమాదాలతో పాటు.. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. జిల్లాలో చేపట్టిన 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల తీరిది. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

**రూ.800 కోట్లు మంజూరు**

సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి కూడలి నుంచి హైదరాబాద్‌లోని మదీనాగూడ వరకు 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి రూ.800 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.29.35 కిలో మీటర్ల మేర పనులు చేపట్టాలని గుత్తేదారుతో ఒప్పందం చేసుకున్నారు. గతేడాది జూన్‌లో పనులను శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాది జులై 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. హైవే విస్తరణలో భాగంగా తొలుత రహదారికి ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణాలు చేపడుతున్నారు. తారు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మురుగు కాల్వలు నిర్మించిన కొద్ది రోజులకే శిథిలమవుతున్నాయి. తారు పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

**తరచూ ప్రమాదాలు**

పనులు జరుగుతున్న చోట సరైన సూచికలు లేకపోవడంతో ఇటీవల కంది శివారులోని ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట రెండు లారీలు ఢీకొన్నాయి. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇక్కడికి సమీపంలోనే డీజిల్ వాహనం బోల్తాపడింది. ఆటో నూతనంగా నిర్మించిన మురుగు కాల్వలో పడింది.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా కందిలోని కిసాన్ సాగర్‌కు చెందిన అయిదు వరద కాల్వలను మూసివేశారు. నీరు దిగువకు వెళ్లే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా చేపడుతున్న పనుల వల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.

రహదారి విస్తరణ పనులు ఇలా..
పనులు చేపట్టాల్సిన మొత్తం కిలో మీటర్లు: 29.35
ఎడమవైపు పూర్తయిన తారు రోడ్డు పనులు: 4.75 కి.మీ.
కుడి వైపు: 1.75 కి.మీ.
ఇప్పటి వరకు నిధుల వ్యయం: రూ.20 కోట్లు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. మురుగు కాల్వల నిర్మాణాలకు నీటి తడులు అందిస్తున్నాం. పంట కాల్వలపై రోడ్డు నిర్మాణం విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారు. కాలువలు మూసేయకుండా చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది జులై లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ, డిప్యూటీ ఈఈ, నేషనల్ హైవే అథారిటీ.

# జలాశయంలో నీరు.. సాగు భూములకు అందని తీరు

కోనరావుపేట : మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయటానికి గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టింది. దీనిలోకి మధ్యమానేరు ద్వారా గోదావరి జలాలను తరలించి తద్వారా సాగు భూములకు నీరందించాలన్నది లక్ష్యం. అయితే కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చెరువులు, కుంటలు నింపే పరిస్థితి లేదు. జిల్లాలో కోనరావుపేట మండలం మల్కపేటలో సుమారు రూ.వేయి కోట్ల వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర క్రితం రెండు పంపు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించి మధ్యమానేరు నుంచి గోదావరి జలాలను నింపారు. జలాశయం సామర్థ్యం 3 టీఎంసీలకు గాను 1 టీఎంసీ మేర నిల్వ చేశారు. ప్రస్తుతం నీరు తగ్గింది. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జలాశయంపై దృష్టిసారించారు. నీటిపారుదల ఉన్నతాధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. మాధ్యమానేరు నీటి లభ్యత ఆధారంగా ఇందులోకి నీటి తరలింపునకు చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, పంపు



మోటార్ల గుత్తేదారులు 0.2 టీఎంసీ నీటిని తరలించారు. దీంతో ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. జలాశయం దిగువ, ఎగువ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో బోరుబావులకు నీరు అంది పంటల సాగుకు అవకాశం ఏర్పడింది.

**నిర్మాణం ఇలా...:** జలాశయం కుడి కాలువ సుమారు 12.03 కిలో మీటర్లు ఉంది. వేములవాడ అర్బన్ మండలం మారుపాక వరకు ఉంది. అక్కడక్కడ వదిలేయడంతో 11 కిలో మీటర్లు పనులను రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. మల్కపేట ఊర చెరువు శిఖం భూములు 40 ఎకరాల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రైతులు కాలువ తవ్వకానికి అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. ః నాగారం–పల్లిమక్త మధ్య ప్రధాన రోడ్డులో కాలువ ద్వారా నీటి సరఫరాకు వంతెన నిర్మించాల్సి ఉంది.

ఎడమ కాలువ సుమారు 7 కిలో మీటర్లు కాగా భూసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పల్లిమక్త, సుద్దాల, మల్కపేట గ్రామాల్లోని పలు చోట్ల సీసీ నిర్మించాల్సి ఉంది.

చెరువులు నింపితే మేలు

మాది ఉమ్మడి కుటుంబం. అంతా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు 10 ఎకరాల భూమి ఉంది. కుడి కాలువ నిర్మాణంలో ఎకరం కోల్పోయ్యా. నాలుగు బోరుబావుల ద్వారా మిగిలినది యాసంగిలో వరి సాగు చేశాం. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోతాయి. పంటలు చేతికందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన కాలువలను పూర్తి చేసి చెరువులు నింపితే యాసంగి పంటలు ఎండిపోకుండా ఉంటాయి.

జిన్న అనిల్, రైతు, పల్లిమక్త

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

మల్కపేట ఊర చెరువు శిఖం భూముల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వరాదు. మల్కపేట రైతుల సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరిస్తే సుమారు అర కిలో మీటరు మేర కాలువ తవ్వకం చేపడితే గొలుసు కట్టు కాలువల ద్వారా సుమారు 10 చెరువులను నింపటానికి అవకాశం ఉంటుంది.వినోద్, డీఈ, మల్కపేట రిజర్వాయర్

# ఆంగ్లంపై పట్టు.. భవితకు మెట్టు

మెదక్ : ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం గత ఏడాది నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షకు శ్రీకారం చుట్టింది. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఆంగ్ల ప్రయోగ పరీక్ష ఉండగా, ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైతం పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రయోగ పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా పరిగణిస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించనుండగా అందుకోసం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

**నాలుగు దశల్లో ..**

ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 13,401 మంది ఉన్నారు. వీరందరికీ తరగతి గదిలోనే భాషా సామర్థ్యాల పరిశీలనతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో దశలో నాలుగు మార్కుల చొప్పున, ప్రయోగ పరీక్షకు నాలుగు మార్కులు కలిపి మొత్తం 20 మార్కులు కేటాయించారు. మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తున్నారు.

రెండో దశలో ఇక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.మూడో దశలో తల్లిదండ్రులు లేదా మరేదైన అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి.

నాలుగో దశలో గ్రహించే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు. వీటితో పాటు రికార్డు బుక్ ఉంటేనే వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.

30న పర్యావరణ విద్యపై..

పర్యావరణ విద్యపై అన్ని రకాల విభాగాలకు సంబంధించిన విద్యార్థులకు ఈనెల 30 తేదీన పరీక్ష నిర్వహిస్తుండగా, ఇంటర్మీడియట్‌లో 2024కు ముందు గల బ్యాక్‌లాక్ విద్యార్థులకు మాత్రమే నైతికత–మానవ విలువలు సంబంధించిన పరీక్షను ఈనెల 29న నిర్వహించనున్నారు.

మొత్తం విద్యార్థులు
ప్రథమ సంవత్సరం: 6,928
ద్వితీయ : 6,473
జిల్లాలోని కళాశాలలు: 61

ప్రతి ఒక్కరూ హాజరవ్వాలి– మాధవి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

ఇంటర్ స్థాయి నుంచే ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు గత ఏడాది నుంచి విద్యాశాఖ ఆంగ్ల ప్రయోగ పరీక్షను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీన రెండు విడుతల్లో ప్రయోగ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు ఆంగ్ల ప్రయోగ పరీక్షకు కచ్చితంగా హాజరుకావాలి.

చురకలు



# అరటి.. నష్టాలు మిగిల్చి

తాడిపత్రి: జిల్లాలో సిరులు కురిపించిన అరటి సాగు ప్రస్తుతం నష్టాలను మిగిలిస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా విపణిలో సరైన ధర లేకపోవడంతో రైతులు దిక్కులు చూస్తున్నారు. మరోవైపు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా చెట్లు ఎండిపోతున్నాయి. కాయలో నాణ్యత లోపించడంతో వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. అనంతపురం జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు. బిందు, తుంపర సేద్య పద్ధతుల్లో పంట సాగవుతోంది. గత ప్రభుత్వం రాయితీపై బిందు సేద్య పరికరాలు అందివ్వలేదు. రైతులే సొంత ఖర్చుతో కొనుగోలు చేశారు. ఇది రైతులకు భారంగా మారింది. మరోవైపు వ్యాపారుల మాయాజాలంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతు న్నారు.

**పెట్టుబడులు దక్కని పరిస్థితి**



గత ఖరీఫ్‌లో సాగు చేసిన పంటకు రైతులు ఎకరాకు రూ.1.60 లక్షల పెట్టుబడితో బిందు సేద్య పద్ధతిలో సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. జనవరి నుంచి పంట చేతికి వస్తోంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో టన్ను ధర రూ. 25 వేలు పలికింది. ప్రస్తుతం రూ.10 వేలు కూడా లేదు. ఈపరిస్థితి కర్షకులకు కన్నీరు తెప్పిస్తోంది.

**పంట తొలగింపు...**


కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన రైతు ఉమేష్ రూ.3 లక్షల పెట్టుబడితో మూడు ఎకరాల్లో అరటి సాగు చేశారు. పంట కోత దశకు వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.5-8 ధర ఉండటం, దీనికి తోడు వ్యాపారులు ముందుకు రాలేదు. చివరకు తోపుడు బండ్లపై డజన్ రూ.50-60 (2-3 కిలోలు)లు విక్రయిస్తున్నారు. ఎండలకు వ్యాపారం సాగించలేక గురువారం ఎకరా అరటి తోట తొలగించానని కన్నీరుమున్నీరవుతున్నారు. మంచి ధరలు ఉంటే దాదాపు రూ.16లక్షల వరకు వచ్చేదని వాపోయారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం – ఉమాదేవి, ఉద్యానశాఖ అధికారిణి, తాడిపత్రి**

ఎండల కారణంగా ధరలు అమాంతం పడిపోయాయి. దూర ప్రాంతాలకు తరలించేందుకు వ్యాపారులు మొగ్గుచూపడం లేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ కంపెనీలు పంట కొనుగోలు చేయడంతో ధరలు ఆశాజనకంగా ఉండేవి. ప్రస్తుతం స్థానిక మార్కెట్లకు మాత్రమే పంట తరలించే పరిస్థితి ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

# ఉపాధిలో అక్రమాల గునపం

కర్నూలు: కోడుమూరుకు చెందిన అబ్దుల్ గని దుబాయిలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయనకు ఇక్కడ ఉపాధి జాబ్‌కార్డు ఉంది.. కూలీగా పేరు నమోదై ఉండటంతో ఆయన పేరుతో వేతనాలు మంజూ రు చేసి పక్కదారి పట్టించారు. తుగ్గలి మండలం రాతనలో రూ.3 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు జిల్లా ఉన్నతాధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నిజమేనని తేల్చిన అధికారులు రికవరీ మాత్రం చేయడం లేదు. ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడా నికి ఫొటో విధానాన్ని తీసుకొచ్చారు.. క్షేత్రస్థాయిలో కూలీల చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి.. ఇక్కడే అక్రమాలకు ఆస్కారం నెలకొంటోంది.. సిబ్బంది మార్ఫింగ్ చేసి చిత్రాలు అప్‌లోడ్ చేసి నిధులు నొక్కేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.19 కోట్లు పక్కదారి పట్టినట్లు అధికారులు నిర్ధారించారు. వాటిలో సుమారు రూ.9 కోట్లు వసూలు చేశారు. మిగిలిన మొత్తానికి సంబంధించి ఆర్.ఆర్. చట్టం కింద రూ.3.20 కోట్లు వసూలు చేసేలా 152 కేసులు నమోదు చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయాలంటూనూ సూచించినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు దోచుకున్న మొత్తాలను వసూలు చేయడంలోనూ అంతులేని తాత్సారం జరుగుతోంది.



**మసకబారిన విజిలెన్స్ విభాగం**

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) విజిలెన్స్ విభాగ అధికారిగా ఉన్న భాస్కర్ పంచాయతీ అధికారిగా సుమారు ఐదు నెలల కిందట బదిలీ అయ్యారు. ఆదోని ఏపీడీకే డి.వి.ఒ. బాధ్యతలు అప్పగించారు. ఆయన ఆదోనిలో ఉండాల్సి వస్తుండటంతో కీలకమైన విజిలెన్స్ విభాగ విధులు నిర్వర్తించలేని దుస్థితి తలెత్తింది.

జిల్లాలో ఏటా రూ.270 కోట్లు ఉపాధి హామీ కింద వేతనాల రూపంలో చెల్లింపులు జరుగుతుండగా సామగ్రి నిమిత్తం మరో రూ.150 కోట్ల వరకు వెచ్చిస్తుంటారు. వాటిపై దృష్టి సారించాల్సిన కీలక అధికారి లేకపోవడంతో అక్రమాలకు ఆస్కారం నెలకొంది.

గత ఐదేళ్ల వైకాపా హయాంలో అక్రమాలకు అంతేలేదు. నాలుగేళ్ల కాలంలో మొత్తం 3,399 పనుల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. ఆయా పనుల్లో రూ.1.23 కోట్లు దుర్వినియోగమైనట్లు తేల్చారు.

**తుగ్గలిలో రూ.4,10,189 దుర్వినియోగం:** ఉపాధి హామీ పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో రూ.4,10,189 దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం తేల్చింది. నిబంధనలు పాటించకపోవడంతో ఉపాధి సిబ్బందికి రూ.3,51,500 జరిమానా విధించినట్లు డ్వామా ఏపీడీ మాధవీలత తెలిపారు. దుర్వినియోగమైన సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో రెండు రోజులుగా జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభ ముగిసింది. ఉపాధి ఏపీడీ పక్కీరప్ప పాల్గొన్నారు.

# పట్టణవాసి దాహార్తి తీర్చేలా..!



అనకాపల్లి : గత ప్రభుత్వంలో పడకేసిన తాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పట్టాలెక్కించేందుకు కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఓ వైపు జల్‌జీవన్ మిషన్‌తో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి నీటిని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు పురపాలక సంఘాల్లో పట్టణవాసుల దాహార్తిని తీర్చడానికి వివిధ బ్యాంకుల రుణాలతో మెగా తాగునీటి పథకాలను నిర్మించబోతున్నారు. వచ్చే 20 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసి తలసరి 135 లీటర్ల తాగునీటి సరఫరా చేయాలన్న ఉద్దేశంతో సమగ్ర రక్షిత నీటి పథకాలకు 2014-19 లోనే రూపకల్పన చేశారు. వైకాపా హయాంలో వాటి పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టిసారించి తాగునీటి ఇబ్బందులు తొలగేలా కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**ఏఐఐబీ ప్రాజెక్టుకు మరో మూడేళ్లు పొడిగింపు..**

గతంలో ఆసియన్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నిధుల సహకారంతో ఎలమంచిలిలో రూ.101.75 కోట్లతో మెగా తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఈ పనులు రెండు ప్యాకేజీలుగా గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వైకాపా సర్కారు చొరవ చూపకపోవడంతో ఎనిమిది గ్రామాల్లో రోడ్లు తవ్వి పైపులైన్లు వేసి సగంలోనే నిలిపేశారు. ఈ ఏఐఐబీ ప్రాజెక్టు గతేడాది మార్చి 31తో గడువు పూర్తయింది. కూటమి ప్రభుత్వ పెద్దలు సదరు బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడి మరో మూడు ఏళ్లు గడువు పెంచాలని ప్రతిపాదించగా ఇటీవల ఆమోదించారు. 2028 జూలై లోగా ఈ తాగునీటి పథకం పనులకు సహకరించడానికి సమ్మతించారు. త్వరలో ఈ పనులు కార్యరూపంలోకి రానున్నాయి. దీనివల్ల ఎలమంచిలి పురపాలక పరిధిలో 14 వేల ఇళ్లకు రక్షితనీరు అందనుంది.

**నర్సీపట్నంలో కొత్త అంచనాలతో..**

నర్సీపట్నంలో మొదట రూ.142.76 కోట్లు అంచనాతో గత తెదేపా ప్రభుత్వంలోనే అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు శిలాఫలకం వేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇదే పథకానికి అంచనా విలువ పెంచి రూ.166 కోట్లతో అప్పటి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శంకుస్థాపన చేశారు. కొన్ని వార్డుల్లో రోడ్లు తవ్వి పైపులు వేసి ఆపేశారు. ఈ నిలిచిపోయిన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లేలా శాసన సభాపతి అయ్యన్నపాత్రుడే మరలా బాధ్యత తీసుకున్నారు. కొత్తగా రూ.185.29 కోట్ల అంచనాతో సవివర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేశారు. ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకుని ఈ పనులను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలని చూస్తున్నారు.

**కథనాలతో అనకాపల్లికి శుద్ధజలం..**

2019లో అగనంపూడి వద్ద ఏలేరు కాలువ నీటిని శుద్ధిచేసి అనకాపల్లి జోన్‌కు సరఫరా చేయడానికి అప్పటి సీఎం జగనే రూ.32 కోట్లతో శంకుస్థాపన చేశారు. అయిదేళ్లు గడిచినా ఈ పనులు పూర్తి చేయలేకపోయారు. పలుమార్లు కథనాలు రావడంతో కూటమి సర్కారు స్పందించింది. అసంపూర్తిగా నిలిచిన పైప్‌లైన్ పనులు దాదాపు పూర్తిచేయించింది. ఈ వేసవిలోనే అనకాపల్లి వాసులకు శుద్ధజలం అందుబాటులోకి తీసుకురాబోతున్నారు.

# స్వర్ణ కుప్పం సాకారమిలా..!



కుప్పం : రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన కుప్పం.. ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధికి దూరంగా నిలిచింది. గతంలో తెదేపా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు వైకాపా ప్రభుత్వం రంగులేసుకుని చలామణి అయ్యింది. పురపాలిక అభివృద్ధికి రూ.66 కోట్లు, నాలుగు మండలాల అభివృద్ధికి రూ.100 కోట్లు అంటూ ముఖ్యమంత్రి హోదాలో కుప్పం పర్యటనలో జగన్‌మోహన్‌రెడ్డి వాగ్దానం ప్రచార్భాటానికే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐదేళ్లు కుప్పంలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తామంటూ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ మేరకు నిధులు.. అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు.

**700 మందికి ఉద్యోగాలు**

నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు కడా, 1ఎం1బీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించగా 700 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. వీటితో పాటు అలీప్ పరిశ్రమ మౌఖిక ఒప్పందం, మదర్, శ్రీజ మిల్క్ డెయిరీల శంకుస్థాపనలు జరిగాయి. డిజిటల్ ఎడ్యుకేషన్ కోసం ఫొంటీర్ మార్కెట్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. ఇప్పటి వరకు కడా ఎనిమిది పరిశ్రమలతో మౌఖిక ఒప్పందం చేసుకుంది.

**పది సూత్రాలతో సాగేలా..**

స్వర్ణ కుప్పం విజన్-2029.. అమలుకు పది సూత్రాల అజెండాతో సాగుతున్నారు. రూ.2 వేల కోట్లకు ప్రతిపాదనలు పంపారు. రూ.200 కోట్లు మంజూరయ్యాయి.

**పర్యావరణ పరిరక్షణకు ఈ-బస్సులు**

కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శ డిపోగా మార్చేందుకు రూ.70 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రస్తుతం ఉన్న బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు ఓ పరిశ్రమతో ఒప్పందం చేసుకోగా, ప్రస్తుతం ఓ బస్సును కుప్పం డిపో నుంచి ఆ సంస్థకు అప్పగించారు. ఆ బస్సును ఎలక్ట్రిక్ బస్సుగా మార్చితే మిగిలిన 96 సర్వీసులను మార్చనున్నారు.

**సింగపూర్ బృందం పర్యటన:** ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలు రూపొందించేందుకు సింగపూర్ ప్రతినిధులు ఇటీవల కుప్పంలో పర్యటించారు.

లక్ష్యం సాధిస్తాం: అభివృద్ధిలో ఆదర్శంగా కుప్పాన్ని నిలిపేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వానికి ప్రణాళికలు పంపాం. లక్ష్యాన్ని సాధిస్తాం. వికాస్ మర్మత్, కడా పీడీ

# దర్జాగా ఇసుక దందా!




పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అక్రమార్కులు వ్యాపారంగా మలుచుకుని దర్జాగా ఇసుక తరలిస్తున్నారు. ఏకంగా జిల్లా నుంచి బెంగళూరుకు రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పదిహేనురోజులకోసారి జిల్లాలోని రీచ్‌లు, డంపులను అధికారులు పరిశీలించాలని కలెక్టర్ చెబుతున్నా క్షేత్రస్థాయిలో తనిఖీల్లేవు. ఫలితంగా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

**అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట**

ముదిగుబ్బ మండలంలోని పీసీరేవు, తాడిమర్రి మండలంలోని సీసీరేవులో మాత్రమే తవ్వి.. డంపు చేసిన ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉంది. అయితే ఐదు నెలలుగా చిత్రావతిలో అక్రమంగా యంత్రాలతో ఇసుక తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారు. రోజుకి 80 టిప్పర్లకుపైగా రాత్రివేళల్లో బెంగళూరుకి తరలిపోతోంది. ఒక్కో టిప్పరు రూ.50 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**రాత్రీపగలు..**

పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని చిత్రావతి నది నుంచి రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఓబుళదేవరచెరువు, అమడగూరు సమీపంలో వేదావతి నది, తనకల్లు సమీపంలోని పాపాగ్ని, కదిరిలోని కూటాగుళ్ల, ముదిగుబ్బ సమీపంలోని మద్దిలేరు వాగు, రొద్దం మండలంలో పెన్నా, పరిగిలో జయమంగళి, అగళి మండలంలో సువర్ణముఖి నది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుక తరలిపోతోంది. ట్రాక్టరు రూ. 2వేల నుంచి రూ.3వేలు వరకు విక్రయిస్తున్నారు. ఓడీసీలో నారప్పగారిపల్లి, ఎనగలూరు, మిట్టపల్లి దగ్గర నిత్యం అక్రమ రవాణా సాగుతోంది.

**అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం**

**– రామ్మోహన్‌రావ్, మైనింగ్ ఏడీ**

నదుల నుంచి ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతి ఉంది. టిప్పర్లలో తరలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులపై ప్రత్యేక నిఘాపెట్టి పట్టుకుంటాం.

# నదులు.. నిలువెల్లా గాయాలు

నెల్లిమర్ల, : జిల్లాలో ప్రధాన నీటివనరులైన చంపావతి, గోస్తనీ నదులు ఘోషిస్తున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా నిలువెల్లా గోతులు కనిపిస్తున్నాయి. దీంతో వర్షాల సమయంలో ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రస్తుతం నీరు లేకపోవడంతో గతంలో చేపట్టిన తవ్వకాలతో ఎక్కడికక్కడే భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. అయిన ప్పటికీ ఇసుకాసురులు ఆగడం లేదు. భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల, ఎస్.కోట, జామి, గంట్యాడ, గజపతినగరం మండలాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

**అక్కడే ఎక్కువ..**

నెల్లిమర్ల నుంచి డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మీదుగా చంపావతి ప్రవహిస్తోంది. కొన్నిచోట్ల తవ్వకాలకు అనుమతులు లేనప్పటికీ పగలు, రాత్రి తేడా లేకుండా తరలించేస్తున్నారు. సమీపంలో విశాఖ జిల్లా ఉండడం, జాతీయ రహదారి కావడం తదితర కారణాలతో పెద్దఎత్తున తరలిపోతోంది. నదితో పాటు సమీపంలో గెడ్డలు, గోర్జులను సైతం వదలడం లేదు.

**నిబంధనలేవీ?**



నదుల వెంబడి పలు కీలకమైన వంతెనలు, ఊటబావులు, నీటి పథకాలున్నాయి. వీటికి 100 మీటర్ల దూరంలో తవ్వకాలు చేపట్టాలి. నిబంధనలను అతిక్రమిస్తూ నిషేధిత ప్రాంతాల్లోనూ తోడేస్తున్నారు. బొడ్డవర, ముషిడిపల్లి, వేములపల్లి, మధుపాడ, గోపాలపల్లి, మామిడిపల్లి, కొత్తకోట, కొట్టాం, తాండ్రంగి, విజినిగిరి, జామి, భీమసింగి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది.

**రూ.లక్షల్లో వ్యాపారం..** ట్రాక్టర్లు, లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎడ్ల బండ్ల యజమానులతో ఒప్పందం చేసుకుని, ఓ చోటుకు తరలించి, అక్కడి నుంచి సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రాత్రి, పగలూ తేడా లేకుండా ఈ తంతు సాగుతోంది. తనిఖీలు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని నెల్లిమర్ల తహసీల్దారు సుదర్శనరావు తెలిపారు. నిషేధిత ప్రాంతాల్లో తవ్వకాలు జరగకుండా చూస్తామన్నారు. ఊటబావులు, తాగునీటి రక్షిత పథకాలకు ఇబ్బందులు తెస్తే కఠినంగా వ్యవహరిస్తామని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డీఈ వైకుంఠరావు హెచ్చరించారు.

# కేరాఫ్.. కాకినాడ

విజయనగరం : జేఎన్‌టీయూ కాకినాడ, జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయాల (విజయనగరం)కు చెందిన ఆచార్యులు, సిబ్బంది విషయంలో ఎవరెక్కడి వారు అన్న వ్యవహారం రెండున్నరేళ్లుగా నలుగుతోంది. స్థానికంగా నియమితులై కొందరు డిప్యుటేషన్‌పై వెళ్లారని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. అనుకూలంగా నిర్ణయం వస్తోందన్న తరుణంలో ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు విస్మయానికి గురిచేస్తున్నాయి. జేఎన్‌టీయూజీలో పనిచేస్తున్న వారంతా కాకినాడ విద్యాలయం వారేనంటూ బుధవారం ప్రకటించింది. ఉపకులపతి, రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ, సిబ్బందితో సహా అందరికీ ఇది వర్తిస్తుందని పేర్కొనడంతో కలవరం రేపుతోంది. మరోవైపు ఉన్నతవిద్యాశాఖకు వివరణ ఇచ్చేందుకు విద్యాలయం అధికారులు సిద్ధమవుతున్నారు.

**నేపథ్యమిదీ..**

ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్యకున్న ఏకైక విశ్వవిద్యాలయం జేఎన్‌టీయూ. 2007లో ప్రాంగణంగా ఏర్పాటై, 2022లో విశ్వవిద్యాలయం హోదా దక్కించుకుంది. ప్రారంభంలో ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న సమయంలో ఇక్కడ 41 మంది బోధకులు ఉండేవారు. 2012లో వీరిలో 21 మంది నరసారావుపేట, కాకినాడ విద్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. తిరిగి రాలేదు. కొందరు ఐచ్ఛికం ఇచ్చి ఉండిపోయినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం స్థానికంగా 22 మంది మాత్రమే కొనసాగుతున్నారు. ఇందులో 18 మందే ఇక్కడివారు. మిగిలిన వారు కాకినాడ నుంచి వచ్చి పనిచేస్తున్నారు. అక్కడి నుంచే వీరికి జీతాలు అందుతున్నాయి. తాత్కాలిక, గంటలు ఎక్కువ కింద మరికొందరు బోధకులున్నారు. బోధనేతర సిబ్బంది కింద ఆరు పోస్టులు




మంజూరయ్యాయి. ప్రస్తుతం ముగ్గురు డిప్యుటేషన్‌పై అక్కడి నుంచి వస్తున్నారు. పొరుగుసేవల విధానంలో ఇంకొందరు నిర్వహిస్తున్నారు.

**నిధుల పరంగానే..**

జేఎన్‌టీయూ విభజన నిధుల పరంగా మాత్రమే జరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. బోధకుల విషయంలో చట్టంలో ఎక్కడా పొందుపర్చలేదని, ఇక్కడ నియమితులైన వారిలో కొందరికి ఆప్షన్ ఇచ్చి డిప్యుటేషన్‌పై తీసుకెళ్లారన్నది ఇక్కడి వారి వాదన. వారిని వెనక్కి పంపించాలని స్థానిక అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఈ ఉత్తర్వులిచ్చినట్లు తెలుస్తోంది.

**ఉన్నతాధికారుల దృష్టికి..**

– డి.రాజేశ్వరి, ఇన్‌ఛార్జి ఉపకులపతి, జేఎన్‌టీయూజీ

ప్రారంభంలో 41 మంది బోధకులు ఉండడంతో విశ్వవిద్యాలయంగా మార్చారు. అనంతరం కొందరిని డిప్యుటేషన్‌పై పంపించేశారు. చట్టవిరుద్ధంగా ఈ ప్రక్రియ జరిగిందని, తిరిగి పంపించాలని ప్రిన్సిపల్ కార్యదర్శికి తెలియజేశాం. ఈ నేపథ్యంలో ఉత్తర్వులు వచ్చాయి. మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నాం.

ప్రస్తుతం పనిచేస్తున్నవారు..

రెగ్యులర్ బోధకులు: 22
తాత్కాలిక: 51
కాల వేతనం: 56
నాన్‌టీచింగ్: 03
పొరుగుసేవలు: 62
ఇతర విభాగాల్లో: 100

# సంగమేశ్వరుడ్ని చూతం రారండి

నందికొట్కూరు : ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఆ ఆలయం లో సంవత్సరానికి నాలుగు నెలలు మాత్రమే పూజలు జరిగే పరిస్థితి ఉంటోంది. మిగతారోజుల్లో ఆలయమంతా నీటితో నిండిపోయి ఉండటంతో స్వామి దర్శనం ఎప్పుడు చేద్దామా..! అని భక్తులు ఎదురుచూస్తుంటారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం లోని సంగమేశ్వరుడ్ని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తులు నమ్ముతుంటారు. తుంగ, భద్ర, క్రిష్ణ, వేణి, భీమ, మలాపహారిణి, భవనాశి అనే ఏడు నదులు కలిసే అద్భుతమైన ప్రదేశం ఇది. పురాణాల ప్రకారం గంగా నదికి కాకి రూపం వచ్చిందని, ఆ రూపం పోగొట్టుకో వడానికి సమస్త తీర్థాలతో జలకమాడుతూ సంగమంలో స్నానం చేసి హంస రూపం పొందిందనేది కథనం. పాప నివృత్తి అయినందున ఈ ప్రదేశానికి సంగమేశ్వరం అని పేరొచ్చిందంటారు.

**జులై చివరి వారంలో....**

జులై చివరి వారంలో ఆలయం పూర్తిగా కృష్ణమ్మ ఒడిలోకి చేరింది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ ఎనిమిది నెలల తర్వాత ఆలయం పూర్తిగా కన్పించడంతో ధర్మరాజు ప్రతిష్ఠించిన వేపదారు లింగంతో పాటు ఇక్కడి వినాయకుడు, పంచముఖ ఆంజనేయ స్వామి దేవతామూర్తులు తొలిపూజను అందుకున్నారు. పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో నిల్వ ఉన్న నీరు, బురదను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టారు.



**200 సంవత్సరాల చరిత్ర**

ప్రస్తుతం కనిపిస్తున్న ఆలయాన్ని సుమారు 200 సంవత్సరాల కిందట స్థానిక ప్రజలు నిర్మించారు. సుమారు ఇరవై వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆలయంతో పాటు, చుట్టూ ప్రాకారం నిర్మించినట్లు శిథిలాలను చూస్తే అర్థమౌతుంది. ప్రస్తుతం కనిపించే ప్రధాన ఆలయం అత్యంత సాదాసీదాగా ఉంటుంది. ముఖమండపం పూర్తిగా శిథిలమై పోగా అంతరాలయం, గర్భాలయాలు మాత్రమే దర్శనమి స్తున్నాయి. గర్భాలయంలో సంగమేశ్వరుడు పూజలందుకుంటుండగా, శివుడికి వెనుకవైపున ఎడమ భాగంలో లలితాదేవి, కుడివైపున వినాయకుడు దర్శనమిస్తారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీటిలో ఈ ఆలయం మునిగిపోవటం వల్ల నిత్యపూజలు జరగవు. ఏడాదిలో నాలుగు నెలలు మాత్రమే పూజలు జరుగుతాయి. ఆలయంలో నిల్వ ఉన్న నీరు, బురదను శుభ్రం చేస్తున్నారు.ఆలయం వద్దకు భక్తులు వాహనాల్లో చేరుకుంటున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిగా ఆలయంలో ఉన్న నీరు, బురద తొలిగితే సులభంగా సంగమేశ్వరుని దర్శనం చేసుకోవచ్చు.

# పింఛను పక్కా.. అవినీతి ఉండదిక

చీపురుపల్లి : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో అక్రమాలను నియంత్రించేందుకు ఆధునికీకరించిన ఎల్-1 స్కానర్లను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అందించేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే వీటిని ఆయా గ్రామ సచివాలయాల సిబ్బందికి పంపిణీ చేసింది. వచ్చే నెల నుంచి వీటి సాయంతోనే పింఛన్లు అందించనున్నారు.

**ఈ నెల వరకూ ఇలా..**

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్లకు సంబంధించి వేలిముద్రలు పడని లబ్ధిదారులకు ఈ నెల వరకూ ఎల్ జీరో ఆర్డీ పరికరాల సాయంతో పంపిణీ చేసేవారు. ఇది పూర్తిస్థాయిలో ఫలితాన్ని ఇచ్చేది కాదు. లబ్ధిదారులు వేలిముద్రలు వేస్తున్నా ఇబ్బందులు తలెత్తేవి. దీనికి తోడు కొన్ని రాష్ట్రాల్లో నకిలీ వేలిముద్రలు రూపొందించి పింఛన్లు పక్కదోవ పట్టిస్తున్నారన్న ఫిర్యాదులు యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా)కి వెళ్లాయి. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆధునిక ఎల్-1 ఆర్డీ పరికరాలు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది. ఆ మేరకు కూటమి ప్రభుత్వం సచివాలయాలకు అందజేసింది.



**ఏప్రిల్ నుంచి వినియోగం..**

తాజాగా అందజేసిన ఎల్-1 ఆర్డీ పరికరాలతోనే ఏప్రిల్ నుంచి పింఛను అందించనున్నారు. ఆమేరకు యూఐడీఏఐ ఆధార్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునికీకరించింది. దీంతో పాత పరికరాలు పనిచేయవని ఆ సంస్థ ఇప్పటికే స్పష్టం చేసింది. జిల్లాకు వచ్చిన పరికరాల్లో పంపిణీ చేయగా మిగిలినవి అధికారుల వద్ద ఉన్నాయి. ఏ సచివాలయంలోనైనా పరికరం పనిచేయకుంటే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా ప్రణాళిక వేశారు. ఇప్పటికే ఏర్పాట్లు చేశాం

– రోజారాణి, కె.రామచంద్రరావు, గ్రామ సచివాలయాల బాధ్యులు, మన్యం, విజయనగరం జిల్లాలు

కొత్తగా వచ్చిన పరికరాల ద్వారానే వచ్చే నెల నుంచి పింఛన్ల పంపిణీ చేయనున్నాం. ఈ ప్రక్రియ కోసం అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేశాం. ఎక్కడైనా పరికరం పనిచేయకుంటే వెంటనే కొత్తది సమకూర్చుతాం.

ఉమ్మడి జిల్లాలో పింఛనుదారుల సంఖ్య

పార్వతీపురం మన్యం : 1,39,908

విజయనగరం : 2,73,083

# నకిలీ పట్టాలతో మాయ



విశాఖపట్నం: దివ్యాంగుల కాలనీలో విలువైన స్థలాలపై కొందరు కన్నేశారు. ఒకే స్థలానికి రెండు, మూడు నకిలీ పట్టాలు సృష్టించి నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారు. తాజాగా ఓ ముఠా ఈ కాలనీలోని ఖాళీ స్థలాలు రాత్రికిరాత్రే చదును చేసి అమ్మకాలకు బేరం పెడుతోంది. ప్రభుత్వం ఓ లక్ష్యంతో ఏర్పాటు చేసిన దివ్యాంగుల కాలనీలో ఇలా ఇతరులు పెత్తనం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఇళ్లు నిర్మించుకున్న వారిలో అర్హులైన దివ్యాంగులు 25 శాతానికి మించి లేకపోవడం విచిత్రం.దివ్యాంగుల స్థలాలు చేతులు మారడంతో కొందరు రాజకీయ నాయకులు, పోలీసులు పాగా వేశారు. ప్రధాన రోడ్డు వెంబడి విలాసవంతమైన నివాస, భారీ వాణిజ్య సముదాయాలు నిర్మించుకుని అద్దెకిచ్చుకుంటున్నారు.

**అలా రూపొందించె.. అలా రూపొందించె..**

మధురవాడ మిధిలాపురి వుడా కాలనీ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే మార్గంలో దివ్యాంగులకు ఓ కాలనీ ఉంది. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా అర్హులైన 136 మందికి రెండు సెంట్ల చొప్పున గతంలో ప్రభుత్వం పట్టాలిచ్చింది. కాలక్రమేణా చాలా మంది దివ్యాంగులు నివాసాలు నిర్మించక పోవడంతో ఖాళీగా ఉన్న స్థలాలపై అక్రమార్కులు కన్నేశారు. తొలుత గ్రామీణ తహసీల్దార్ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేసిన ఓ వ్యక్తి నకిలీ పట్టాల తయారీకి తెరలేపారు. దివ్యాంగులకు ఇచ్చిన పట్టాల తరహా అవే నెంబర్లు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో నకిలీవి సృష్టించారు.

దివ్యాంగుల కాలనీ ఎదురుగా గెడ్డ స్థలం కబ్జా చేసి ఆక్రమణ ఆరోపణ ఆరోపీశారు... వదిలేశారా?: కాలనీలో జరుగుతున్న నకిలీ పట్టాల వ్యవహారంపై ఇటీవల భీమిలి ఆర్డీఓ సంగీత్‌మాధుర్ పర్యటించి నివేదిక అందించాలని గ్రామీణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు కాలనీలో కొందరితో మాట్లాడి ఆక్రమణలపై ఆరా తీసి వదిలేయడంతోనే ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదీ..**

తయారు చేసిన నకిలీ పట్టాలే అస్త్రాలుగా ఉపయోగిస్తూ, కాలనీలో ఖాళీ స్థలాలను లక్ష్యంగా పెట్టుకుని ఆక్రమిస్తున్నారు. నిజమైన లబ్ధిదారులను సైతం నకిలీ పట్టాలతో భయపెట్టి కాలనీలోకి అడుగు పెట్టకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కబ్జా ముఠా కొన్ని రోజులుగా ఒక్కో స్థలాన్ని చదును చేస్తూ అమ్మకాలు మొదలు పెట్టింది. రెండు సెంట్ల స్థలానికి రూ.15లక్షలకుపైగా ధర నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ స్థలాన్ని విజయసాయిరెడ్డి వెంట తిరిగే ఓ నాయకుడికి విక్రయించగా రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఓ ఎలక్ట్రీషియన్‌కు ఈ కాలనీలో 6 స్థలాలకు ఆరు విద్యుత్తు మీటర్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇదే వార్డులోని వైకాపా నాయకులతో సదరు వ్యక్తి జతకట్టి, ఇప్పుడు అదే నాయకులతో కలిసి పార్టీ మారారు. ప్రస్తుతం కాలనీలో గెడ్డకు సమీపంలో కొండను తొలిచి 10కి పైగా స్థలాలను విక్రయించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు ఆరోపణలున్నాయి.

# వనరులు అపారం.. ప్రణాళికే అవసరం!




నర్సీపట్నం : పునర్విభజన తరవాత అనకాపల్లి జిల్లాలో అటవీ విస్తీర్ణం బాగా తగ్గింది. ఉన్నవి అంతరించకుండా చూడటంతో పాటు పలు ప్రభుత్వశాఖలు ప్రణాళికతో ముందుకు వెళితే హరిత అనకాపల్లి సాకారమవుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్న సమయంలో అడవులు జిల్లా విస్తీర్ణంలో 44 శాతం ఉండేవి. జిల్లాల విభజన అయ్యాక ప్రస్తుతం జిల్లా విస్తీర్ణంలో 24 శాతం మాత్రమే అడవి ఉంది. 4.29 లక్షల హెక్టార్ల విస్తీర్ణం ఉన్న అనకాపల్లి జిల్లాలో అటవీ విస్తీర్ణం 78, 372 హెక్టార్లే. మార్గదర్శకాల ప్రకారం 33 శాతం అడవులు ఉండాలి. సామాజిక అడవుల విభాగం కింద గత సీజన్‌లో జేకే పేపర్‌మిల్లు యాజమాన్యం 48 లక్షల సరుగుడు మొక్కలు రైతులకు అందజేసింది. సామాజిక అడవుల విభాగం కేవలం 16 లక్షల సరుగుడు మొక్కలు మాత్రమే అందజేసింది. ఇవన్నీ కలిపితే ఆరువేల హెక్టార్లలో మాత్రమే పచ్చదనం నింపినట్లయింది. జిల్లాలోని పరిశ్రమల్లో గ్రీన్‌బెల్టు విస్తీర్ణం పెంచడంతోపాటు వినియోగానికి రాని భూమిలో పచ్చదనం పెంచే అవకాశాలు ఉన్నాయి. గతంలో వనసంరక్షణ సమితుల ద్వారా అడవుల పెంపకంలో ప్రజల భాగస్వామ్యం ఉండేది. ఈ సమితులన్నీ గడిచిన దశాబ్దంగా నామమాత్రమయ్యాయి. తక్కువగా ఉన్న అడవుల్లోనూ వేట కారణంగా వన్యప్రాణులు తగ్గిపోతున్నాయి. జిల్లాలో అడవిపందులు, కొండగొర్రెలు, కణుజుల వేట ఆగడం లేదు. జిల్లాలో సామాజిక అటవీ (సోషల్ ఫారెస్ట్) శాఖ ఏర్పాటుచేశారు. దీనిలో నలుగురు రేంజ్, ముగ్గురు సెక్షన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం, రోలుగుంట, చోడవరం, మాడుగుల,, కె. కోటపాడు మండల ప్రాంతాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచుతూ వీటిని అందిస్తున్నారు. గత ఏడాది 60 లక్షల సరుగుడు మొక్కలను రైతులకు అందజేశారు. ఏటా ఎన్‌టీపీసీ సహకారంతో 40వేల మొక్కలు అందజేస్తున్నారు. ఇలా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు మొక్కలు నాటడం... దీనిపై ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నారు. రైతుల పొలాల్లో సరుగుడు, నీలగిరి, జీడి, మామిడి, పామాయిల్ వంటి సాగుని ప్రోత్సహించాలి. నరికివేతకు గురవుతున్న ఉద్యాన పంటలను అంచనా వేసి నాటించే మొక్కలు ఎక్కువగా ఉండేలా చూడాలి. జిల్లాలో 995 ప్రాంతాల్లో చిత్తడి నేలలు ఉన్నట్లు అంచనా. వీటిని పరిశీలించి పచ్చదనం పెంచేలా కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.

నర్సీపట్నం అటవీ రేంజ్‌లోని పెదిమికొండ రక్షిత అటవీ ప్రాంతంలో 97 హెక్టార్ల జీడితోటల స్థానంలో టేకు వనాలు నాటాలని గతంలో ప్రతిపాదించినా అమలు కాలేదు. జీడితోటల వయసు ముదిరిపోయి దిగుబడి తగ్గుతోంది. ఎర్రవరంలోని 22.63 హెక్టార్లలో జీడితోటల ఆదాయం ఇప్పటికే తగ్గిపోయింది. అరిలోవ అడవిలో ఔషధ మొక్కల పెంపకక్షేత్రం స్థానంలో రూ. 2 కోట్ల ఖర్చుతో నగరవనం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి రెండేళ్లయినా కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదు. ఎలమంచిలి సమీపంలోనూ నగర వనం ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది.

**40లక్షల మొక్కలు పెంచుతాం**

రాష్ట్రంలో ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు పెంచి పంపిణీ చేయాలని యోచిస్తున్నాం. ఇప్పటికే చాలా నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. రైతులు కోరుకునే రకాలతోపాటు ప్రభుత్వ శాఖల అవసరాలకు అనుగుణంగా మొక్కలు పెంచుతున్నాం. జి.లక్ష్మణ్, సామాజిక అడవుల డీఎఫ్ఓ

# అక్రమార్కుల చెరలో ఎర్రవంక



బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని గోవిందంపల్లి గ్రామ పంచాయతీలో ఎర్రవంక స్థలాన్ని ఓ భూస్వామి ఆక్రమించి తన భూమిలో కలిపేసుకున్నారు. ఆ స్థలాన్ని చదును చేసి విక్రయించేందుకు పావులు కదుపుతున్నారు. దీని వెనక పెద్ద కథే ఉంది. అదేంటో తెలుసుకుందాం..గోవిందపల్లి గ్రామం పక్కనే కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం సర్వేనంబరు 56లోని దాదాపు 10 ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించింది. దీనిపై తీసుకున్న అప్పును కల్లుగీత కార్మికులు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు భూమిని వేలం వేయగా కల్లుగీత కార్మికసంఘం నాయకుడే రూ.కోట్ల విలువైన భూమిని దక్కించుకున్నాడు.

గోవిందపల్లి గ్రామం పక్కనే అనంతపురం- అమరావతి జాతీయ రహదారి రావడంతో భూమి ధర అమాంతం పెరిగిపోయింది. ఈభూమి పక్కనే తూర్పు వైపున 60 అడుగుల విస్తీర్ణంతో ఎర్రవంక ప్రవహిస్తుంది. ఈ వంక స్థలంపై కన్నేసిన సదరు నాయకుడు దాదాపుగా 2 ఎకరాల ఎర్రవంక స్థలాన్ని తన భూమిలో కలిపేసుకున్నాడు. వంకను 5 అడుగులకు కుదించి మరో మార్గంలో దారి మళ్లించాడు. **వైకాపా హయాంలో దౌర్జన్యకాండ**

ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ నాయకుల అండతో వంకలో దళితుల శ్మశాన వాటికను, రజకులు ఏర్పాటు చేసుకున్న దోబీఘాట్‌ను సైతం నేలమట్టం చేశాడు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడానికి వెనుకాడలేదు. **ఎకరా రూ.50 లక్షల విక్రయానికి బేరం**

కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 ఎకరాలు, ఎర్రవంకకు చెందిన రెండు ఎకరాల స్థలాన్ని మొత్తం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎకరా రూ.50 లక్షలకు విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు నాగరాజుని వివరణ కోరగా గోవిందపల్లిలో ఆక్రమణకు గురైన వంక స్థలాన్ని పరిశీలించి సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. వంకను ఆక్రమించినట్లు రుజువైతే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# హద్దులు గుర్తించి... చిక్కులు పరిష్కరించి

కర్నూలు : భూముల రీసర్వే పేరుతో గత వైకాపా ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. భూ విస్తీర్ణాల్లో తేడాలు రావడంతో కలత చెందారు. సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో పకడ్బందీగా సర్వే చేయడానికి జనవరి 20న శ్రీకారం చుట్టింది. ఇది తుది దశకు చేరింది.. రెండో విడత వచ్చే నెల 15 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. రెండో విడతలో కర్నూలు జిల్లాలో 25 మండలాల్లో 47 గ్రామాలు, నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 56 గ్రామాలను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

**దస్త్రాల స్వచ్ఛీకరణ**

ఎంపిక చేసిన గ్రామాల్లో ముందుగా భూ దస్త్రాల స్వచ్ఛీకరణ చేస్తున్నారు. తర్వాత గ్రామ సరిహద్దులు గుర్తించి 250 ఎకరాలకు ఒక బ్లాక్ ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకుల వారీగా గ్రామ సర్వేయర్లు, వీఆర్వో, రెవెన్యూ సహాయకుల ఆధ్వర్యంలో రీసర్వే చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 53 గ్రామాల్లో 2,17,964.80 ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ సాగుతోంది. గత రెండు నెలల వ్యవధిలో ఇప్పటి



వరకు 1,52,027.37 ఎకరాల్లో జీటీ పూర్తవగా.. మరో 65,936.83 ఎకరాల్లో చేపట్టాల్సి ఉంది. ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని సర్వే అధికారులు చెబుతున్నారు.

**దగ్గర పడుతున్న గడువు**

సర్వే గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తైన తర్వాత గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ తర్వాత 9(2) నోటీసులు జారీ చేస్తారు.రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించడంతోపాటు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు. వచ్చే నెల 10వ తేదీనాటికి ప్రకటన జారీ చేసి చివరిగా డ్రాఫ్ట్ ల్యాండ్ రికార్డు (డీఎల్ఆర్)లో వివరాలు నమోదు చేస్తారు.

ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సరిహద్దు రాళ్లు నాటడం, భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తారు. వచ్చే నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

**వీటిని అధిగమిస్తే**

ఎలాంటి భూ వివాదాలు లేని సర్వే నంబర్లకు రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ త్వరితగతిన పూర్తవుతోంది. విస్తీర్ణంలో తేడాలున్న భూములకు సంబంధించి రైతులతో ఉప తహసీల్దార్లు మాట్లాడాలి. ఇరువురిని ఒప్పించలేకపోతున్నారు.పాత పట్టాదారు పాసు పుస్తకాలు ఉండి.. వెబ్‌ల్యాండ్‌లో పేర్లు లేని రైతుల భూములను సర్వే చేయడం లేదని పలువురు వాపోతున్నారు.

**రోవర్ల కొరత**

ఉమ్మడి జిల్లాలో 53 మండలాల్లో 53 గ్రామాల్లో రీసర్వే ప్రారంభించారు. 200–250 ఎకరాలకు ఒక బ్లాక్ చొప్పున మొత్తం 870 బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 100, నంద్యాల జిల్లాలో 62 రీసర్వే బృందాలను ఏర్పాటు చేశారు.కర్నూలు జిల్లాలో 151 రోవర్లకు 102 మాత్రమే పనిచేస్తుండగా.. నంద్యాలలో 60కి పైగా రోవర్లు వినియోగిస్తున్నారు. ఇవి తగిన సంఖ్యలో లేకపోవడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది.ఒక రోవర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక గ్రామంలో.. అదే రోవర్ ను మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరో గ్రామంలో వినియోగిస్తున్నారు.

# టెండర్లు సరే.. పనులు ఎన్నడో..?

పుత్తూరు : సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు కుంగి నాలుగేళ్లు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. 2021 మే 18న ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగింది. దీని మరమ్మతులు త్వరగా చేపడతామని గత ప్రభుత్వ పాలకులు ప్రగల్భాలు పలికినా అడుగు ముందుకు పడలేదు. మరమ్మతులకు నిధులున్నా పనులు ఎప్పుడు మొదలవుతాయనేది దేవదేవుడికే ఎరుక.పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి రూ.55 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించారు. 2021 మే 18న దీని కట్ట అకస్మాత్తుగా కుంగింది. ట్యాంకు నిర్మించి పదేళ్లు గడిచినా నీరు నింపకపోవడం.. వర్షాలకు ఒకేసారి నింపడంతో 300 మీటర్ల మేర కట్ట కుంగిందని



నిపుణులు బృందం నివేదిక ఇచ్చింది. అప్పట్లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.43 లక్షలతో తాత్కాలిక పనులు చేపట్టి మమ అనిపించారు. వైకాపా హయాంలో కట్ట మరమ్మతులకు రూ.9 కోట్లకు మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక టెండర్లు పిలిచి ఖరారు చేసినా పనులు ప్రారంభం కాలేదు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రజారోగ్యశాఖ డీఈఈ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

చురకలు



# పండ్ల మొక్కల పెంపకంలో భేష్

కళ్యాణదుర్గం : పండ్ల తోటల పెంపకంలో రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉచితంగా పండ్ల మొక్కలు అందించి తోడ్పాటు కల్పించింది. ఈ పథకం కింద పండ్ల మొక్కల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత రైతులు తోటల సాగులో ఆసక్తి చూపడం గమనార్హం. అనంతపురం జిల్లాలో 3,006 మంది రైతులు 9,167.56 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఇందులో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 1,394 మంది రైతులు 4,606.23 ఎకరాల్లో మొక్కలు నాటి ప్రథమ స్థానానికి చేరుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.పండ్ల సాగుకు ఉత్సాహంగా ముందుకొచ్చిన రైతులకు ఎకరాకు మామిడి మొక్కలు 70, చీనీ 110, సపోట 60, డ్రాగన్ ఫ్రూట్స్



మొక్కలు 230, దానిమ్మ 235, పూల మొక్కలు అర ఎకరాకు అందజేశారు. ఈ పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు నెలకు నీటి బిల్లులు రూ.1,526, సంరక్షణకు రూ.2,500 ప్రభుత్వం అందజేయనుంది.

**రైతులకు మరింత ప్రోత్సాహం కల్పిస్తాం: రమేశ్ నాయక్, ఏపీడీ, కళ్యాణదుర్గం** పండ్ల తోటల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనూ ముందంజలో ఉంది. ఇక్కడి రైతులకు పండ్ల మొక్కల సాగుపై అవగాహన కల్పించాం. దాంతో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు అందించాం. రైతులకు బిల్లులు సక్రమంగా అందేవిధంగా చూస్తాం. రోజుల్లో మరింత మంది రైతులకు ప్రోత్సాహం కల్పిస్తాం.

# అక్రమ లేఅవుట్లు.. అదుపులేని ధరలు

పలమనేరు : 'ఆ పక్కా నాదే.. ఈ పక్కా నాదే.. తలపేనా ఆకాశంలోని ముక్కా నాదే.. హే బిడ్డా.. ఇది నా(అక్రమాల) అడ్డా' అన్న ధోరణిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములన్నీ ఆక్రమించేశారు. గత ఐదేళ్లూ అడ్డదిడ్డంగా వ్యవహరించారు. పలమనేరు, గంగవరం మండలాలు రికార్డుల పరంగా వేర్వేరుగా ఉన్నా భౌగోళికంగా కలిసిపోయాయి. ఇక్కడ రియల్ భూమ్ అమాంతం పెరిగినా ప్రభుత్వానికి ఏమాత్రం ఆదాయం రావడం లేదు. అక్రమ లేఅవుట్లకు ఇటు పలమనేరు పురపాలిక నుంచి అటు గంగవరం పంచాయతీ నుంచి అనుమతులు ఉండవు. చెరువు మొరవ, చెరువుకట్ట ప్రాంతాల్లోనూ ఆవాస స్థలాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా పలమనేరు పరిధిలోని బొమ్మదొడ్డి వద్ద ఓ లేఅవుట్‌ను చెరువు మొరవలోనే వేశారు. గంగవరం మొత్తం పలమనేరులో కలవడంతో ఒకప్పుడు ఎకరా రూ.5 లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల ఓ బడా వ్యాపారి బెంగళూరు నుంచి ఇక్కడికొచ్చి భూముల ధరలు విని విస్తుపోయారు. ఇదే ధరకు బెంగళూరు శివారులో కొనుగోలు చేయొచ్చంటూ వెళ్లిపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. వైకాపా హయాంలో రియల్టర్లు తమకిష్టమొచ్చినట్లు వ్యవహరించగా అధికారులు వారికే అంటకాగారు.

**36 లేఅవుట్లపై ఆంక్షలు విధించాం**

36 లేఅవుట్లకు నోటీసులిచ్చి బ్లాక్‌లిస్టులో పెట్టాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వ్యవసాయ భూమి మార్పిడికి భూమి విలువలో 5 శాతం రుసుం చెల్లించాలి. నిబంధనలకు అనుగుణంగా వసతులు, 30 అడుగుల రోడ్డు ఉంటే అనుమతులిస్తాం. లేకపోతే బ్లాక్‌లిస్టులో ఉంచి పనులు ఆపేస్తాం. ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు

# భారం మోయలేం

పుత్తూరు : భూముల రిజిస్ట్రేషన్ దస్తావేజులకు ఆన్‌లైన్‌లో స్టాంపులు జారీ చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన విధానం అమలులోకి తెచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి స్టాంపులు జారీ చేయటంతోపాటు ఆన్‌లైన్‌లో వెండర్లే స్వయంగా కొనుగోలుదారుల వివరాలు నమోదుచేసి విక్రయించాల్సి ఉంటుంది. **వివరాల కోసమే..** ఇప్పటివరకు స్టాంప్ వెండర్లు కొనుగోలుదారులు కోరిన స్టాంపుల మేరకు దరఖాస్తు రాసి చలానా చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్టాంపులు పొందేవారు. అలా పొందిన వాటిని కొనుగోలుదారుల పేర్లతో రిజిస్టర్లలో నమోదుచేసి విక్రయించేవారు. అనంతరం వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారానికోసారి తనిఖీ చేసేవారు. అయితే ఈ దరఖాస్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భద్రపరచటం కష్టంగా మారుతోందని ఉన్నతాధికారులు భావించారు. దరఖాస్తుపోతే ఆ స్టాంప్ ఎవరు కొనుగోలు చేశారన్న వివరాలు లభించనందున ఆన్‌లైన్‌లో వెండర్లే స్టాంపులు జారీచేసే విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మాన్యువల్‌గా వెండర్లు వీటిని జారీ చేస్తుండగా భవిష్యత్తులో ఆన్‌లైన్ చేయనున్నారు. **అదనపు భారం..** నూతన విధానం ప్రకారం స్టాంపులు విక్రయించాలంటే వెండర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం లైసెన్సు ఉన్నవారిలో 70 శాతం మందికి లేవు. స్టాంపు కోసం ఎవరైనా వస్తే ముందుగా ఐజీఆర్ఎస్ సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఆధార్ నంబరు నమోదు చేయగానే వాళ్ల ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసి కావాల్సిన విలువగల స్టాంప్‌ను వెండరే ముద్రించి విక్రయించి రుసుం తీసుకోవాలి. ఒక్కోసారి సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుంది. ఇది అటు కొనుగోలుదారులకు, ఇటు స్టాంప్ వెండర్‌కు ఇబ్బందికరమేనని.. మారిన నిబంధనతో గది అద్దెకు తీసుకుని కంప్యూటర్, ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవడంతో అదనపు భారం పడుతుందని చెబుతున్నారు. **నూతన విధానంతో పారదర్శకత..**పారదర్శకత కోసమే ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు. కొనుగోలుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటాయి. అందరూ నూతన విధానంలోకి మారాల్సిందే. శ్రీరామ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖాధికారి, తిరుపతి

# మోసం కనిపెట్టు.. అక్రమార్కుల పనిపట్టు



అనంతపురం : కొన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొత్త తరహాలో వాహనదారులను మోసగిస్తున్నారు. ఫిల్లింగ్ యంత్రాల్లో చిప్‌లు అమర్చి.. రీడింగ్ మీటర్‌పై చూపిన దానికంటే 10 శాతం తక్కువ ఇంధనం పడుతున్న ఉదంతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో కలకలం రేగింది. అనుమానం వచ్చి పరీక్షించినా ఎక్కడా దొరక్కుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మరోవైపు వాహనదారులు అవగాహన, అప్రమత్తతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. జంప్ ట్రిక్: మీటరు జీరోపై ఉన్నంత మాత్రం మోసం జరగదని భావించవద్దు. కొన్ని పెట్రోల్ బంకుల్లో జంప్ ట్రిక్ వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా మీటర్ జంప్ రూ.4–5 మధ్యలో ఉండాలి. కొన్నింటిలో ఇంధనం నింపడం ప్రారంభించగానే ఒకేసారి రూ.10 నుంచి మొదలవుతుంది. డీజిల్ విషయంలో ఇది రూ.20 దాటిపోతుంది. రీడింగ్‌లో వేగం అసాధారణంగా ఉంటే ప్రశ్నించాలి.

**ఇంధన సాంద్రత**

సాంద్రతపై ఇంధన నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఫిల్లింగ్ యంత్రంపై సాంద్రత(డెన్సిటీ)కి సంబంధించి మీటర్‌లో ప్రత్యేక విభాగం ఉంటుంది. పెట్రోల్ అయితే డెన్సిటీ 710–770 మధ్య, డీజిల్ 820–860 మధ్యలో ఉండాలి. కొన్ని బంకుల్లో మీటర్లను సైతం ట్యాంపర్ చేస్తున్నారు. ఇంధనం పట్టేటప్పుడు పైపులో నుంచి వచ్చే ధారను గమనించాలి. అది వేగంగా ఉంటే అనుమానించాల్సిందే.. సున్నా చేస్తేనే..

మనకంటే ముందు ఉన్న వాహనదారు రూ.100 పెట్రోల్ కొట్టించారు. తర్వాత మనం రూ.300 పోయమని అడిగితే... బంకు సిబ్బంది మీటర్‌ను జీరో చేయకుండా అలాగే పడితే రూ.200 పెట్రోల్ మాత్రమే వస్తుంది. అందుకే పంపు మీటరును జీరో (సున్నా) చేశాడో... లేదో కచ్చితంగా గమనించాలి.

**ఫిర్యాదు చేయండిలా..**

పెట్రోల్ బంకుల్లో మోసం జరిగినట్లు గుర్తిస్తే అక్కడే ఫిర్యాదుల పుస్తకంలో నమోదు చేయాలి. ప్రతి పెట్రోల్ బంకులో విధిగా ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి. ప్రతి ఆయిల్ కంపెనీ ఆడిట్ సమయంలో వాటిని సమీక్షిస్తుంది. ఒకవేళ ఫిర్యాదుల పుస్తకం ఇవ్వడానికి నిర్వాహకులు ఒప్పుకోకపోతే ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదును నమోదు చేయవచ్చు. తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ నంబరు 98490 95707కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

**ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..**

పెట్రోల్ బంకులు: 332

రోజువారీ పెట్రోల్ వినియోగం: 4.06 లక్షల లీటర్లు

డీజిల్ వినియోగం: 5.65 లక్షల లీటర్లు

గప్‘చిప్’గా దోపిడీ

**అనంతపురంలో ఫిల్లింగ్ యంత్రం ట్యాంపరింగ్**

ధనార్జనే ధ్యేయంగా పెట్రోల్ బంకుల నిర్వాహకులు మోసాలకు బరితెగిస్తున్నారు. విజిలెన్స్ దాడుల్లో ఈ వ్యవహారం బట్టబయలైంది. అనంతపురం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ నేతృత్వంలోని బృందం సాయంత్రం సోములదొడ్డిలోని విజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంకులో తనిఖీలు చేశారు. చిప్ అమర్చి ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఫిల్లింగ్ యంత్రంపై రీడింగ్ చూస్తే అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. వాహనంలో పట్టే ఇంధనంలో మాత్రం తేడా ఉంటోంది.

వాహనదారులకు అనుమానం వచ్చి పరీక్షించినా దొరక్కుండా ఉండేలా.. ఫిల్లింగ్ యంత్రంపై ప్రత్యేక బటన్ నొక్కినప్పుడే లోపలి చిప్ పని చేసేలా డిజైన్ చేశారు.

ప్రతి ఫిల్లింగ్ యంత్రం మదర్‌బోర్డులో పెట్రోల్ రీడింగ్ సెట్ చేసే చిప్ ఉంటుంది. అసలు చిప్‌కు బదులుగా తమకు అనుకూలమైన నకిలీది అమర్చారు. దీనిద్వారా యంత్రంపై చూపించే రీడింగ్‌కు.. వాహనంలో పట్టే ఇంధనానికి 10 శాతం తేడా ఉంటోంది. లీటరుకు 100 మిల్లీ లీటర్లు చొప్పున ఆదా చేసుకుంటున్నారు. పెట్రోల్ బంకుకు వచ్చే భారీ వాహనాలు, కార్లను లక్ష్యంగా చేసుకుని మోసానికి తెగపడుతున్నట్లు విజిలెన్స్ అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది.

**హైదరాబాద్‌లో తయారీ!**

ఒక ఫిల్లింగ్ యంత్రానికి సంబంధించి రీడింగ్‌ను పరిశీలించగా ఏడాదిలో 28,07,981 లీటర్ల డీజిల్ పట్టినట్లు తేలింది. ఈ లెక్కన 2,80,798 లీటర్ల డీజిల్‌ను ఆదా చేసుకున్నారు. ప్రస్తుత ధర ప్రకారం లీటరుకు రూ.99 చొప్పున ఏడాదిలో రూ.2.77 కోట్ల మేర నిర్వాహకులు మోసానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన కొందరు ఈ తరహా నకిలీ చిప్‌లను తయారు చేసి ఒక్కొక్కటీ రూ.2 లక్షల చొప్పున బంకు నిర్వాహకులకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# యోగాలో శిల్పా'రాణి'



హిందూపురం : అదో మారుమూల గ్రామం.. హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరు.. అక్కడ ప్రభుత్వం జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఏర్పాటు చేసింది. ఆయుర్వేద వైద్యశాల, పంచకర్మ వైద్యసేవలు అందిస్తూ వ్యాధి బాధితులకు యోగా థెరపీ, యోగాపై ఉచిత శిక్ష ఇస్తున్నారు. కేంద్రంలో వైద్యురాలు అనురాధ పంచకర్మ వైద్య సేవలు అందిస్తుండగా కె.ఎస్.శిల్పారాణి అనే యువతి యోగాలో ఉన్నత విద్య అభ్యసిస్తూనే వ్యాధి బాధితులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు.ఆసక్తితో యోగాలో వైఐసీ, క్యూసీఐ విద్యను అభ్యసించి ప్రస్తుతం యోగాలో ఎస్‌వీవైఏఎస్ఎం విశ్వవిద్యాలయం బెంగళూరులో ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈమె ప్రతి రోజు చికిత్సలకు వచ్చేవారికి, స్థానికులకు ఉచితంగా యోగాథెరపీ, యోగాసనాలు అభ్యసనం చేయిస్తున్నారు. దీనివలన వారికి ఉపశమనం కలుగుతుండటంతో నిత్యం ఈ ఆసనాలు వేయటానికి యువకులు, పండుటాకులు ముందుకొచ్చి కేంద్రంలో ఆసక్తిగా యోగాసనాలు వేస్తున్నారు. ఇంట్లో కూడా ఏకాంతంగా మెడిటేషన్, క్లిప్ థెరపీ, ప్రాణయామ, సూర్యనమస్కారాలు చేసుకొనేలా అభ్యసం చేయిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. **విదేశీయులకు సైతం..**ఉదయం, సాయంత్రం వేళల్లో అంతర్జాలంలో యోగాసనాలపై దేశ, ఇతర దేశాలకు చెందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. దీంతోపాటు ఈ యెగా పోటీల్లో పాల్గొని పురస్కారాలు సొంతం చేసుకొంటోంది. ఇటీవల పుట్టపర్తిలో నిర్వహించిన యోగా పోటీలో ప్రథమ స్థానం, రాష్ట్రస్థాయిలో తొమ్మిదోస్థానం సొంతం చేసుకున్నారు. యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారు దీని ద్వారా లబ్ధిపొంది ఆరోగ్యంగా ఉండాలన్నదే తన ధ్యేయం అంటున్నారు శిల్పారాణి.

# దిగువ కాల్వ.. రైతుల దిగులు తీరింది

ఎమ్మిగనూరు : పశ్చిమ ప్రాంతానికి జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ. మూడేళ్లలో ఎల్లెల్సీకి నీరు రాక చివరి ఆయకట్టు రైతులు నష్టపోయారు. అప్పట్లో చేయి తడిపితే తప్ప చేను తడిచేది కాదు, కూటమి సర్కార్ రాకతో ఎల్లెల్సీలో సాగునీరు నిండుకుండలా పారుతోంది. గత వైకాపా ప్రభుత్వం సరిగా స్పందించకపోవడంతో రావాల్సిన నీటి వాటా పూర్తిగా తగ్గిపోయింది. విడుదల చేసిన నీటిని సైతం కాసులకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

**మార్చి 31 వరకు నీటి సరఫరా**

రబీ కింద 1.07 లక్షల ఎకరాలకు సాగునీరందించాలి. వర్షాలు, బోర్ల కింద ఉన్న ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం ఇప్పటికే దాదాపు 60 వేల ఎకరాలకుపైగా వివిధ పంటలు సాగు చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కర్నూలు డివిజన్ పరిధిలో రబీ కింద సుమారు మిరప 24 వేలు, పత్తి 16 వేలు, ఇతర 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. మార్చి 31 వరకు సాగునీరు అందిస్తామని ఇటీవల ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

“నేను బీటెక్ చదువుతున్నా. మాకు మూడెకరాల పొలం ఉంది. మా అమ్మానాన్నలకు ఆసరా ఉండేందుకు వ్యవసాయం చేస్తున్నా. మిరప సాగు చేశాం. ఎకరానికి 19 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎల్లెల్సీలో నీరు సమృద్ధిగా ఉండటంతో మరో రెండు కోతలు వస్తాయని” పార్లపల్లికి చెందిన జగదీశ్ సంతోషం వ్యక్తం చేశారు.

**చేనుకు చేరుతున్న నీరు**



ఈరన్న, కలుగట్ల, ఆయకట్టు రైతు

నాకు ఎల్లెల్సీ కింద మూడెకరాల పొలం ఉంది. మూడేళ్లుగా పంట చేతికందే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. ప్రతి ఏడాది దాదాపు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నష్టపోయాను. ఈ ఏడాది కాల్వల నిండా నీరు పారుతోంది. పైసా ఖర్చు లేకుండా పొలంలోకి నీరు చేరుతోంది. ఏటా రావాల్సిన నీటి వాటా : 24 టీఎంసీలునీటి విడుదల సమయం : అక్టోబరు 16 నుంచి మార్చి నెలాఖరు వరకు చివరి ఆయకట్టుకు నీళ్లు రాక ఐదేళ్లలో నష్టపోయింది : సుమారు రూ.150 కోట్లకుపైగా 2025 ఫిబ్రవరి 18 నాటికి జలాశయం సామర్థ్యం 50 టీంఎసీలు ఎమ్మిగనూరుకు చేరుకుంటున్న నీరు 375 క్యూసెక్కులు

# ఉక్కు విశ్రాంత ఉద్యోగులపై పిడుగుపాటు

విశాఖపట్నం: విశాఖ స్టీలు ప్లాంటు యాజమాన్య నిర్ణయాలు విశ్రాంత ఉద్యోగుల్లో కలవరం రేపుతున్నాయి. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) ‘మెడికల్ స్కీం’లో భారీ కోతలకు ప్రతిపాదనలు చేసింది. ఆమోదం దీనిపై త్వరలో నిర్ణయం వెలువడ నుంది.

**ప్రస్తుత విధానం ఇదీ:** విశ్రాంత ఉద్యోగులకు గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీం (జీఎంఎస్) అందిస్తున్నారు. ఈ పథకంలో దంపతులకు రూ.6 లక్షల వరకూ వైద్య బీమా అందుతుంది. దంపతులిద్దరూ రూ.2,600 ఏటా చెల్లించాలి. మిగిలిన నగదు ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం భరిస్తుంది. దీంతోపాటు ఏటా ఓపీడీ (అవుట్ సైడ్ పర్చేజ్ రీయింబర్స్‌మెంట్) ఇద్దరికి రూ.16వేలు ఇస్తారు. ఆర్ఐఎన్ఎల్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుంటే ఉచితం. బయట ఎక్కడ పరీక్షలు చేయించుకున్నా, మందులు కొనుగోలు చేసినా ఓపీడీ నగదు రీయింబర్స్‌మెంట్ చేస్తారు.

ఉద్యోగులే 30 శాతం చెల్లించాలని: పాలసీ సంస్థలకు చెల్లించాల్సిన నగదులో ఇకపై విశ్రాంత ఉద్యోగులు 30 శాతం కట్టాలని, కంపెనీ 70 శాతం చెల్లిస్తుందని తాజాగా ప్రతిపాదన చేశారు. ఓపీడీ సదుపాయం రూ.16 వేలలోనూ సగానికి కోత పెట్టారు. ఇప్పటి వరకు దాదాపు 10 వేల మందికి బీమా నిమిత్తం ఏటా రూ.30 కోట్లు కడుతున్నారు. ఇకపై 30 శాతం... సుమారు సుమారు రూ.9 కోట్లు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు భరించాల్సి ఉంటుంది.



2015–17లో పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులకు నెలకు రూ.1200–1500 పింఛను వస్తుంది. వైద్య బీమాకు కంపెనీలు కోట్ చేసిన ప్రకారం భార్య, భర్తలకు కలిపి ఏటా రూ.18–20 వేలు కట్టాల్సి వస్తే వాళ్లు ఎలా బతకాలి? అంటూ కార్మిక, ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. విశ్రాంత ఉద్యోగుల్లో నిర్వాసిత కుటుంబాల సభ్యులే ఎక్కువ మంది. ‘ఉక్కు’కు భూమి ఇచ్చినా కనీస ఆరోగ్య భద్రత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


**భద్రతా సిబ్బంది తగ్గింపు**

విశాఖ స్టీలు ప్లాంటులో భద్రతా సిబ్బందిని తాజాగా మళ్లీ తగ్గించారు. ప్రధాన గేటు వద్ద ఉండే సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని 22వ తేదీ నుంచి తగ్గిస్తున్నట్లు సీజీఎం (వర్క్స్)కు సీనియర్ కమాండెంట్ లేఖ రాశారు. సాధారణ షిఫ్టుల్లో లోపలికి, బయటకు వచ్చే సమయంలో వాహనాల తనిఖీలు చేసే సిబ్బందిని కుదించనున్నారు. దీంతో 10–12 మంది ఉండే సీఐఎస్ఎఫ్ సిబ్బంది నలుగురైదుగురు మాత్రమే పనిచేయనున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉండే సిబ్బందికి ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు సహకరించాలని పేర్కొన్నారు. సాధారణంగా ప్రధాన గేటు నుంచి ఉద్యోగులు, కార్మికులు 15 నిమిషాల్లో తనిఖీలు పూర్తయి బయటకు వస్తారు. భద్రత సిబ్బంది తగ్గింపుతో మరింత జాప్యమయ్యే అవకాశాలున్నాయి. అలాగే ప్లాంటు భద్రతపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

# వ్యాధి నిర్ధారణలో మరింత కచ్చితత్వం

నర్సీపట్నం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్‌రేకు ఏళ్ల తరబడి పాత యంత్రాలే వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఆధునిక ఎక్స్‌రేలను అమర్చాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో జిల్లాల్లోని ఆసుపత్రుల్లో 300 మెగా యాంప్స్ సామర్థ్యంతో కూడిన ఎక్స్‌రే యంత్రాల ఏర్పాటుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు వినియోగిస్తున్న పాత వాటితో నివేదికలకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తోంది. కొత్తవి కేవలం 15 నిముషాల్లోనే ఫలితాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఇవి రోగాన్ని, లోపాన్ని ఎంతో నిశితంగా గుర్తించి నివేదికలు ఇస్తాయని చెబుతున్నారు. దీని వల్ల రోగాలను త్వరితగతిన నయం చేసేందుకు వీలుంటుంది. న్యూమోనియా, మూత్రపిండాల్లో రాళ్లు, గుండె సంబంధిత సమస్యలు వీటితో స్పష్టంగా గుర్తించవచ్చని అంటున్నారు. వీటికోసం ప్రైవేటు కేంద్రాల్లో రూ. 1800 వరకు వెచ్చించాల్సి వస్తోంది. వీటి సేవలను ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే పొందవచ్చు.

కొత్త యంత్రాల కిరణాలు తీవ్రత మరింత అధికంగా ఉంటుందని చెబుతున్నారు. దీని రేడియేషన్ ప్రభావం హానికరం కావడంతో ఆసుపత్రుల్లోని ఎక్స్‌రే గదుల్లో గాలి సైతం ప్రవేశించని విధంగా వాటిని కట్టుదిట్టం చేసే పనులు ఇప్పటికే చేపట్టారు. ముఖ్యంగా వీటికి లెడ్ తలుపులను ఏర్పాటు చేసి రోగి ఒక్కరు మాత్రమే లోపల ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాల్లో అనకాపల్లి, నర్సీపట్నం ప్రభుత్వ వైద్యాలయాలు,



ఎలమంచిలి, నక్కపల్లి, కోటపాడు, అగనంపూడి ఆసుపత్రులలో కొత్తవి సమకూరనున్నాయి. ఒక్కోదాని ఖరీదు రూ. 18 లక్షల వరకు ఉంటుంది. వీటిని గదుల్లో బిగించడానికి ముందుగా పూర్తి చేయాల్సిన పనులను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్లు చేపడుతున్నారు.నర్సీపట్నంలో ముందస్తు పనులు పూర్తి: ఆధునిక ఎక్స్‌రే మిషన్లు అమర్చడానికి ముందుగా చేపట్టాల్సిన పనులను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రులో పూర్తి చేశాం. వీటికి రూ.రెండు న్నర లక్షలు ఖర్చు అయింది. ఎలమంచిలి, కె.కోటపాడుల్లోనూ ఈ పనులు ముగిశాయి. ఇక్కడ త్వరలోనే యంత్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.నాయుడు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ

అత్యుత్తమంగా ఎక్స్‌రే సేవలు: ఆధునిక ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటైతే రోగులకు మరింత అత్యుత్తమ సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో వెన్నుపూసలోని సమస్యలు, లోపాలను సైతం సులువుగా ఎంతో స్పష్టంగా గుర్తించే వెసులుబాటు ఉంది. అన్ని ఆసుపత్రుల్లో లెడ్ తలుపుల ఏర్పాటు పనులు పూర్తయిన తరవాత వీటిని అమర్చనున్నారు.

శ్రీనివాస్, జిల్లా వైద్య విధాన పరిషత్తు సమన్వయకర్త

# కొల్లేరులో కృత్రిమ సాగు

కైకలూరు : నిత్యం పక్షుల కిలకిలరావాలతో సందడిగాఉండే కొల్లేరులో సంప్రదాయం ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కి కృత్రిమ సాగుకు తెర తీస్తున్నారు. కొల్లేరు కాంటూర్ పరిధిలో 2006 ఆపరేషన్‌లో కొట్టేసిన భూముల్లో జీరో సైజు చేపపిల్లల సాగు చేస్తున్నారు. పక్షుల ఆవాసాలకు, ఆహార సేకరణకు విఘాతం కలిగించేలా చర్యలు చేపడుతున్నా పట్టించుకున్న నాథుడే కనిపించడం లేదు. కొట్టేసిన చెరువుల్లో గట్లు వేసి వాటిలో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. హాని కారకమైన రసాయనాలతో పాటు తవుడు, ఇతర మేత అందిస్తున్నారు. కొల్లేరులో మేత కర్రలు పెట్టి, పడవలపై మేతలు వేసుకుని మూటలు కడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమాలకు అడ్డు లేకుండా పోతోంది.

**సాగు ఇలా..** కైకలూరు మండలంలోని చెటాకాయ్‌లో 400 ఎకరాలు, నత్తగుల్లపాడు 200, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప 250, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోటలో 200, శృంగవరప్పాడు 400, గుమ్మళ్లపాడు 200 ఎకరాల్లో, మండవల్లి మండలంలోని కొవ్వాడలంకలో 250, చింతపాడులో 300, పులపర్రులో 250, నుచ్చుమిల్లి 150, తక్కెళ్లపాడులో 150, పెనుమాకలంకలో 200, నందిగామలం



కలో 250 ఎకరాల్లో కృత్రిమ సాగు చేస్తున్నారు.

**విలవిల్లాడుతున్న పక్షులు, పశువులు..**

కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న పక్షులకు, పశువులకు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. కొల్లేరులో ఉప్పు నీరు పెరిగిపోవడంతో చేపలు మృత్యువాత పడటంతోపాటు వృద్ధి తగ్గి పోతోంది. దీంతో ఖండాలు దాటి సంతానోత్పత్తికి వస్తున్న పక్షులు అర్ధాంతరంగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విషతుల్యంగా మారిన నీటిలో పక్షులకు పూర్తి స్థాయిలో ఆహారం లభించక పోవడంతో అర్ధాకలితో బక్కచిక్కి పోతున్నాయి.

**జీవో 120కి విఘాతం**

జీవో 120 ప్రకారం కొల్లేరు పరివాహక ప్రాంతంలో కృత్రిమ సాగు చేయడం, భారీ యంత్రాలతో తవ్వకాలు, శబ్దాలు చేసే ఇంజిన్ల ఏర్పాటు నిషిద్ధం. కానీ మండవల్లి, కైకలూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో కొల్లేరు మధ్యలో ఆయిల్ ఇంజిన్లు పెట్టి కొట్టేసిన చెరువుల్లో నీటిని బయటకు తోడుతున్నారు. ఆయా చెరువుల వద్దకు వస్తున్న పక్షులను బెదిరిస్తూ చేపల సాగు చేస్తున్నారు. దీనిపై అటవీ రేంజర్ రామలింగాచార్యులును వివరణ కోరగా నిఘాను పెంచి కొల్లేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎఫ్‌వో విజయను సంప్రదించగా అక్రమసాగును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జడ్పీలో 'లెక్క'లేనంత నిర్లక్ష్యం!

ఒంగోలు : ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం.. ప్రతి పైసాకు లెక్కలు చూపడం అధికారుల విధి. వైకాపా ప్రభుత్వంలో ఓ అధికారి ఈ విషయాన్ని విస్మరించారు. 'జాలి' గుండెతో నిధులు మళ్లించారు. నిబంధనలకు నీళ్లొదిలి ముందస్తు చెల్లింపులు చేశారు. అకారణంగా ఖర్చవుతున్నా చూస్తుండిపోయారు. తామెవరికీ ఏం చెప్పాల్సింది లేదంటూ 'లెక్క'లేనితనం ప్రదర్శించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులు వెలుగు చూస్తున్నాయి. అప్పటి అధికారులేమో బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన వారేమో చర్యలు తీసుకోకుండా 'చిరు'నవ్వులే సమాధానంగా అనిపిస్తు న్నారు.

**ఏం పనులు చేశారో తెలియదు:** బీపీసీఎల్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం ఓడరేవుకు మల్టీ ప్రొడక్ట్ పెట్రోలియం పైపులైన్ నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం చేపట్టారు. తవ్విన రహదారుల పూడ్చివేతకు సెక్యూరిటీ డిపాజిట్ కింద 2021లో జడ్పీ ఖాతాకు రూ.52 లక్షలు అందించారు. 2022లో అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి వీటిని ఖర్చు పెట్టారు. ఆ నిధులతో ఏం పనులు చేశారని తెలిపే దస్త్రాలు లేవు. లెక్కలు చెప్పలేదు. అధికారులు మాత్రం అప్పటి జడ్పీ సీఈవో బదిలీపై వెళ్లారని, లేఖ రాశామంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

**బిల్లులు సమర్పించింది లేదు:** జడ్పీ జీపీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.2.81 కోట్లను వివిధ పనుల పేరిట పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు రెండేళ్ల క్రితం ముందుగానే చెల్లించారు. నిబంధనలు పాటించలేదు. ఇంజినీరింగ్ అధికారులేమో ఆ నిధులను ఏ పనులకు వెచ్చించారు.. ఎంబీ రికార్డులు, బిల్లులను జడ్పీ అధికారులకు సమర్పించలేదు. నిధుల ఖర్చు, పనుల వివరాలు, నోట్‌కామ్ చిత్రాలు, ఎవరికి, ఎప్పుడు డబ్బు చెల్లించారు, ప్రస్తుత పని స్థితిపై నివేదిక ఇవ్వాలని జడ్పీ సీఈవోనే గత నెల 31న పీఆర్ ఈఈకి లేఖ రాశారు. నేటికీ సమాధానం లేదు.

**ఇష్టారీతిన విధులు:** ఫారిన్ సర్వీస్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు ఇతర శాఖలో పనిచేస్తుంటారు. ఇందుకు జడ్పీ సీఈవో, తర్వాత కమిషనర్ అనుమతి అవసరం. అయిదేళ్ల అనంతరం తిరిగొచ్చి ఆరు నెలలు పూర్వస్థానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు అమలు కావడం లేదు. సుమారు 15 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలు, సూపరింటెండెంట్లు, టైపిస్టులు ఫారిన్ సర్వీసులో భాగంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు, డ్వామా, మెప్మా, మైనార్టీ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్లు దాటినా వారూ ఉన్నారు. అయినా చర్యలు లేవు.

**రెండుసార్లు రుణం చెల్లింపు:** రెండేళ్ల కిందట సుమారు పది మంది వరకు జీపీఎఫ్ రుణం తీసుకున్నారు. వీరికి రూ.99.50 లక్షలను రెండుసార్లు చెల్లించారు. ఇందులో ముగ్గురు ఉద్యోగుల పాత్ర ఉంది. తప్పును ఆలస్యంగా తెలుసుకొని.. పది మందిని బతిమిలాడుకొని మళ్లీ రాబట్టారు. ఆ మొత్తానికి జడ్పీ రెండు నెలలపాటు వడ్డీ కోల్పోవాల్సి వచ్చింది. ఏడాది కిందట ఈఎల్(యర్న్ లీవ్స్) పేరిట రూ.1.80 లక్షలను రెండు సార్లు చెల్లించారు. నేటికీ విషయం తెలియదు. ఇటీవల సీఎఫ్ఎంఎస్ అధికారులు గుర్తించి లేఖ ఇచ్చారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం:** చిరంజీవి, జడ్పీ సీఈవో

బీపీసీఎల్ నిధులు రూ.52 లక్షలకు సంబంధించి గత జడ్పీ సీఈవో నుంచి బిల్లులు ఇంకా అందలేదు. వచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. పీఆర్ ఈఈకి ఇచ్చిన ముందస్తు చెల్లింపుల నివేదికపై మరోసారి నివేదిక కోరుతాం. ఫారిన్ సర్వీసు అధికారుల వివరాలు తెలుసుకుని వెనక్కి రప్పిస్తాం. గతంలో సాంకేతిక తప్పిదంతో రెండుసార్లు బిల్లులు చెల్లించడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# మాతృభాష.. అమ్మ జోల పాట




కళ్యాణదుర్గం : మన పలుకులోనే మాతృభాష ఉనికి బతికుంటుంది. అమ్మ భాషను కాపాడుకోవడం అందరి బాధ్యత. శిశువు ఊయలలో ఊగుతూనే ఊకొడుతూ భాషా పరిజ్ఞానాన్ని సంపాదిస్తాడు. అంత గొప్పతనం అక్కడి నుంచే మొదలవుతుంది. కొందరు అమ్మభాషలో రచనలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం. కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాఘవేంద్ర యువకవిగా రాణిస్తున్నారు. కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర మాతృభాషపై ఉన్న మక్కువతో అనేక రచనలు చేశారు. పిల్లల్లో మాతృభాషకు పునాదులు వేయాలని బాలనేస్తం పత్రికను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా రాసిన 'చినుకుల తోట', 'మట్టితీగ' తదితర కవితా సంకలనాలు వెలువరించారు. సామాజిక అంశాలను తీసుకుని కవితలు రాశారు. ఆయన కవితల్లో ఈతకల్లు కార్మికుడు, పాకీడు, చర్మకారుడు, ఇంటి పనిమనిషి, నిరుద్యోగి, ఇవాళ నా పల్లె, అదృశ్య శక్తులు దాచుకునే ఓ ప్రయోగశాల, రైతు శిథిలమైన ఒక చరిత్ర వంటి కవితలు రాసి మన్ననలు పొందారు. 'కల్లంచుల బువ్వ', 'దీర్ఘకవిత' సంపుటికలకు రావి రంగారావు సాహిత్య పీఠం జనరసంజక కవిత ప్రతిభా పురస్కారం, కందికొండ రామస్వామి సాహిత్య పురస్కారం, మల్లవరపు రాజేశ్వరరావు, స్పందన సాహిత్య సాహిత్య పురస్కారాలు అందుకున్నారు.

**జన పదాలతో పదిలం..**

నల్లమాడ మండలం పాతబత్తలపల్లిలో తెలుగు ఉపాధ్యాయుడు ఓబుళపతి అమ్మభాష సేవలో తరిస్తున్నారు. రాయల సీమ రైతు, అమ్మ, అక్షర సంస్కారి గురువు, ఉగాది తెలుగు సంప్రదాయం, ఓటు విలువ వంటి కవితలను రాశారు. అమ్మభాష పరిరక్షణకు జన పదాలను నిరంతరం వాడుకలో ఉండేలా కృషిచేస్తున్నారు.

**పిల్లల్లో ఆసక్తిని రేకెత్తిస్తూ..**

మెట్లు- మెటుకులు, చెప్పులు-మెట్లు లాంటి పదాలెన్నో ఉన్నాయని, వీటిపై పిల్లలకు 'పుస్తక పదాలు- మన పదాలు' అంశంతో పోటీలు పెట్టి బహుమతులు ప్రదానం చేస్తున్నారు. కథలు పోటీలు, భాషా క్రీడలు, పద చాతుర్యంతో రాయించటం వంటి సాధనలతో పిల్లల్లో ఆసక్తిని పెంచుతున్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పురం




హిందూపురం : హిందూపురం పట్టణంలో రూపాయి అభివృద్ధి పని చేయాలన్నా పాలకులు, అధికారులు జంకుతున్నారు. పని చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కారణం మున్సిపాలిటీ వద్ద నిధులు లేకనే.. దీనికి తోడుగా రూ.150 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పట్టణాలు అభివృద్ధి చెందాలంటే, పురపాలక సంఘాల వద్ద నిధులు తప్పనిసరి. నిధులు సమకూరాలంటే ఆదాయ వనరులు పెంచుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెచ్చుకోవాలి. అయితే గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదు. వసూలయ్యే పన్నులు పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలకు, విద్యుత్తు ఛార్జీలు, నీటి సరఫరా పథకాల నిర్వహణకు సరిపోవడం లేదు. వివిధ మున్సిపాలిటీలకన్నా హిందూపురానిది అన్ని విషయాల్లోనూ ప్రత్యేకమే. గత 30 ఏళ్లుగా పట్టణంలో తాగునీటి సమస్య జటిలంగా మారింది. సమస్యను తీర్చడానికి అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పీఏబీఆర్ నుంచి రూ.620 కోట్లు వెచ్చించి పైపులైన్ నిర్మించింది. నిర్వహణ సరిగా లేకపోవడం, పనుల్లో నాణ్యతాలోపం కారణంగా పట్టణానికి సగటున 5 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేసింది. దీంతో ప్రయోజనం లేదని గుర్తించి, దానిని పక్కన పెట్టి, 2018లో రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి తాగునీటిని తీసుకొచ్చే పథకాన్ని నిర్మించారు. ఈ రెండు పథకాలు మున్సిపాలిటీపై అంతులేని భారాన్ని మోపాయి. పీఏబీఆర్ నుంచి గతంలో చేసిన నీటి సరఫరాకు రూ.38.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. గొల్లపల్లి తాగునీటి పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాట పోనూ పురపాలిక వాటా రూ.125 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. నిధులు లేకపోవడంతో రూ.45 కోట్లు అప్పు చేసి గుత్తేదారుకు చెల్లించారు. ఈ అప్పునకు ప్రతి నెలా ఈఎంఐ రూపంలో రూ.60 లక్షలు సాధారణ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. వాటిని కూడా రెండేళ్ల నుంచి నిలిపేశారు.

**నెల్లూరు ప్రయోగం జరిగితేనే ప్రయోజనం**

నెల్లూరు నగరపాలక సంఘం అభివృద్ధి పనుల కోసం చేసిన రూ.50 కోట్లకు పైగా అప్పును రద్దు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సొమ్మును ప్రభుత్వమే చెల్లించేలా పురపాలకశాఖ మంత్రి నారాయణ చర్యలు తీసుకొన్నారు. ఇలాగే హిందూపురం మున్సిపాలిటీకి సంబంధించిన అప్పులను, బకాయిలను మాఫీ చేస్తేనే గట్టెక్కగలదు. లేదంటే ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతుంది.

బకాయిలు ఎంతెంత చెల్లించాలంటే.. (రూ.కోట్లలో)

విద్యుత్తు సంస్థకు : 33

ఎల్ఈడీలు సరఫరా చేసిన సంస్థకు : 2.90

పీఏ బీఆర్‌కు : 38.50

గొల్లపల్లి తాగునీటి పథకం ఈఎంఐలు : 13

గుత్తే దారులకు : 12

దీనికి తోడు గొల్లపల్లి తాగునీటి పథకం కోసం చేసిన అప్పు ఇంకా రూ.30 కోట్లు మిగిలి ఉంటుంది.

# విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం



మడకశిర : రాష్ట్రంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం రోజురోజుకు విస్తరిస్తోంది. తక్కువ నీరు, సాగు ఖర్చు తక్కువగా ఉండే చిరుధాన్యాలు, కూరగాయాలు, ఆకుకూరల పంటలు విస్తృతంగా సాగుచేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. బోర్లలో వచ్చే అరకొర నీటికి ఎకరా, రెండెకరాల్లో ఏడాది పొడవున ఆదాయాన్నిచ్చే ఏగ్రేడ్, ఏటీఎం మోడళ్లు, మిశ్రమ పంటలు సాగుచేసి ఆదాయం పెంపొందించుకుంటున్నారు.

**2016లో పైలెట్ ప్రాజెక్టుగా..**

2016లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటలకు సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తూ మంచి ఆరోగ్యకర దిగుబడులను సాధించాలనే సదుద్దేశంతో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా 26 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాప్తాడు, కూడేరు, రాయదుర్గం, తాడిపత్రి, బత్తలపల్లి, కళ్యాణదుర్గం, గుత్తి మండలాలను ఎంపిక చేశారు. మొదట్లో 50 గ్రామాల్లో మాత్రమే ప్రకృతి వ్యవసాయం ఉండేది. 1250 మంది రైతులు 2500 ఎకరాల్లో సాగు చేసేవారు. మంచి నాణ్యమైన దిగుబడులు చేతికందుతుండడంతో క్రమేపి సాగు విస్తరించి రాష్ట్రంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఆదర్శంగా నిలిచింది.

**పనిచేస్తున్న 450 మంది సిబ్బంది:** ప్రకృతి వ్యవసాయ సాగుకు రైతులను ప్రోత్సహిస్తూ అవసరమైన ఎరువుల వాడకం, పంటల మార్పిడి, జీవామృతం, ఘనజీవామృతం, భీజామృతం వంటి ఎరువులను తయారుచేసి నిత్యం రైతులకు జడ్బీఎన్ఎఫ్(జీరోబేస్డ్ నెచురల్ ఫార్మింగ్)సిబ్బంది అండగా ఉంటున్నారు. ఇందులో ఎన్ఎఫ్ఏ, ఎంటీ, ఏఎంఎంటీ, డీఎంఎంటీ, ఎల్1, ఎల్2, ఎల్3 మొత్తం 450 మంది పనిచేస్తున్నారు.

**ఇతర జిల్లాల రైతులకు శిక్షణ**

జడ్బీఎన్ఎఫ్‌లో పనిచేసే ఏఎంఎంటీ, డీఎంఎంటీలు పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, కర్నూల్ తదితర జిల్లాల్లో ఇక్కడి ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

**47 దేశాల శాస్త్రవేత్తలు, ప్రతినిధుల సందర్శన**

ఇక్కడి రైతులు సాగుచేసిన ఏటీఎం మోడళ్లు, మిశ్రమ పంటల సాగును అధ్యయనం చేసేందుకు జర్మనీ, స్పెయిన్, ఇంగ్లాండ్, లండన్, శ్రీలంక, నెదర్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు సందర్శించి పరిశీలించారు. పలురకాల కూరగాయలు పండిస్తున్నా..

-మోహన్‌దాస్, జడ్బీఎన్ఎఫ్ రైతు, నీలకంఠాపురం, మడకశిర మండలం నాకున్న రెండున్నరెకరా పొలంలో ముల్లంగి, క్యారెట్, మునగ, బెండ, వంగతో పాటు ఆకు కూరలు పండిస్తున్నా. ఏగ్రేడ్, ఏటీఎం మోడళ్లలో ఏడాదిలో రూ.3లక్షల ఆదాయం వచ్చింది. ప్రత్యేక మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మంచి ధరలు లభించి రైతుకు లాభసాటిగా ఉంటుంది. భవిష్యత్తులో కీలక పాత్ర- లక్ష్మానాయక్, సీటీఅండ్ఐఓ డీపీఎం, అనంతపురం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో వచ్చిన దిగుబడులను ఆహారంగా తీసుకునేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. తక్కువ ఖర్చు, తక్కువ నీటి ఆవశ్యకత ఉండడంతో ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించే రైతులు అధికమవుతున్నారు. రాబోయే ఐదేళ్లలోపు ప్రతి గ్రామానికి ప్రకృతి వ్యవసాయ విస్తరిస్తుంది.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి



వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు. సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్ట నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.

క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్ధతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.




## జాక్ పిల్ల గ్లామర్ డోస్.. కెవ్వు కేక

తెలుగు యూట్యూబ్ ప్రపంచం నుంచి తెరపైకి వచ్చి, కాస్త ఆలస్యంగా అయినా తన కెరీర్‌ను స్టేడిగా సెట్ చేసుకుంటోంది నటి వైష్ణవి చైతన్య. తొలి అవకాశమే అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' చిత్రంలో చిన్న పాత్రలో వచ్చింది కానీ అసలైన గుర్తింపు మాత్రం 'బేబి' సినిమా ద్వారా వచ్చింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో ఆమె నటన, ఎంపిక చేసిన కథలపై సినీ ఇండస్ట్రీ దృష్టి పడింది. నెక్స్ట్ ఆమె నటించిన జాక్ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అలాగే పలు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇప్పుడు లేటెస్ట్ గా వైష్ణవి తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో కనిపించిన స్టన్నింగ్ లుక్‌తో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. నలుపు రంగు డిజైనర్ సిల్క్ డ్రెస్ లో మెరిసిపోయిన



వైష్ణవి.. తన మోడ్రన్ అవతారాన్ని స్టైలిష్‌గా ప్రదర్శించింది. మాచింగ్‌గా ట్రెండీ బ్లాక్ షర్ట్ బ్లౌజ్ ధరించి, హై ఫ్యాషన్ డ్రెస్‌కు ఓ డిఫరెంట్ టచ్ ఇచ్చింది. దీని వల్ల ఆమె లుక్ మరింత రిచ్‌గా అనిపించింది. ఈ ఫోటోల్లో వైష్ణవి వేసిన జ్యూయెలరీ, స్పెషల్ మెడ చైన్, సింపుల్ మేకప్, స్మోకీ ఐలైనర్ అన్నీ కలిపి ఆమెను కొత్తగా చూపించాయి. స్టైలిష్ హీల్ సాండల్స్, తక్కువ హెయిర్ బన్ స్టైల్ ఆమె లుక్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. "ఇంత గ్లామర్ వైష్ణవి దగ్గర చూసి ఆశ్చర్యపోతున్నాం" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఒక యూత్‌ఫుల్ హీరోయిన్ నుంచి ఇలాంటి సీరియస్ క్లాస్ లుక్ రావడం అంత ఈజీ కాదు. ఫొటోగ్రఫీ కూడా సింపుల్ టోన్‌లో ఉండటంతో ఆమె డ్రెస్ ఎక్స్‌ప్రెషన్లు హైలైట్ అయ్యాయి. ఆమె స్థిరమైన గ్లామర్ గ్రోత్ చూసి, అభిమానులు సర్‌ప్రైజ్ అయ్యారు. ప్రస్తుతం వైష్ణవి చేసిన ఈ లుక్ ఇంటర్నెట్‌లో ట్రెండ్ అవుతోంది. అభిమానులు "బ్లాక్ మ్యాజిక్", "బేబీ క్యూట్ నుంచి స్టన్నింగ్ బ్యూటీగా మారిపోయావ్" అంటూ సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. నటనతో పాటు స్టైల్‌లోనూ వైష్ణవి తనదైన ముద్ర వేసిందని అంటున్నారు.

## మైండ్ బ్లాక్ చేసిన ప్రగ్య బ్యాక్ లెస్ ఫోజ్

సౌత్‌లో పాపులరై, బాలీవుడ్ ని ఏలాలని కలలు గంది ప్రగ్య జైశ్వాల్. ఈ బ్యూటీ ఇటీవల కొంతకాలంగా ముంబైలో సెటిలైంది. అక్కడ తన స్నేహితురాళ్లు మంచు లక్ష్మీ ప్రసన్న, రకుల్ ప్రీత్ లతో కలిసి కెరీర్ వేటలో బిజీ బిజీగా ఉంది. ఇదే సమయంలో హైదరాబాద్ కనెక్షన్స్ ని ప్రగ్య విడిచిపెట్టడం లేదు. తెలుగు పరిశ్రమలో అంది వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు ఈ భామ ఇప్పటికే చాలా దూరం ప్రయాణించింది. పోరాటం సాగించింది. దశాబ్ద కాలంగా అనుకున్నది సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. టాలీవుడ్ లో తనదైన ముద్ర వేయాలని తపించిన ఈ భామ కొన్ని అరుదైన అవకాశాలను అందుకుంది. ఆరంభం కంచెలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రను అందుకుంది. వరుణ్ తేజ్ డెబ్యూ మూవీకి ప్రగ్య ప్రధాన ఆకర్షణగా మారింది. కానీ ఆ తర్వాత దానిని మరో స్థాయికి తీసుకెళ్లాల్సి ఉండగా, అగ్ర హీరోల సినిమాల్లో గ్లామరస్ పాత్రలకు పరిమితమైంది.




ఎన్బీకే సరసన అఖండ, డాకు మహారాజ్ లాంటి భారీ చిత్రాలలో నటించిన ప్రగ్య జైశ్వాల్, సల్మాన్ తో కిసీ కా భాయ్... లాంటి పరిధి తక్కువ ఉన్న పాత్రల్లో మెరిసింది. బాలయ్యతో రెండు సినిమాలు కమర్షియల్ విజయాలు అందుకున్నా బోల్డ్ పెర్ఫామర్ గా తన గుర్తింపును పరిమితం చేసాయి. తన ఎంపికల గురించి నిజాయితీగా అంగీకరించే ప్రగ్య జైశ్వాల్ తదుపరి మరో పెద్ద అవకాశం కోసం ప్రయత్నిస్తోంది. ఈ గ్యాప్ లో అభిమానులకు సోషల్ మీడియాల ద్వారా టచ్ లో ఉంది. ప్రగ్య నిరంతర బోల్డ్ ఫోటోషూట్లు ఇన్ స్టాలో వైరల్ గా దూసుకెళుతున్నాయి. తాజాగా ఈ భామ బ్యాక్ లెస్ ఫోజ్ లో చెలరేగిపోయిన ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. ప్రగ్య ఖరీదైన బ్లేజర్ ధరించి, తనదైన స్టైల్ లో వీపందం ప్రదర్శించింది. చూపులు తిప్పుకోనివ్వని ఈ లుక్ కుర్రకారు గుండెల్ని మరిగిస్తోంది. అఖండ 2 , టైసన్ నాయుడు లాంటి భారీ చిత్రాల్లో ప్రగ్య నటిస్తోంది.

## మలయాళ సినిమాకు ఇలాంటి ఓపెనింగ్సా.. ఇదేమి ఊచకోత సామీ!



ఇండియన్ సినిమా హిస్టరీలో ఇప్పుడు ఒక మలయాళ సినిమా అంచనాలకు మించి చర్చల్లో నిలుస్తోంది. స్టార్ హీరోలతో కాదు, మాస్ మసాలా లేకపోయినా, కంటెంట్ కంటెంట్ గానే ఉంటే ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో తాజాగా 'ఎల్2: ఎంపురాన్' నిరూపిస్తోంది. లూసిఫర్ సినిమాకు సీక్వెల్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే టీజర్, ట్రైలర్‌తో మంచి బజ్ సెట్ చేసుకుంది. కానీ ఈ బజ్‌ని క్యాష్ చేయడం చాలా సినిమాలకు కష్టమే. కానీ ఎల్2 మాత్రం దాన్ని వాడేసుకుంది. మోహన్‌లాల్ నటనకి ఉన్న క్రేజ్, పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌తో కూడిన స్క్రీన్‌ప్లేకి ప్రేక్షకుల్లోనూ ట్రేడ్‌లోనూ మంచి హైప్ ఉంది. ఇక ఆ ఆసక్తి వలన, విడుదలకు ముందే భారీ స్థాయిలో కనిపిస్తోంది. అంతేకాదు, ఇప్పుడిదే సినిమాకు చరిత్ర సృష్టించే స్థాయిలో ఓపెనింగ్స్‌ను తీసుకురావడంలో కీలకంగా మారింది. భారీ బడ్జెట్‌తో, దేశవ్యాప్తంగా మల్టీ లాంగ్వేజ్ రిలీజ్ చేస్తుండటంతో, 'ఎల్2: ఎంపురాన్'కు అన్ని కేంద్రాల్లోనూ భారీ అడ్వాన్స్ బుకింగ్స్ నడుస్తున్నాయి. లేటెస్ట్ టాక్ ప్రకారం, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రీ సేల్ వసూళ్లు రూ.20 కోట్ల మార్క్‌ను దాటేశాయట. మలయాళ సినిమా హిస్టరీలో ఇదే హయ్యెస్ట్ అని తెలుస్తోంది. ఇప్పటివరకు ఎవరూ అందుకోలేని స్థాయిలో మోహన్‌లాల్ ఈ చిత్రం ద్వారా మార్కెట్‌ను విస్తరించాడు. బుక్ మై షోలో 24 గంటల్లో 6.28 లక్షల టికెట్లు అమ్ముడవడం కూడా ఓ రికార్డే. ఇప్పటివరకు అల్లు అర్జున్ 'పుష్ప 2', ప్రభాస్ 'కల్కి 2898%ూaణ%' వంటి బిగ్ బడ్జెట్ చిత్రాలకు మాత్రమే వచ్చిన రేంజ్ ఇది. ఈ హైప్ వల్ల ఫస్ట్ డే వసూళ్లు కచ్చితంగా కొత్త రికార్డులను క్రియేట్ చేయబోతున్నాయన్న అంచనాలు ఉన్నాయి. మలయాళం మాత్రమే కాదు, ఇతర భాషల్లోనూ బుకింగ్స్ స్టెడీగా పెరుగుతున్నాయి. తమిళ్, తెలుగు, కన్నడ రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లలో ఈ సినిమాకు స్పెషల్ స్క్రీన్లు కేటాయించబడుతున్నాయి. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంతో పాటు ఆయన నటన కూడా ఈ సినిమాకి మిలియన్ల ప్రేక్షకులను మళ్లించబోతున్నట్లు తెలుస్తోంది. మార్చి 27న రిలీజ్ కానున్న ఈ సినిమా మొదటి వారం పూర్తయ్యేలోపు ఈజీగా 100 కోట్ల మార్క్‌ను క్రాస్ చేయగలదా అన్నదే ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఒక మలయాళ సినిమాకి దేశవ్యాప్తంగా ఈ స్థాయిలో ప్రేక్షకుల స్పందన రావడం అరుదైన పరిణామం. ఇది కేవలం మోహన్‌లాల్ స్టామినాకు కాదు, కంటెంట్‌కు ప్రేక్షకుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం. ఇక రిలీజ్ తర్వాత వసూళ్ల వర్షం ఎప్పటి వరకు సాగుతుందో చూడాలి.

## ఒక్కరోజు గ్యాప్ లో ఇద్దరి మధ్య పెద్ద యుద్ధమే!



2026 మార్చి 20న బిగ్ ఫైట్ తప్పదా? టాక్సిక్ వర్సెస్ లవ్ అండ్ వార్ పోటాపోటీగా బరిలోకి దిగుతున్నాయా? అంటే అవుననే తెలుస్తోంది. కేజీఎఫ్ తర్వాత యశ్ చాలా గ్యాప్ తీసుకుని చేస్తోన్న చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ ఇది. ఇదీ డ్రగ్స్ మాఫియా నేపథ్యంలో తెరకెక్కిస్తోన్న చిత్రం. కేజీఎఫ్ తో పాన్ ఇండియాలో యశ్ సంచలన స్టార్ గా మారాడు. ఈ నేపథ్యంలో అతని కోణంలో సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. అయితే ఇప్పటివరకూ రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు ఆ అంచనాలను కిల్ చేస్తున్నాయి? అన్నది అంతే వాస్తవం. టీజర్ సహా కొన్ని రకాల ప్రచార చిత్రాలతో ఇది రొటీన్ గా అనిపించింది తప్ప ఏ మాత్రం కొత్తదనం కనిపించలేదు. ప్రతిగా యశ్ విమర్శలు కూడా ఎదుర్కొన్నాడు. ఈ సినిమా కోసం ఇంత సమయం వెచ్చించడమా? అంటూ నెగిటివిటీని ఎదుర్కొన్నాడు. మరి రిలీజ్ సమయానికి ఆ నెగిటీని తొలగించుకుంటాడా? లేదా? అన్నది చూడాలి. ఇక రణబీర్ కపూర్ -అలియా భట్ జంటగా సంజయ్ లీలా భన్సాలీ లవ్ అండ్ వార్ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. భన్సాలీ మార్క్ లవ్ స్టోరీ ఇది. స్వచ్ఛమైన ప్రేమను ఇందులో హైలైట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే భారీ యాక్షన్ సన్నివేశాలకు కొదవలేదు. ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. ఇద్దరు కలిసి చాలా కాలం తర్వాత చేస్తోన్న లవ్ జోనర్ కావడంతో ఓ సెక్షన్ ఆడియన్స్ ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ రెండు సినిమాల్లో ఒకటి మార్చి 19న...మరొకటి 20న రిలీజ్ అవ్వడంతో? బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ తప్పదు. %-%టాక్సిక్%-% పాన్ ఇండియాలో రిలీజ్ అవుతుంది. లవ్ అండ్ వార్ కూడా పెద్ద ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. రెండు సినిమాల రిలీజ్ సమయంలోనే పబ్లిక్ హాలీడేస్ కూడా కలిసి రావడంతో? అంతి మంగా బాక్సాఫీస్ విజేత ఎవరు? అన్న దానిపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.

## ఫోటోటాక్ : నల్ల కలువ అవతార్‌లో త్రిప్తి

'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి డిమ్రి గత ఏడాది బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈమె నటించిన భూల్ భులయ్యా 3 సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే యానిమల్ సినిమాలో ఓవర్ డోస్ శృంగార సన్నివేశాల్లో నటించి గుర్తింపు దక్కించుకోవడం వల్ల అన్ని సినిమాల్లోనూ అలాంటి పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయట. దాంతో త్రిప్తి సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇటీవల ఒక స్టార్ హీరో సినిమాలో త్రిప్తి హీరోయిన్‌గా ఎంపిక అయి, ఆమెకు ఉన్న ఇమేజ్ కారణంగా తప్పించారనే వార్తలు వస్తున్నాయి. త్రిప్తి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ధడక్ 2 సినిమాతో పాటు ఇంకా టైటిల్ ఖరారు కానీ మరో సినిమాలోనూ త్రిప్తి ప్రస్తుతం నటిస్తోంది. ఆ రెండు సినిమాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సందడికి సిద్ధం అవుతున్న త్రిప్తి తనపై ఉన్న ఇమేజ్‌ను తొలగించుకునే ప్రయత్నాలు చేస్తుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు వస్తే తప్పకుండా మెప్పిస్తాను అనే నమ్మకంతో ఇటీవల



ఒక ఇంటర్వ్యూలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. సినిమాల్లో అందాల తారగా కంటే ఉత్తమ నటిగా గుర్తింపు దక్కించుకోవడం కోసం ఎదురు చూస్తున్నట్లు త్రిప్తి చెప్పుకొచ్చింది. అంతే కాకుండా ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీ అంటూ ఒక ఇంటర్వ్యూలో ఓపెన్‌గానే చెప్పుకొచ్చింది. సినిమాల్లో బిజీ బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి త్రిప్తి బ్లాక్ డ్రెస్‌లో సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే స్టైలిష్ లుక్‌లో త్రిప్తి ఆకట్టుకుంది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పునివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందంగా ఉన్న త్రిప్తిని వెండి తెరపై శృంగార తార పాత్రలో చూసేందుకు ఎక్కువ శాతం మంది ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ సైతం అదే విధంగా ఆమెను చూపించాలని భావిస్తున్నారు. కానీ త్రిప్తి మాత్రం నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసేందుకు ఎదురు చూస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్‌లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. యానిమల్ సినిమా విడుదలైన వెంటనే ఒక సౌత్ సినిమాలో ఈమెకు ఆఫర్ వచ్చిందనే టాక్ వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా పట్టాలెక్కలేదు. త్వరలోనే సౌత్‌లో ఈమె నటిస్తుందేమో చూడాలి. యానిమల్ సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న యానిమల్ పార్క్‌లో ఈమె పాత్ర ఏమైనా ఉండే అవకాశం ఉందా అంటూ పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## బిగువుల ప్రదర్శన సరే వ్వాట్ నెక్ట్స్ రాశీ?

నేటి జనరేషన్ స్టార్స్ లో తెలివైన ఎంపికలతో కెరీర్ బండిని నడిపిస్తున్న భామగా రాశీ ఖన్నాకు గుర్తింపు ఉంది. టాలీవుడ్ లో యంగ్ హీరోల సరసన నటిస్తూనే, దర్శకద్వయం రాజ్ అండ్ డీకే ప్రాజెక్ట్ ఫర్జీలో నటించింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో ఈ బ్యూటీ పాన్ ఇండియాలో అభిమానులను ఫిదా చేసింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిందీ చిత్రాల్లో నటించేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేసింది. ఆరణ్మనై 4 తో కమర్షియల్ విజయం అందుకుంది. ది సబర్మతి రిపోర్ట్, సర్దార్ లాంటి సినిమాలు తనకు నటిగా మంచి పేరు తెచ్చాయి. తెలుసు కదా! అనే తెలుగు చిత్రంలోను ఈ బ్యూటీ



నటిస్తోంది. అటు బాలీవుడ్ లో ఇంకా టైటిల్ నిర్ణయించని ఎ క్రేజీ మూవీలో నటిస్తోంది. కెరీర్ మ్యాటర్ ఇలా ఉండగానే, రాశీ యూత్ లో తన ఫాలోయింగ్ ఎంతమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. ప్రస్తుత కాంపిటీషన్ లో తనను తాను నిలబెట్టుకునేందుకు వరుస ఫోటోషూట్లతో ఫ్యాన్ డమ్ కి టచ్ లో ఉంది. రాశీ తాజాగా తన ఫిట్నెస్ గురూ కుల్ దీప్‌తో కలిసి జిమ్ లో శ్రమిస్తున్న కొన్ని ఫోటోలను షేర్ చేసింది. రాశీ పర్ఫెక్ట్ ఫిట్ టోన్డ్ బాడీని హైలైట్ చేస్తూ ఈ ఫోటో షూట్ గుబులు పుట్టిస్తోంది. బ్లాక్ అండ్ బ్లాక్ - ఆల్ బ్లాక్ ట్రాక్ లో ఉన్న ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో తుఫాన్ సృష్టిస్తున్నాయి. రాశీ నడుము నెమ్మదిగా జీరో నుంచి మైనస్ సైజ్ కి తగ్గిపోవడం ఖాయమని ఈ హార్డ్ వర్క్ చెబుతోంది. కొంత కఠినమైన వ్యాయామ సెషన్స్ కి రాశీ ఖన్నా అటెండవుతోంది. నేను ఏడవకుండా ఆ సెషన్‌లో బయట పడ్డాను. సెల్ఫీలు తీసుకునేంత అందంగా అనిపించింది! అంటూ కొంటె ఫన్నీ ఈమోజీని రాశీ షేర్ చేసింది. రాశీని షేపప్ చేసేందుకు కోచ్ కుల్ దీప్ సేథి చాలా శ్రమిస్తున్నారనడానికి ఈ ఫోటోలే ప్రూఫ్.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536